శ్రీమతే రామానుజాయ నమః
శ్రీమద్వరవరమునయే నమః



నాచ్చియార్ తిరుమొళి - తాత్పర్యంతో

'పండితరత్న' డా|| ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి అళగ శింగరాచార్యులు

సమర్పణ: వంగల వేంకట కేశవ అయ్యంగారు

శ్రీ విల్లిపుత్తూర్ అండాళ్

రంగనాథస్వామి, శ్రీరంగం

విజ్ఞప్తి

సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుని నిర్హేతుక కటాక్షం చేత ఏదోషం లేని, భక్తి రూపంగా పరిణమించిన జ్ఞానాన్ని కలిగిన ఆళ్వారులు అనబడే దివ్య సూరులలో గోదాదేవి ఒకరు. మిగిలిన ఆళ్వారుల భక్తి ఒక ఎత్తు అయితే, ఆండాళ్ అనబడే గోదాదేవి యొక్క భక్తి ఒక ఎత్తు అని మన పూర్వాచార్యుల అభిప్రాయం. శ్రీ మణవాళ మహాములులు ఉపదేశరత్తినమాలై అనే ప్రబంధంలో గోదాదేవిని గూర్చి పలుకుతూ "అంజకుడిక్కు ఒరు సంతతి" (భగవంతుని మంగళాశాసనం చేసే ఆళ్వార్లకు అందరికీ అద్వితీయమైన పుత్రిక) అని, "అఴ్వార్కళ్ తమ్ శెయలై వింజినియుమ్ తన్మైయళాయ్" (ఆళ్వారుల భక్తి కంటే మించి ఉండే భక్తిని కలిగినదై) అని, "పింజాయ్ పழுత్తాళై" (చిన్న వయస్సులోనే భక్తిలో పరిపూర్ణతను పొందినది) అని ఆశ్చర్యాన్ని కలిగించే మూడు విశేషణాలను ప్రయోగిస్తూ ఈమె వైలక్షణ్యాన్ని సూచించారు. తిరుప్పావై ప్రబంధం అనుగ్రహించేనాటికి గోదాదేవికి ఐదు సంవత్సరాల వయస్సు అని శ్రీ పిళ్ళై లోకమ్ జీయర్ ఉపదేశరత్తోనమాల ప్రబంధ వ్యాఖ్యానంలో తెలియజేయడం ఈమె భక్తి వైభవానికి ఒక నిదర్శనం.

గోదాదేవి అనుగ్రహించిన ప్రబంధాలు రెండు. వాటిలో, మొదటిది తిరుప్పావై ప్రబంధం. రెండవది నాచ్చియార్ తిరుమొழி అనే ప్రబంధం. హిందువులు ఈ ప్రబంధంలో 143 పాశురాలు ఉన్నాయి. ఇవి అన్ని ప్రణవంలోని ఉకారంద్వారా వ్యక్తమవుతున్న, ఆత్మ –పరమాత్మల మధ్య ఉండే, సహజమైన భర్తృ భార్యా సంబంధాన్ని విశదం చేస్తున్నది అని పెద్దల అభిప్రాయం. జన్మతః పురుషులై పుట్టి, తమలో స్త్రీ భావాన్ని ఆరోపించుకున్నారు, మిగిలిన దివ్యసూరులు. ఆ ఆవశ్యకత లేకుండానే సహజంగానే స్త్రీగా పుట్టిన ఈమె పలికే సూక్తులలో ఒక వైలక్షణ్యం ఉన్నదని మన పూర్వాచార్యుల అభిప్రాయం.

ఎంతో అందమైన ఈ నాచ్చియార్ తిరుమొழி ప్రబంధానికి పరమ కారుణికులు అయిన పెరియవాచ్చాన్ పిళ్ళై చాలా విస్తృతమైన, గంభీరమైన వ్యాఖ్యానాన్ని అనుగ్రహించారు. ఈ సంవత్సరం ఆండాళ్ తిరువనక్షత్ర మహోత్సవాన్ని పురస్కరించుకుని నాచ్చియార్ తిరుమొழி ప్రబంధం తాత్పర్యంతో ప్రపన్న లోకానికి సమర్పింపబడుతున్నది. ఈ గ్రంథంలో పెరియవాచ్చాన్ పిళ్ళై తమ వ్యాఖ్యానంలో ప్రతి దశకానికి ప వారు అనుగ్రహించిన అవతారికలు అనువదించి ఇవ్వబడ్డాయి. దీనివల్ల ఆయా దశకాలలోని ప్రమేయ తాత్పర్యాన్ని సులభంగా గ్రహించవచ్చు కదా.

విషయసూచిక

నాచ్చియార్ తిరుమొళి త్తనియన్ కళ్..... 4

అవతారిక..... 5

ముదల్ తిరుమొళి - తైయిరు తింగళుమ్..... 8

ఇరణ్డామ్ తిరుమొళి - నామమాయిరమ్..... 14

మూన్ఱామ్ తిరుమొళి - కోళి అళైప్పదన్..... 21

నాలామ్ తిరుమొళి - తెళ్ళియార్ పలర్..... 33

ఐందామ్ తిరుమొళి - మన్ను పెరుమ్ పుగళ్..... 40

ఆఱామ్ తిరుమొళి - వారణమాయిరమ్..... 50

ఏళామ్ తిరుమొళి - కరుప్పూరమ్ నాఱుమో..... 59

ఎట్టామ్ తిరుమొళి - విణ్ణిల మేలాప్పూ..... 68

ఒన్బదామ్ తిరుమొళి - శిందుర చ్చెమ్బొడి..... 75

పత్తామ్ తిరుమొళి - కార్కోడల్ పూక్కళ్..... 81

పదినోరామ్ తిరుమొళి - తాముగక్కుమ్..... 90

పన్ని రణ్డామ్ తిరుమొళి - మట్రిరుందీర్ కట్కు..... 98

పదిన్ మున్ఱామ్ తిరుమొళి - కణ్ణన్ ఎన్నుమ్..... 107

పదినాలామ్ తిరుమొళి - పట్టి మేయ్ న్ఱు..... 114

నాచ్చియార్ తిరుమొళి

నాచ్చియార్ తిరుమొళి త్తనియన్ కళ్

తిరుక్కణ్ణమంగైయాండాన్ అనుగ్రహించినది

*అల్లి నాళ్ తామరై మేల్ ఆరణంగిన్ ఇన్ తుణైవి *
మల్లి నాడాణ్ణ మడమయిల్ - మెల్లియలాళ్ *
ఆయర్ కుల వేందన్ ఆగత్తాళ్ * తెన్ పుదువై
వేయర్ పయంద విళక్కు*

రేకులను కల, అప్పుడే వికసించిన తామర పువ్వులో పొందికగా వేంచేసి ఉండే దైవకాంత అయిన లక్ష్మీదేవికి ఇష్టసఖి, మల్లినాడును తన తన గుణాలతో అభినివేశాన్ని కలిగించి పాలించే అందమైన నెమలి వంటిది, సౌకుమార్యాన్ని కలిగినది అయిన గోదాదేవి– గోపాల కులానికి ప్రభువైన శ్రీకృష్ణుని తిరుమేనితో పొందికను కలిగినది, అందమైన శ్రీవిల్లిపుత్తూరులో అవతరించినవారైన పెరియళ్వార్లచే పొందబడిన గొప్ప దీపమై వెలుగుతున్నది.

అవతారిక

తిరుప్పావై ప్రబంధంలో "ఉందన్నై ప్పిఱవి పిఱందన పుణ్ణియమ్ యాముడైయోమ్" (తిరుప్పావై– 28) (నీతో పాటు పుట్టిన అదృష్టానికి మేము సోచుకున్నాము) అని అంటూ ఉపాయంగా భగవంతుని ఆశ్రయించి, “ఉనక్కేనామ్ ఆళ్ శెయ్ వోమ్" (తిరుప్పావై– 29) (నీకే మేము కైంకర్యం చేస్తాము) అని అంటూ ఆ స్వామికి సంతోషం కలిగించే కైంకర్యమే ప్రాప్యం అని గోదాదేవి నిశ్చయించుకున్నది. చేతనునకు ప్రాప్యానికి కావలసినది ఈ స్థితి మాత్రమే. అది గోదాదేవి వద్ద ఏ లోటు లేకుండా ఉన్నది. భగవంతుని వద్ద కూడా ఈమెను పొందాలి అనే అభినివేశం సంపూర్ణంగా ఉన్నది. ఈ విధంగా ఇద్దరి దగ్గర ఏ లోటు లేకుండా ఉన్నప్పటికీ, భగవంతుడు గోదాదేవిని స్వీకరించలేదు. ఈ విధంగా అతడు తనను స్వీకరించకుండా ఉండడానికి ఏమి కారణం? అని ఆమె విచారించింది. తాను అతనిని తప్ప కర్మయోగం మొదలైన అన్య సాధనాలను అనుష్ఠించి ఉంటే, "అవి నెరవేరిన తరువాత భగవంతుని పొందుదాం" అని సహించి ఉండవచ్చు. తాను ఆ విధంగా ఇంకొక ఉపాయాన్ని ఆశ్రయించనందున ఆలస్యాన్ని సహించలేకపోయింది. భగవంతుడు అయితే ఫలాన్ని తప్పకుండా ఇచ్చే సిద్ధోపాయమై ఉన్నాడు. అయినప్పటికీ ఫలం కలుగలేదు. ఫలం సిద్ధించనందున "దీనిని చేయవచ్చు, దీనిని చేయకూడదు" అని విచారించడానికి వీలులేని విధంగా గోదాదేవి కలత పొందింది. ప్రేమికులు ఒకరికి ఇంకొకరు దూరమైనప్పుడు, విశ్లేషం వల్ల కలిగిన కలత చేత మళ్లీ కలవడానికి "మడల్ ఎత్తడం" అనే స్వరూపానికి తగని పనిని చేసేటట్లే, గోదాదేవి కూడా దేవతాంతర సమాశ్రయణాన్ని "తైయిరు తింగళుమ్" అనే దశకంలో చేసింది. ఎందరో దేవతలు ఉండగా, మన్మథుని మాత్రమే ఎందుకు ఆశ్రయించింది? అని అంటే, విడిపోయిన ప్రేమికులను కలపడమే స్వభావంగా కలిగినవాడు అనే గొప్పతనం ఇతనికే గల ఒక విశేషం కనుక, ఇదే ఆలంబనంగా చేసుకొని కామదేవుడనే మన్మథుని ఆశ్రయించి, భగవంతుని పొందడానికి తగిన ప్రయత్నాన్ని గోదాదేవి ఆరంభించింది.

ఈ విధంగా మనసులో ఏర్పడిన కలతచేత అన్య దైవాలను ఆశ్రయించినవారు ఉన్నారా? అని అంటే, శ్రీరాముని తప్ప వేరొకరిని తెలియని అయోధ్యాపుర వాసులు "స్త్రియో వృద్ధాः తరుణ్యశ్చ సాయం ప్రాతः సమాహితాः, సర్వాన్ దేవాన్ నమస్యంతి రామస్యార్థే

యశస్వినః" (రామాయణం –అయోధ్యకాండ– 2–52) (అయోధ్యా నగరంలో ఉండే స్త్రీలు, వయస్సు మీరినవారు, వయసు వచ్చిన వనితలు ఉదయం, సాయంత్రం అందరూ కలసి కలసి దేవ శత్రువులను జయించే కీర్తిని పొందిన రాముని కోసం అన్ని దైవాలను నమస్కరించేవారు) అనే విధంగా శ్రీరామునకు మంచిని కోరి అన్ని దైవాల పాదాలలో నమస్కరించేవారు కదా. భావో నాన్యత్ర గచ్ఛతి (నా మనోభావం రాముని విడచి వేరొకరిపై పోవడం లేదు) అని రాముని విషయంలో ఉండే ఆరని ప్రేమ చేత పరమపదనాథుని కూడా నేను కోరను– అని అన్నాడు, హనుమంతుడు. "నమోస్తు వాచస్పతయే" (రామాయణం– సుందరకాండ 32 –14) (వాచస్పతికి నమస్కారం) అని రాముని కార్యం కోసం దేవతాంతర సమాశ్రయణాన్ని హనుమంతుడు చేశాడు కదా. ఆ విధంగానే "ఇంతవరకు నేను భగవంతునే ఉపాయంగాను, ఫలంగానూ ఆశ్రయించి, అన్య దైవాలను, ఉపాయాంతరాలను ఆశ్రయించడం మానివేసాము" అని తెలియలేని విధంగా కలత చెందిన ఈమె చేయదగని కామదేవ సమాశ్రయణాన్ని కూడా చేసింది కదా! "యయౌ చ కాచిత్ ప్రేమాంధా తత్పార్శ్వమవలంబితుమ్" (విష్ణు పురాణం –5–13 –19) (ప్రేమ చేత జ్ఞానం అంతా కలకత చెందిన ఒక గోపిక శ్రీకృష్ణుని పక్కకు అతని పార్శ్వాన్ని ఆలంబనం చేసుకోవడం కోసం వెళ్ళింది) అనే విధంగా సహించలేని గొప్ప ప్రేమ ఇటువంటి పడరాని పాట్లను పెడుతుందికదా.

పరమ సాత్వికులైన పెరియాళ్వాల కడుపున పుట్టిన గోదాదేవి సత్వగుణంలో ఊనికను కల సాత్వికులలో చేరి, భగవంతుని ఆశ్రయించవలసి ఉండగా, " రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగ సముద్భవమ్”(గీతా –14–7) (యువతీ యువకుల ప్రేమకు కారణమైనది, పుత్రమిత్రాధుల విషయంలో సంబంధానికి ఉత్పత్తి స్థానమైనది రజోగుణం అని తెలుసుకో) అని చెప్పబడే రజోగుణం అతిశయించిన మన్మథుని పాదాలపై పడడం ఏ విధంగా సమంజసం? అని అంటే, "స్త్రియో వృద్ధాః తరుణ్యశ్చ సాయం ప్రాతః సమాహితాః, సర్వాన్ దేవాన్ నమస్యంతి రామస్యార్థే యశస్వినః" (రామాయణం –అయోధ్యకాండ– 2– 52) (అయోధ్యా నగరంలో ఉండే స్త్రీలు, వయస్సు మీరినవారు, వయసు వచ్చిన వనితలు ఉదయం, సాయంత్రం అందరూ కలసి కలసి దేవ శత్రువులను జయించే కీర్తిని పొందిన రాముని కోసం అన్ని దైవాలను నమస్కరించేవారు) అనే విధంగా ఏనాడు విశ్లేషం లేని లక్ష్మీ లక్ష్మీనాథుల కలయిక నిత్యంగా కొనసాగాలి అని అయోధ్యపుర జనులు అన్ని దైవాల పాదాలపై పడినట్లుగాను,

అంజుకుడిక్కు ఒరు సంతతి" (భగవంతునకు మంగళాశాసనం చేసే ఆళ్వారుల కులంలో అద్వితీయమైన సంతతి) (ఉపదేశ రత్నమాల –24) అనే విధంగా భగవంతునకు మంగళాశాసనం చేయడమే స్వభావంగాకల ఆళ్వారులు అందరికీ అభిమాన పుత్రిక అయిన ఈ గోదాదేవి యొక్క తండ్రులలో ఒకరైన నమ్మాళ్వారులు "దెయ్ వంగాళ్" (తిరువాయ్ మొழி– 5–4–9) అనే పాశురంలో భగవంతుని విశ్లేషించినందువల్ల కలిగిన కలతచేత అన్యదేవతలను పురస్కరించుకున్నట్లు, ఈమె కూడా భగవంతుని పొందలేనందున జ్ఞానం అంతా కలత చెంది, "ఆ స్వామిని ఏ విధంగా అయినా పొందితీరాలి" అనే ప్రబలమైన త్వరచేత కాముని పాదాలపై పడుతున్నది. ఇటువంటి కలతచేత "విడిపోయిన ప్రేమికులను కలుపగలిగినవాడు" అని ఒకే కారణంచేతనే, మిగిలిన దైవాలు ఎందరో ఉండగా, మన్మథుని ఈమె ఆశ్రయిస్తున్నది. "తన శరీరాన్ని నశింప చేసుకున్నా, విడిపోయిన ప్రేమికులను కలిపేవారు, ఇతడు" అనే సంగతి కుమార సంభవ గాథలో ప్రసిద్ధం కదా. ఈ విధంగా ప్రాప్య త్వరచేత జ్ఞానం అంతా కలత చెంది, ఈమె మన్మథు–ని పాదాలపై పడుతున్నది అని ఏర్పడుతున్నది. గోదాదేవి చేసే కామ సమాశ్రయణం ఎంతవరకు వెళ్ళింది?అంటే, పెరియాళ్వారులు "పూచే పూలు అన్నీ వటపత్రశాయి స్వామి యొక్క కేశపాశానికే ఉపయోగపడాలి "అనే ప్రాప్యరుచిచేత భగవంతుని కోసం నందనవనాన్ని నిర్మించి, పూలను చెట్లను పెంచడంలో అభినివేశాన్ని పొందినట్లే, ఈమె కూడా “మత్త నన్నఱుమలర్ మఱుక్కమలర్ క్కొండు" (నాచ్చియార్ తిరుమొழி– 1–3) "ఉమ్మెత్త పువ్వులు, మఱుక్కమనే పూలు మన్మథుని పాదాలకే సమర్పించాలి" అని భావించి, ఉమ్మెత్త చెట్లు, మఱుక్క పూల చెట్లు మొదలైనవానిని పెంచడంలో కాలక్షేపం చేసే అవధికి ప్రాప్తిత్వర అతిశయించినది అయినది.

అవతారిక పూర్తి అయినది

ముదల్ తిరుమొళి - తైయిరు తింగళుమ్

గోదాదేవి తనను శ్రీకృష్ణుని సన్నిధికి చేర్చమని మన్మథుని ప్రార్థించడం ఈ దశక సారాంశం. ఈ మొదటి పాశురంలో మన్మథుని, అతని తమ్ముడు అయిన సాంబుని ఆశ్రయించే రీతిని తెలుపుతున్నారు, గోదాదేవి.

*** తైయిరు తింగళుమ్ తరై విళక్కి *త్తణ్ మణ్ణలమిట్టు మాశి మున్నా ళ్ **
*ఐయ నుణ్మ ణఱ్కొణ్డు తెరువణిందు *అఴగినుక్క లంకరిత్తు అనంగ దేవా! ***
*ఉయ్యవుమ్ ఆంగొలో ఎన్ను శొల్లి *ఉన్నై యుమ్ ఉంబియైయుమ్ లో*ద్రుదేన్ **
*వెయ్యదోర్ తఴలుమిఴ శక్క ర క్కై *వేంగడవఱ్కెన్నై విదిక్కట్టి్యే 1*

పుష్య మాసం అంతా శ్రీకృష్ణ స్వామి వచ్చే చోటును శుద్ధిచేసి, చల్లగా అందంగా ఉండే మండలాకారమైన ముగ్గును పెట్టి, మాఘమాసంలో మొదటి పక్షంలో అందమైన సన్నని ఇసుకతో అతడు వచ్చే దారిని అందం కోసమే అలంకరించి, ఓ మన్మథా! "ఉజ్జీవించగలమా?" అని పలికి, నిన్ను, నీ తమ్ముడైన సాంబుని నమస్కరించాను. మిక్కిలి వేడిమిని కలిగిన, నిప్పులను వర్షించే చక్రాయుధాన్ని చేతిలో కలవాడైన వేంకటేశ్వరుని నన్ను అంతరంగ కైంకర్యం చేసేటట్లుగా నీవు (విధించాలి) చేయాలి.

*వెళ్ళె నుణ్మ ణఱ్కొణ్డు తెరువణిందు *వెళ్వ్యరైప్పదన్ మున్న మ్ తుఱై పడిందు **
*ముళ్ళుమిల్లా చ్చుళ్ళి ఎరి మడుత్తు *ముయ్యున్నై నోఱ్కిన్ఱేన్ కామ దేవా! ***
*కళ్ళవిఴ్ పూంగణై తొడుత్తు క్కొణ్డు *కడల్వణ్ణన్ ఎన్బదోర్ పేర్ ఎఴుది **
*పుళ్ళినై వాయ్ పిళందాన్ ఎన్బదోర్ *ఇలక్కినల్ పుగ వెన్నై ఎయ్ క్కిట్టి్యే 2*

తాను నోము నోచే విధానాలను వివరంగా పలుకుతూ, “నన్ను భగవంతునితో కలపాలి" అని గోదాదేవి ఇందులో ప్రార్థిస్తున్నది.

మన్మథా! తెల్లని సన్నని ఇసుకతో స్వామి వచ్చే దారిని అలంకరించి, తూర్పు తెల్లవారడానికి ముందే చెరువులలో స్నానం చేసే రేవులకు వెళ్లి స్నానం చేసి, ముళ్ళు, చీమలు మొదలైనవి లేని సమిధలను అగ్నిలో సమర్పించి, నీ విషయంగా వ్రతాన్ని

ఆచరిస్తున్నాను. మకరందం ఒలుకుతున్న పుష్పాలు అనే బాణాలను నీ వింటిలో సంధించి, సముద్ర వర్ణుడు అని చెప్పబడే అద్వితీయమైన లక్ష్యంలో ప్రవేశించేటట్లుగా నాపై నీవు వాటిని ప్రయోగించాలి.

*మత్త నన్న ఱుమలర్ ముఱుక్క మలర్కొణ్ఱు *ముప్పోదుమ్ ఉన్న డి వణంగి *
తత్తువం ఇలి ఎన్ఱు నెంజెరిందు *వాశగత్తగ్గిత్తు ఉన్నై వైదిడామే **
కొత్తలర్ పూంగణై తోడుత్తు కొణ్ఱు *గోవిందన్ ఎన్ఱదోర్ పేర్ ఎళుది *
విత్తగన్ వేంగడవాణన్ ఎన్ఱు మ్ *విళక్కినిల్ పుగవైన్నై విదిక్కిట్రియే 3*

నా మనస్సు మండి నిన్ను నిందించ కూడదు అంటే, నీవు నన్ను వేంకటేశ్వరునిలో కలపాలి"– అని అంటున్నది.

కామదేవా! చక్కని ఉమ్మెత్త పువ్వులను, పలాశ పుష్పాలను చేతిలో ధరించి, ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం అనే మూడు సమయాలలో నీ పాదాలకు నమస్కరించి ఆరాధిస్తున్నాను. "ఇతడు సత్యంతప్పినవాడు" అని నా మనసులో బాధపడి, నోటితో నిన్ను దూషించని విధంగా, గుత్తులు గుత్తులుగా వికసిస్తున్న పూల బాణాలను నీ ధనుస్సులో సంధించి "గోవిందుడు "అనే చెప్పబడే అద్వితీయమైన పేరును మనస్సులో రాసుకొని, ఆశ్చర్యాన్ని కలిగించేవాడైన శ్రీవేంకటేశ్వరుడు అని చెప్పబడే దీపంలో ప్రవేశించే టట్లు నన్ను నీవు నియమించాలి.

*శువరిల్ పురాణ! నిన్ పేర్ ఎళుది *శుఱువ నఱ్ఱొడిక్క ళుమ్ తురంగంగళుమ్ *
కవరి ప్పిణాక్క ళుమ్ కరుప్పు విల్లుమ్ *కాట్టి త్తందేన్ కండాయ్ కామ దేవా! **
అవరై ప్పిరాయమ్ తోడంగి * ఎన్ఱుమ్ఆదరిత్తెళ్ళ ఎన్ తడముళైగళ్ *
తువరై ప్పిరానుక్కే శంగఱ్ప్పిత్తు *త్తొళుదు వైత్తేన్ ఒల్లై విదిక్కిట్రియే 4*

తన ఆర్తిని ఈ పాశురంలో గోదాదేవి వ్యక్తం చేస్తున్నది.

చాలా ప్రాచీనుడవైన ఓ మన్మథా! గోడలపై నీ నామాలను రాసి, సొఱ చేపల రూపాలను లిఖించిన మంచి ధ్వజాలను, గుర్రాలను, చామరాలను ధరించిన స్త్రీలను, చెరకు వింటిని నీకు చెందేటట్లు సిద్ధం చేసి ఉంచాను సుమా. చాలా చిన్నతనం నుండి

ఎప్పుడూ ఒకే విధంగా కోరి, ఆశపడి వృద్ధి చెందిన నా పెద్ద వక్షోజాలను ద్వారకానాథుడైన కృష్ణుని కోసమే అని మనసులో సంకల్పించుకొని నమస్కరించాను. శీఘ్రంగా అది సిద్ధించేటట్లు నీవు విధించాలి (చేయాలి) .

*వానిడై వాఝ్ మవ్వానవర్క్కు *మజైయవర్ వేళ్వియిల్ వగుత్త అవి *
కానిడై త్తిరివదోర్ నరి పుగుందు *కడప్పదుమ్ మోప్పదుమ్ శెయ్ వదొప్ప **
ఊనిడై ఆళి శంగు ఉత్తమర్క్కెన్ను *ఉన్ని త్తెళ్ళుదనెన్ తడములైగళ్ *
మానిడవర్క్కెన్ను పేచ్చుప్పడిల్ *వాళ్గకిల్లేన్ కణ్ణాయ్ మన్ను దనే! 5*

"శ్రీకృష్ణునకు తప్ప ఇంకొకరికి నన్ను సొత్తుగా చేస్తాను– అనే మాట వినబడితే నేను ప్రాణాలతో నిలువలేను" అని ఇందులో గోదాదేవి పలుకుతున్నది

పరమ వైదికులు యజ్ఞాలలో దేవతలకు సమర్పించడం కోసం సిద్ధం చేసిన హవిస్సును అరణ్యంలో సంచరించే నక్క స్పృశిస్తే, లేక అది హోమం చేయడానికి పనికిరానట్లు, శంఖ చక్రాలను ధరించిన ఆ స్వామికి నా వక్షోజాలు అనుభవయోగ్యాలు కాకుండా, అవి ఒక మానవ మాత్రునకు భోగ్యాలు అనే మాటను సైతం నేను వినడానికి ఇష్టపడను. సుమా!

*ఉరువుడైయార్ ఇళైయార్గళ్ నల్లార్ *ఒత్తు వల్లార్ కళై క్కొణ్డు *వైగల్
తెరువిడై ఎదిర్ కొణ్డు * పంగుని నాళిరుందవే నోజ్కిన్ఱేన్ కామ దేవా! **
కరువుడై ముగిల్వణ్ణన్ కాయావణ్ణన్ *కరువిళై పోల్ వణ్ణన్ * కమల వణ్ణ
త్తిరువుడై ముగత్తినిల్ తిరుక్కణ్ణాల్ *తిరుందవే నోక్కెనక్కరుళ్ కణ్ణాయ్ 6*

"మచ్చిత్తాః మద్గతప్రాణాః బోధయంతః పరస్పరమ్, కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ" (నాలో మనసును నిలిపినవారు, నాపైనే ప్రాణాలు పెట్టుకున్నవారు అయిన నా భక్తులు నా గుణాలను ఒకరికొకరు చెప్పుకుంటూ, నా లీలలను చెప్పుకుంటూ, నన్ను గూర్చి పలుకుతూ, వింటూ ఆనందిస్తారు) అనే విధంగా సాత్వికులు భగవంతుని గుణాలను అనుభవిస్తూ, వాటిని ఒకరికొకరు చెప్పుకుంటూ,

ప్రాణాలను ధరించడం కోసం మిగిలిన సాత్వికులను తమతో కలుపుకొని భగవద్విషయంలో ప్రవేశించేటట్లే, రజోగుణం ఎక్కువగా కలిగిన కామదేవుని ఆశ్రయించటానికి కామశాస్త్రంలో సమర్థులైనవారిని కలుపుకొని నోము నోచడానికి ప్రయత్నం చేస్తాను "—అని ఇందులో తెలుపుతున్నది.

కామదేవా! మన్మథ తంత్రంలో సమర్థులు, సుందరులైన నవ యువతులను ముందుంచుకొని, పాల్గునమాసంలో వీథులను శుభ్రపరచి అలంకరించి, నీకు ఉత్సవాన్ని చేస్తున్నాము. నీలమేఘం వంటివాడు, అతసీపూవు రంగువంటి రంగు కలిగినవాడు అయిన ఆ లక్ష్మీపతి తన దివ్యనేత్రాలతో నన్ను కటాక్షించేటట్లు నీవు నన్ను అనుగ్రహించు.

*కాయుడై నెల్లోడు కరుంబమైత్తు *క్కట్టి అరిశి అవల్ అమైత్తు *
వాయుడై మళైయవర్ మందిరత్తాల్ *మన్మదనే! ఉన్నై వణంగుగిన్ఱేన్ **
తేశ మున్న ళందవన్ తిరివిక్కి రమన్ *తిరుక్కై గళాల్ ఎన్నై త్తీణుమ్ వణ్ణమ్ *
శాయుడై వయిఱుమ్ ఎన్ తడముళైయుమ్ *తరణియిల్ తళైప్పుగళ్ తర క్కిట్టియే 7*

"త్రివిక్రమ స్వామి తన చేతులతో నన్ను తాకి రీతిలోని గొప్ప కీర్తిని నాకు కలిగించాలి" అని పలుకుతున్నది.

నీకు ఇష్టమైన వరికంకుల గుత్తులను, చెరకు గడలను, బెల్లపు అటుకులను సమర్పించి, చక్కని స్వరాన్ని కలిగిన బ్రాహ్మణులు వైదికమంత్రాలతో కీర్తిస్తూ ఉండగా, మూడు లోకాలను కొలిచిన త్రివిక్రముని నామంతో ప్రకాశించే శ్రీ కృష్ణ భగవానుడు నా శరీరాన్ని తన చేతులతో చల్లగా తాకేటట్లు చేసి, ఈ భూమిపై నా కీర్తిని అభివృద్ధి చేయి.

*మాశుడై ఉడంబొడు తళై ఉలఱి *వాయ్ ప్పుఱమ్ వెళుత్తొరు పోదుముణ్ణు *
తేశుడై త్తిఱల్ ఉడై క్కామ దేవా! *నోఱ్ఱ నోన్బినై క్కుఱిక్కొళ్ కణ్ణాయ్ **
పేశువదొన్ఱుణ్ణు ఇంగు ఎమ్బెమాన్! *పెణ్మై యై త్తళైయుడైత్తాక్కుమ్ వణ్ణమ్ *
కేశవ నంబియై క్కాల్ పిడిప్పాళ్ఎన్ను మ్ * ఇప్పే ఱెనక్కరుళ్ కణ్ణాయ్ 8*

"స్వరూపానికి తగిన భగవంతుని శ్రీపాదకైంకర్యాన్ని చేసే అదృష్టాన్ని నాకు కలిగించాలి" అని ఇందులో వేడుతున్నది.

ఒకరికి ఇంకొకరు దూరమైన ప్రేయసీ ప్రియులను కలపడంలో సామర్థ్యం కలిగిన కామదేవా! మలినమైన శరీరంతో చెల్లా చెదరుగా ఉండే కేశపాశంతో, ఒక్కపొద్దులు చేసి పాలిపోయిన పెదవులతో నేను ఆచరించే ఈ వ్రత విధానాన్ని విను. నేను నిన్ను కోరేది ఒక్కటే. ఈ లోకంలో ఈమె కేశవుని శ్రీపాదాలను సంవాహనం చేయడమనే పరమ పురుషార్థలో ఆసక్తిని కలిగినది—అనే పేరు నాకు కలిగేటట్లు అనుగ్రహించు.

*తొళుదు ముప్పోదు మున్న డి వణంగి *తూమలర్ తూయ్ త్తొళుదేత్తుగిన్ఱేన్ *
పళుదిన్ఱి ప్పార్క్కడల్ వణ్ణనుక్కే *పణి శెయ్ దు వాళ్ పెఱావిడిల్ నాన్ **
అళుదళుదు అలమందమ్మా వళుక్క *అట్రుమ్ అదు ఉనక్కు ఱైక్కుమ్ కణ్ణాయ్*
ఉళువదోర్ ఎరుత్తినై నుకంగొడు పాయ్ న్దు *ఊట్టుమిన్ఱి త్తురందాల్ ఒక్కుమే 9*

తనను అనుగ్రహించకపోతే అతనికి కలిగే దోషాన్ని గూర్చి ఇందులో ప్రస్తావిస్తున్నది.

మూడువేళల నమస్కార పూర్వకంగా నిన్ను ఆశయించి, నీకు ఇష్టమైన పుష్పాలను సమర్పించి, నేను నిన్ను ప్రార్థించేది ఒక్కటే. ఓ కామదేవా! సముద్ర వర్ణుడైన లక్ష్మీపతికి నేను నిత్యం కైంకర్యాలను చేసి, తరించకపోయినట్లయితే ప్రలాప విలాపాలతోనే నా జీవితాన్ని గడపవలసి వస్తుంది. అది నీకే చాలా గొప్ప పాతకం అవుతుంది. దుక్కి దున్నడం మొదలైన సేద్యపు పనులతో ఎల్లప్పుడూ సేవ చేసిన ఎద్దును కర్రతో చితకబాది, దానికి మేత వేయని యజమానికి ఏ పాపం కలుగుతుందో, అటువంటి పాపం నీకు కలుగుతుంది. మన్మథా! దీనిని నీవు గుర్తించు.

** కరుప్పు విల్ మలర్ క్కణై క్కామ వేళై *క్కళలిణై పణిందంగోర్ కరి అలఱ *
మరుప్పినై ఒశిత్తు ప్పుళ్ వాయ్ పిళందన *మణివణ్ణఱ్కెన్ఱు వగుత్తిడెన్ను **
పొరుప్పన్న మూడమ్ పొలిందు తోన్నుమ్ *పుదువైయర్ కోన్ విట్టుశిత్తన్ కోదై *
విరుప్పుడై ఇందమిళ్ మాలై వల్లార్ *విణ్ణవర్ కోన్ అడి నణ్ణువరే 10*

ఈ దశకానుసంధానం వల్ల కలిగే ఫలాన్ని తెలిపి, దశకాన్ని ముగిస్తున్నది.

కువలయా పీడం అనే మగజాన్ని అణచినవాడు, బకాసురుని నోటిని చీల్చినవాడు అయిన శ్రీకృష్ణుని దివ్య సన్నిధికి తనను చేర్చమని గోదాదేవి మన్మథుని ఉద్దేశించి ప్రార్థించే ఈ పది పాశురాలను అనుసంధించేవారు నిత్యసూరినాథుని దివ్య చరణారవిందాలను చేరగలరు.

இரண்டாம் திருமொழி - நாமமாயிரம்

ஈ விధంగా గోపికలు చేసిన కామ సమాశ్రయణాన్ని చూసిన శ్రీకృష్ణుడు చాలా బాధపడ్డాడు. “వీరిని పొందడానికి నేను కష్టపడి ప్రయత్నం చేయవలసి ఉండగా, వీరు నన్ను పొందడం కోసం తాము కష్టపడి ప్రయత్నం చేసేటట్లు అయినదే! అందులోను, నాపాదాలపై పడి ప్రార్థించకుండా, ఇంకొక దేవత పాదాలపై పడవలసినట్లుగా నేను వెనుకబడిపోయానే! నేను కార్యం పూర్తిచేసే లక్షణం చక్కగా ఉన్నదే!" అని వీరిని రక్షించడంలో తాను వెనుకబడినట్లుగా భావించాడు. గజేంద్రుని రక్షించడంలో వెనుకబడిన కాలంలో మనస్సు కొలత పొందినట్లుగా కలత పొందాడు. రేపల్లెలో ఇంద్రుని ఇష్టదైవంగా కొలిచే గొల్లలు వర్షం కోసం ఇంద్రునికోసం పర్వతమంతగా పోగు పెట్టిన అన్నాన్ని చూచి, “నేను పుట్టి పెరిగే ఊరిలో ఉండే కొందరు ఒక వస్తువును అన్య దైవాలకు సమర్పించడమేమి?" అని ఆ పనిని చూసి సహించలేక, “ఈ అన్నాన్ని అంతటినీ గోవర్ధన పర్వతానికి ముందే తీసుకుని పోయి పెట్టి, దానికి సమర్పించండి" వారితో చెప్పాడు. ఆ గోవర్ధన పర్వతానికి అంతర్యామిగా నిలచి, ఒక భూత రూపాన్ని గ్రహించి, ఆ అన్నాన్ని అంతటినీ స్వీకరించాడు. అందువల్ల తనకే చెందినవారైన గోపికలు తనను పొందడం కోసం కామసమారాధనను చేయడం సహించలేడు కదా. తనను ఉద్దేశించి కర్మజ్ఞాన భక్తి యోగాలు మొదలైన సాధనాలను చేసేవారి మూలంగానూ, ఒక దేవతకు అంతర్యామిగా ఉండే తనను ఉపాసించేవారి మూలంగానూ తనను పొందాలని ప్రయత్నించడం సహించలేనివాడు సాక్షాత్తుగా కాముని పాదాలపై పడడం ఎంత మాత్రం సహించడు కదా. అందుచేత, శ్రీకృష్ణుని మనస్సు చాలా కలతపడి, గజేంద్రునకు వేగంగా వచ్చి సహాయపడినట్లే, వేగంగా వచ్చి వీరికి తన దర్శనాన్ని అనుగ్రహించాడు. ఇతడు ఈ విధంగా తమను కష్టపెట్టడాన్ని చూసి, రోషం వల్ల వీరు కూడా అతనికి తమ ముఖాలను చూపించకుండా, బొమ్మరిండ్లను కట్టుకొంటూ, కామ సమాశ్రయణానికి అంగమైన కార్యాలను చేసినట్లే, భావిస్తూ ఉన్నారు. శ్రీకృష్ణుడు దీనిని గమనించి బొమ్మరిల్లు అనబడే వీరు నిర్మించిన అలంకరణలను పాడు చేయడం ప్రారంభించాడు.

"వీటిని పాడు చేయవద్దు" అని గోపికలు పలు రీతులలో అతనిని ప్రార్థించారు. ఎంతగా ప్రార్థించినా "నేను పాడు చేస్తాను" అని అన్నాడు ఇతడు. ఈ విధంగా ఇతనికి, గోపికలకు మధ్య మహాభారతంవంటి ఒక పెద్ద పోరాటం సంభవించింది. ఆ తరువాత "ఏమ్మై ప్పత్తి మెయ్ పిణై క్కిట్టక్కాల్" (2–9) (మమ్ములను పట్టుకొని ఆలింగనం చేసుకుంటే) అనే విధంగా ఇతనికి, వారికి సంశ్లేషం ప్రవృత్తమైనది. అది కూడా అన్ని సంశ్లేషాలవలెనే విశ్లేషం అనబడే వియోగంలో పూర్తి అయిన విషయాన్ని ఈ దశకం తెలుపుతున్నది.

*** నామమాయిర మేత్త నిన్ఱ * నారాయణా! నరనే! * ఉన్నై*
*మామి తన్ మగనాగ పెట్ర్రాల్ * ఎమక్కు వాదై తవిరుమే ***
*కామన్ పొదరు కాల మెన్ఱు * పంగుని నాళ్ కడై పారిత్తోమ్ **
*తీమై శెయ్యుమ్ శిరీదరా! * ఎంగళ్ శిట్ర్రిల్ వందు శిదైయేలే 1*

పాల్గునమాసం అయినందున మన్మథుడు వచ్చే దారిలో మేము బొమ్మరిళ్ళను కట్టుకుంటూ ఉండగా మమ్ములను బాధ పెట్టడం కోసం యశోద కుమారుడై పుట్టిన నీవు వచ్చి, మా బొమ్మరిళ్ళను కూలగొట్టడం తగదు– అని అంటున్నది.

నిత్య సూరులు వేయి నామాలతో స్తోత్రం చేసేటట్లుగా నిత్యవిభూతిలో, ఈ విభూతిలో ఏడులోకాలు నీ అద్వితీయమైన ఆజ్ఞకు లోబడి ఉండేటట్లుగా వేంచేసి ఉండే శ్రీమన్నారాయణా! దశరథునకు కుమారునిగా అవతరించినవాడా! మాకు అత్త అయిన యశోద దేవి ఇంతకుముందే తుంటరివాడవైన నిన్ను తన కుమారునిగా పొందినా, మాకు ఒక బాధ కలగడం మాత్రం తప్పలేదు. మన్మథుడు వచ్చే సమయం అని పంగునిమాసంలో అతడు వచ్చే దారిలో ఎదురుచూచాము. తుంటరి పనులను చేసేవాడవైన శ్రీధరా! మేము ఆడుకునే చోటుకు వచ్చి, మేము కట్టుకున్న బొమ్మరిళ్ళను కూల్చివేయవద్దు.

*ఇన్ను ముట్టుం ముదుగు నోవ * ఇరుందిఙ్గళ్ తత్తి ఇచ్చిట్ర్రిలై **
*నన్నుమ్ కణ్ణుఱ నోక్కి * నాంగొళుమ్ ఆర్వమ్ తన్నై త్తణిగిడాయ్ ***

*అన్ను పాలగనాగి * ఆలిలై మేల్ తుయిన్ర ఎమ్మా దియాయ్! *
ఎన్నుమ్ ఉంతనక్కెంగళ్ మేల్ * ఇరక్క మెఱ్ఱాదదెన్ పావమే 2*

"మేము ఎన్నో పాట్లు పడి అందంగా కట్టుకున్న బొమ్మరిళ్ళను కూల్చి వేయవద్దు" అని అంటున్నది.

ఈనాడు నడుము నొప్పి పుట్టేటట్లు నిలకడగా స్థిరంగా ఉండి, చాలా శ్రమపడి నిర్మించిన ఈ బొమ్మరిళ్ళను మా కళ్ళలోకి చక్కగా చూస్తూ, పాడు చేస్తున్నావు మా ఆశను భగ్నం చేస్తున్నావు. ఆనాడు ప్రళయం వచ్చిన సమయంలో చిన్న కుర్రవాడివై, మర్రి ఆకులో శయనించినవాడవైన, మాకు కారణభూతుడవైన స్వామీ! నీకు మా విషయంలో ఏ సమయంలోనూ దయ కలగకపోవడానికి కారణం మా పాపమేసుమా.

*కుణ్డు నిర్ ఉళై కోళరి! * మద యానై కోళ్ విడుత్తాయ్ * ఉన్నై
కణ్డు మాల్ ఉఱువోంగళై * క్కడైక్కణ్ణాల్ ఇట్టు వాదియేల్ **
వణ్డల్ నుణ్మణల్ తెళ్ళి * యామ్ వళై క్కైగళాల్ శిరమప్పట్టోమ్ *
తెణ్డిరై క్క డఱ్ఱి ళ్ళియాయ్! * ఎంగళ్ శిట్టిళ్ వందు శిదైయేల్ 3*

మేము కట్టుకున్న బొమ్మరిళ్ళను కూల్చడం కడగంటి చూపులతో చూచి మమ్ములను బాధ పెట్టడం మానివేయాలి అని వేడుకుంటున్నది.

మిక్కిలి లోతయిన సముద్రంలో నిద్రించేవాడవై, గొప్ప బలాన్ని కలిగిన మగసింహంవంటివాడివై, మదాన్ని కలిగిన గజేంద్రునకు వచ్చిన బాధను పోగొట్టినవాడా! ఈ విధంగా భక్తుల దుఃఖాన్ని తీర్చడం కోసం నిన్ను చూచి ఆశపడే మమ్ములను నీ కడగంటి చూపులతో చూసి బాధ పెట్టకుండా ఉండు. మేము వండ్రుమన్ను నుండి సన్నని ఇసుకను తీసుకొని వచ్చి, గాజులను అలంకరించుకున్న మా చేతులతో శ్రమపడి ఈ బొమ్మరిళ్ళను కట్టుకున్నాం. స్వచ్ఛమైన కెరటాలను గల పాలసముద్రాన్ని పడుకగా కలిగినవాడా! మా బొమ్మరిళ్ళను కూల్చివేయకు.

*పెయ్యు మాముగిల్ పోల్ వణ్ణా! * ఉందన్ పేచ్చుమ్ శెయ్ కైయుమ్ * ఎంగళై
మైయల్ ఏట్టి మయక్క * ఉన్ ముగమ్ మాయ మందిరన్దాన్ కొలో? **

*నొయ్యర్ పిళ్ళైగళ్ ఎన్నదఱుక్క * ఉన్నై నోవ నాంగళ్ ఉరైక్కిలోమ్ **
*శెయ్య తామరై క్కణ్ణినాయ్! * ఎంగళ్ శిట్రిల్ వందు శిదైయేలే 4*

నీ ముఖం అనే మంత్రపు పొడిని జల్లి, మమ్ములను మొహాన్ని పొందినవారినిగా చేసి, మా బొమ్మరిళ్ళను కూల్చివేయకు అని అంటున్నది.

వర్షించే నల్లని మేఘం వర్ణంవంటి వర్ణాన్ని కలవాడా! నీ మోసపు మాటలు చేష్టలు అబలలమైన మమ్ములను పిచ్చెక్కించి, మా జ్ఞానాన్ని లేకుండా చేయడంలో నీ ముఖం మంత్రపు చూర్ణమా! ఎర్ర తామర వంటి రెండు నేత్రాలను కలవాడా! "వీరు చాలా తక్కువ వారు, చిన్న వయస్సులోని బాలికలు, వీరిని ఇతడు ఈ విధంగా బాధపడుతున్నాడే!" అని నిన్ను ఇతరులు నిందిస్తారేమో అని భయపడి, మేము ఒక్క మాట కూడా నీవు బాధపడేటట్లు చెప్పలేకున్నాము. మా బొమ్మరిళ్ళను కూల్చివేయకు.

*వెళ్ళై నుణ్మణల్ కొణ్డు * శిట్రిల్ విచిత్తిరప్పడ * వీది వాయ్*
*తెళ్ళి నాంగళ్ ఇఱైత్త కోలమ్ * అళిత్తియాగిలుమ్ ఉందన్ మేల్ **
*ఉళ్ళమోడి ఉరుగల్ అల్లాల్ * ఉరోడమ్ ఒన్ఱుమిలోమ్ కణ్డాయ్ **
*కళ్ళ మాదవా! కేశవా! * ఉన్ ముగత్తన కణ్గళ్ అల్లవే 5*

నీవు మా బొమ్మరిళ్ళను పడగొట్టినా, మా మనస్సు నీ విషయంలో కోపపడడం లేదు, ప్రేమనే కలిగి ఉన్నది –అని అంటున్నది.

కపట చేష్టలను చేసే మాధవా! కేశవా! మేము తెల్లని, సన్నని ఇసుకను తీసుకొని వీథులలో అందరూ ఆశ్చర్యపడేటట్లు చక్కగా కట్టుకున్న బొమ్మరిళ్ళు అనే అలంకారాన్ని నీవు పాడు చేసినప్పటికీ, దానివల్ల మా మనస్సు నీ పట్ల ఇంకా ద్రవిస్తున్నదే తప్ప, నీపై రోషం కొంచెం కూడా మేము పొందడం లేదు. నీ ముఖంలో ఉన్నవి కన్నులేనా?

*ముట్టిలాద పిళ్ళైగళోమ్ * ముళై పోందిలాదోమై * నాళ్ తోఱుమమ*
*శిట్టిల్ మేల్ ఇట్టు క్కొణ్డు * ని శిఱిదుణ్డు తిణ్ణెన నామదు*
*కట్టిలోమ్ ** కడలై అడైత్తు అరక్కర్ కులంగళై * ముట్టువుమ్*
*శెట్టు * ఇలంగైయై ప్పూశల్ ఆక్కియ శేవగా! * ఎమ్మై వాదియేల్ 6*

బొమ్మరిళ్ళను పడగొట్టడం అనే కార్యాన్ని చేయడంలో నీవు ఇంకొక అభిప్రాయాన్ని దేనిని మనసులో కలిగి ఉన్నావు, దానిని మేము తెలియలేకున్నాము– అని అంటున్నది.

సముద్రం పై వారధి కట్టి, రాక్షసుల కులాన్ని అంతటిని నాశనం చేసి, లంకను అంతటిని యుద్ధభూమిగా మార్చిన వీర్యాన్ని కలవాడా! ఇంకా చిన్నతనం నిండనివారం, మా వయస్సుపూర్తిని సూచించే వక్షోజాలు పూర్తిగా పెరగని వారం అయిన మమ్ములను ప్రతిదినం బొమ్మరిళ్ళ విషయంగా ఏదో ఒక సాకుతో నువ్వు నీవు చేసే ఈ చేష్టలకు ఒక అభిప్రాయం ఉన్నది. కానీ మేము దానిని బాగా తెలియకుండా ఉన్నాము. మమ్ములను బాధ పెట్టకు.

*వేదమ్ నన్గఱివార్గళోదు * ఇవై వేశినాల్ పెరిదిన్ శువై *
*యాదుమ్ ఒన్ఱఱియాద పిళ్ళైగళోమై * ని నలిందెన్ పయన్? **
*ఓద మాకడల్ వణ్ణా! * ఉన్ మణవాట్టిమారొదు శూళ్ఱుమ్ *
*శేదు బందమ్ తిరుత్తినాయ్! * ఎంగళ్ శిట్టిల్ వందు శిదైయేలే 7*

ఒక స్త్రీ రక్షించడం కోసం వారధిని కట్టిన నీవు మా బొమ్మరిళ్ళను పడగొట్టవచ్చునా? అని అడుగుతున్నది.

ని మాటలలోని వైలక్షణ్యాన్ని చక్కగా తెలిసినవారిలో నీవు ఈ మాటలను పలికితే చాలా బాగుంటుంది. ఏ విధమైన అర్థాన్ని తెలియలేని చిన్నపిల్లలమైన మమ్ములను బాధపెడితే ఏం ప్రయోజనం? అలలు ఎగిసి పడే గొప్ప సముద్రంతో పోలిన వర్ణాన్ని కల కృష్ణా! సేతు బంధాన్ని చేసినవాడా! ని పత్నుల పైన ఆన. మమ్ములను బాధించకు.

*వట్ట వాయ్ చ్చిఱు తూదైయోడు * శిఱు శుళగుమ్ మణలుమ్ కొణ్డు *
ఇట్టుమా విళైయాడువోంగళై * చ్చిట్టిల్ ఈడ్పిత్తెన్ పయన్? **
లొట్టుదైత్తు నలియేల్ కణ్ణాయ్ * శుడర్ చ్చక్కరమ్ కైయిల్ ఏందినాయ్! *
కట్టియుమ్ కైత్తాల్ ఇన్నా మై * అఱిదియే కడల్ వణ్ణనే! 8*

"మనస్సు చేదు అయితే కలకండ కూడా చేదుగానే ఉంటుంది తప్ప, తీయగా ఉండదు అని తెలుసుకో "అని పలుకుతున్నది.

కాంతిని పొందికగా కలిగిన సుదర్శనాన్ని చేతిలో ధరించిన శ్రీకృష్ణా!సముద్ర వర్ణా! గుండ్రని నోటిని కలిగిన చిన్న బానతో, చిన్నచేటతో ఇసుకను తీసుకొని వచ్చి, చాలా ఇష్టంగా కట్టుకొని ఆడుకొనే మా ఈ బొమ్మరిళ్ళను మళ్ళీ ఉపయోగపడనట్లుగా నాశనం చేస్తే ఏమి ప్రయోజనం? చేతులతో తోసి, కాళ్లతో చితిపి, ముమ్మలను హింసించకు. మనస్సు విరిగిపోతే బెల్లపు ముక్క కూడా రుచించదు అనే మాట మీకు తెలియదా?

*ముట్పిత్తూడు పుగుందు * నిన్ ముగమ్ కాట్టి ప్పున్ ముఱువల్ శెయ్ దు *
శిట్పిలోడెంగళ్ శిందైయుమ్ * శిదైక్క క్కడవైయో? గోవిందా! **
ముట్పి మణ్ణిడమ్ తావి * విణ్ణుఱ నిణ్ణళందు కొణ్డాయ్! * ఎమ్మై
ప్పట్పి మెయ్ప్పణక్కిట్టుక్కాల్ * ఇంద ప్పక్కమ్ నిన్దవర్ ఎన్ శొల్లార్? 9*

శ్రీకృష్ణునిలో సంశ్లేషం కలిగిన రీతిని పలుకుతున్నది.

గోవిందా! అందమైన ఒక చిన్న పాదంతో భూమండలం అంతటిని కొలిచి, ఆనాడు పరమపదం వరకు తిరిగి వేరొక చరణంతో పై లోకాలను కొలిచినవాడా! మేము ఏకాంతంగా ఆడుకునే ముంగిటిలోకి వచ్చి, నీ ముఖాన్ని మాకు చూపించి, చిరునవ్వు నవ్వి, మా బొమ్మరిళ్ళను, మనసులను చిదిపి వేయవచ్చునా? అంతటితో ఆగకుండా, మమ్మలను నీవు ఆలింగనం చేసుకుంటే చుట్టుపక్కల ఉన్నవారు ఏమని అంటారు?

*** శిదై వాయ్ అముదముణ్డాయ్! * ఎంగళ్ శిట్పిల్ నీ శిదైయేల్ ఎన్ను *
వీది వాయ్ విళైయాడుమ్ * ఆయర్ శిఱుమియర్ మళ్గలై చ్చొల్ల **

*వేద వాయ్ త్తొళిలార్ కళ్ వాళ్ * విల్లిపుత్తూర్ మన్ విట్టుశిత్తన్ తన్ *
కోదై వాయ్ త్తమిళ్ వల్లవర్ * కుఱైవిన్ఱి వైకుందమ్ శేర్వరే 10*

ఈ దశకాన్ని అనుసంధించినవారికి కలిగే ఫలితాన్ని తెలుపుతూ, దశక పరి సమాప్తిని చేస్తున్నది.

"సీతాదేవి అధరామృతాన్ని పానంచేసినవాడా! మేము కట్టుకునే బొమ్మరిళ్ళను నీవు పాడు చేయవద్దు" అని వీధిలో ఆడుకునే గోపికల చిన్నతనానికి తగిన మృదువైన మాటలతో, వేదాలను ఉచ్చరించే నోటిని కలవారు, వైదిక కార్యాలను చేసేవారు అయిన పరమైకాంతులు నివసించే శ్రీ విల్లిపుత్తూరుకు నాథులైన పెరియాళ్వారుల కుమార్తె ఈయన గోదాదేవి నోటి నుండి అవతరించిన ఈ ద్రావిడ పాశురాలను అనుసంధించగలిగినవారు ఏ కొరత లేకుండా పరమ పదాన్ని చేరగలరు.

மூன்றாம் திருமொழி - கோழி அழைப்பதன்.

"తొట్టుదైత్తు నలియేల్ కండాయ్" (తాకి కూలగొట్టి బాధ పెట్టకుసుమా) (2—8) అని ఓపికలు పలికేటట్లు వారిని తాకి తరువాత "ఎమ్మై ప్పుత్రి మెయ్ పిణక్కిట్టక్కాల్" (2—9) (పిల్లలను ఆలింగానం చేసుకుంటే) అని చెప్పేటట్లు ఇద్దరూ వేరు వేరు శరీరాలను కలిగి ఉండే స్థితి పోయి ఒకే శరీరం అనే భావించేటట్లు ఇద్దరికీ సంశ్లేషణ ఏర్పడింది ఈ విధంగా సంభవించినది కూడల్ అనే సంశ్లేషం, కుమ్మరివాడు కుండను చేసేటప్పుడు ఆ కొండ యొక్క రెండు భాగాలను వేడి చేసి ఒకటిగా చేసేటట్లుగా, కంసాలి ఇనుప పాత్రను చేసేటప్పుడు రెండు భాగాలను బాగా నిప్పులో పెట్టి వేడి చేసి ఒకటిగా చేసేటట్లుగా, వీరిని కూడా విశ్లేషంలో తప్తం చేసి, తిరిగి కలుపకుండా, ఎల్లప్పుడూ కూడినరీతిలోనే ఉంటే, ఆనందం తల మునకలు అవుతుంది, నాయకి నాయకులు ఇద్దరి కూడా ప్రాణాలు కోల్పోతారు అనే భావన చేత, వీరి బంధువులు, “ఈ కన్యలకు ఇటువంటి స్థితి ఏర్పడకుండా ఉండే దారి ఏది?” అని ఆలోచించి శ్రీకృష్ణుని దగ్గర నుండి వీరిని విడదీయడం కోసం వీరిని తీసుకుని పోయి తమ ఇంటి గద్వాని గదులలో దాచి పెట్టారు గోపికలు కూడా శ్రీకృష్ణ విశ్లేషం సహించలేక, "ఉపవాస కృశాం దీనాం నిఃశ్వసంతీం పునఃపునఃు, దదర్శ శుక్ల పక్షాదౌ చంద్ర రేఖా మివామలామ్" (శ్రీరామాయణం— సుందరకాండ— 15— 19) (ఉపవాసం వల్ల మిక్కిలి చిక్కిపోయినది, చూస్తే విచారించదగినదై ఉన్నది, మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ ఉన్నదై ఉండే సీతాదేవిని హనుమంతుడు శుక్లపక్షఇ ఆరంభంలో ఏ దోషం లేకుండా వెలిగే చంద్రలేఖను వలె చూసాడు) అనే విధంగా సీతాదేవికి కలిగిన ఆర్తి అంతా కలిగినవారయ్యారు.

శ్రీకృష్ణుడు కూడా "న మాంసం రాఘవో భుంక్తే న చాపి మధు సేవతే, నైవ దంశాన్ న మశకాన్ న కీటాన్ న సరీసృపాన్, రాఘవోపనయేత్ గాత్రాత్ త్వద్గతేనాంతరాత్మనా" (శ్రీరామాయణం— సుందరకాండ— 36— 41, 42) (అమ్మా! నీ విషయంలో అభినివేశాన్ని కలిగిన మనసును కల రాఘవుడు మాంసాన్ని భుజించడం లేదు, వధువును సేవించడం లేదు, తన శరీరాన్ని కరిచే ఈగలను, దోమలను, కీటకాలను, పాములను శరీరం నుండి

లొలగించడం లేదు) అనే విధంగా శ్రీరామునివలె తనను కరిచేవానిని, తనపై పాకేవానిని వేనిని తెలియకుండా ఉన్నాడు. ఈ విధంగా ఉండడానికి కారణాన్ని హనుమంతుడు "త్వద్గతేనాంతరాత్మనా" అని తెలియజేశాడు. పరకాయ ప్రవేశం చేసినవారికి తమ శరీరంలో చైతన్యం లేకుండా ఉండేటట్లు, నాయకికి తన మనసును వశం చేసిన నాయకునకు తన శరీరంలో ఏమి జరిగినా తెలిసే అవకాశం లేదు కదా. నాయకి ఒక సమయంలో నిద్రించలేదంటే, "అనిద్రః సతతం రామః సుప్తోపి చ నరోత్తమః, సీతేతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతి బుద్యతే" (శ్రీ రామాయణం –సుందరకాండ– 36–44) (సీతకు దూరమైన రాముడు ఎల్లప్పుడూ నిద్ర లేనివాడుగానే ఉన్నాడు. నరశ్రేష్ఠుడైన అతడు నిద్రించినా, "సీతా" అనే అందంగా పలుకుతూ మేల్కొంటున్నాడు) అనే విధంగా ఎల్లప్పుడూ నిదురించకుండా కదా ఉంటాడు, నాయకుడు. ఈమె "జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ, ఊర్ధ్వంమాసా న్న జీవిష్యే సత్యేనాహం బ్రవీమి తే" (రామాయణం– సుందరకాండ –38 –67) (ఆర్యపుత్రా! నేను నా ప్రాణాన్ని ఒక నెల కాలం మాత్రమే ధరించి ఉంటాను. ఒక నెలకు నుంచి నా ప్రాణాలను నేను ధరించలేను అని ప్రమాణం చేసి నీకు చెబుతున్నాను) అని అంటే, నాయకుడు అయిన రాముడు "చిరం జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి, న జీవేయం క్షణమపి వినా తామసితేక్షణామ్" (సీత ఒక నెలపాటు ప్రాణాలను ధరించి ఉంటే, చాలా కాలం ధరించినది కాగలదు. నల్లని అందమైన కన్నులను కలిగిన ఆమెను విడచి నేను ఒక క్షణం కాలం కూడా జీవించలేను) అని పలికేటట్లు ఒక క్షణం కూడా ఈమెను విడచి జీవించలేని స్వభావాన్ని కలిగినవాడై ఉంటాడు కదా. ఈ విధంగా గోపికలకు, శ్రీకృష్ణునకు కలిగిన విరహక్లేశం అవధిని దాటింది. గోపికల ఈ స్థితిని గమనించిన వారి తండ్రి తల్లి మొదలైన బంధువులు, " వీరిని మనం చివరి వరకు కృష్ణునితో కలువనియకుండా అడ్డుకున్నట్లయితే మనం వీరిని కోల్పోవలసి వస్తుంది మనమే కృష్ణునితో కలిపితే వీరికి చాలా అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. అందుచేత ఈ విధంగా ఒక పనిని చేద్దాం. అది ఏమంటే, కన్యలు తగిలిన వరుని పొందడం కోసం చన్నీళ్లలో స్నానం చేయడం అనే ఒక సంప్రదాయం ఉన్నది. దానిని చేయడానికి మనం వీరిని అనుమతిద్దాం. వీరు కోరినట్లు

వీరికి కృష్ణ సంశ్లేషం లభిస్తుంది. దానిని మనం తెలియనివారివలె ఉందాం "అని తమలో తాను మాట్లాడుకుని వీరిని చన్నిళ్లలో స్నానం చేయడానికి అనుమతించారు.

కృష్ణుడు కూడా గోపికలను విశ్లేషించిన సమయంనుండి రేపల్లెలో 5 లక్షల ఇళ్లలో ఉండే గోపికలను గూర్చి విచారించడమే పనిగా ఉన్నాడు. అందుచేత వారికి దూరమైన తరువాత ఈ కన్యల విషయంలో ఏమి జరిగుతున్నది అనే విషయాన్ని తెలుసుకోవడం కోసం తన స్నేహితులలో ఒక్కొక్కరిని ఒక్కొక్క గోపిక విషయంలో నియమించి, విచారించి, తల్లి, తండ్రి మొదలైన ఊరిలోనివారికి కలిగిన మార్పులను, కలుగుతున్న మార్పులను, కలుగబోయే వాటిని కూడా తెలుసుకొని, గోపికలు చన్నిళ్ళలో స్నానం చేయడానికి పోవాలని నిశ్చయించుకున్న విషయాన్ని విని, తాను కూడా వారితో పాటు పోవడానికి ప్రయత్నం చేశాడు. ఆ గోపికలుకూడా ఇతనితో సంశ్లేషించడం మనకు భరించదగినదిగా లేదు. సంశ్లేషం ఎల్లప్పుడూ విశ్లేషంలోనే ముగిసేదిగా ఉన్నది. అందుచేత అతనితో సంశ్లేషించడం, తరువాత విశ్లేషించడం, ఆ తర్వాత బాధపడడం కంటే, ఇప్పుడు ఉండే విరహతాపం తీరేటట్లుగా చల్లటి నీరు ఉండే చోటికి పోయి, చన్నీటిలో మునిగి, దానివల్ల ఊరటను పొందడం మంచిది. ఆ పని చేసేటప్పుడు మనం, కృష్ణుడు కలసి ఇంతకుముందే అలవాటుగా స్నానం చేసి సరస్సుకు పోయినట్లయితే, అతడు తెలుసుకొని అక్కడకు వస్తాడు. అందుచేత, అతనికి తెలియని సరస్సును అన్వేషించి పోవాలి. ఆ విధంగా వెళ్లేటప్పుడు, అందరూ కలిసి సమూహంగా పోతే, అతడు తెలిసికుంటాడు. అందుచేత ఒక్కొక్కరుగా పోదాం. ఆ విధంగా వెళ్లేటప్పుడు కూడా, మన కాలు గుర్తులు తెలియని విధంగా వానిని చెరుపుకుంటూ పోదాం" అని తమలో తాము నిశ్చయించుకుని, ఆ విధంగానే అందరూ సరస్సు దగ్గరకు వెళ్లారు. "ఎదిర్ శూழల్ పుక్కు ఎనైత్తోర్ పిఱప్పుమ్" (తిరువాయ్ మొழి–2–7–6) అనే విధంగా వీరిని పొందడం కోసం అనాదికాలం గా ఎదురు పన్నాగం చేస్తూ తిరిగే అతడు కూడా వీరి స్థితిని చక్కగా తెలుసుకొనగలిగినవాడు కదా. వనవాస సమయంలో శ్రీరాముని వెంబడించి వచ్చిన అయోధ్యా పురజనులు రథాన్ని సుమంత్రునితో దారి మార్చి నడిపి

శ్రీరాముని మోసం చేసినట్లే, దారి మార్చి, ఆది గుర్తులను జరుపుకుంటూ పోతే, "దారి తెలియలేదే" అని వెనకకు వచ్చేటట్లుగా, శ్రీకృష్ణుని మోసగించడం సాధ్యం కాదు కదా.

"తతో రావణనీతాయాः సీతాయాः శత్రుకర్శనः, ఇయేష పద మన్వేష్టుం చారణాచరితే పథి" (శ్రీ రామాయణం– సుందరకాండ –1–1) (శత్రువులను బాధపెట్టే హనుమంతుడు చారణులు సంచరించే ఆకాశమార్గంలో రావణునిచే అపహరింపబడిన సీతను అన్వేషించడం కోసం వెళ్లాలని కోరాడు) అని చెప్పబడిన హనుమంతుని వలె ఈ గోపికలను శ్రీకృష్ణుడు అనుసరించాడు. " ఇరుళన్న మామేని" (పెరియ తిరువందాది –26) (చీకటి వలె నల్లని వర్ణాన్ని కల గొప్ప రూపాన్ని కలవాడు) అనే విధంగా చీకటిలో పోలిన తిరుమేని కలవాడు గనుక నడచి వెళ్లే వస్తువును దాని నీడ అనుసరించినట్లుగా వారిని నీడలో వదుకుతూ పోయి, వీరికి ముందుగానే వెళ్ళి, తీరంలో దాగుకున్నాడు. వీరుకూడా గొల్ల కన్యలు అయినందున, తమ వస్త్రాలను, ఆభరణాలను గట్టుమీద కలిపి పెట్టి, నీటిలో స్నానం చేయడం కోసం వెళ్లారు. శ్రీకృష్ణుడు వానిని అన్నిటిని మూటగట్టుకొని అక్కడ తీరంలో ఉండే కుందవృక్షం పైకి ఎక్కి, తాను వారికి కనపడకుండా ఉండేటట్లు దాగుకున్నాడు. వీరు స్నానం చేసిన తర్వాత గట్టు మీదకు వచ్చి చూడగా, తమ వస్త్రాలు, ఆభరణాలు కనబడలేదు. "ఇవి ఎక్కడికి పోయాయి? "అని భయపడి "వీటిని ఆకాశం అపహరించిందా? దిక్కులు అపహరించాయా? లేక, ఈ సరస్సు అపహరించిందా? శ్రీకృష్ణుడే కొల్లగొట్టుకుపోయాడా?" అని పలు విధాలుగా కలతపడి, " కిం ను స్యా చ్చిత్తమోహోయం భవేత్ వాతగతి స్త్వియమ్, ఉన్మాదజో వికారోయం స్యాదియం మృగతృష్ణికా" (శ్రీరామాయణం– సుందరకాండ– 34 –23) (ఇది మనసులో కలిగిన మైకమా? వాయుప్రకోపమొ?పైత్యమా? నా స్వభావమే మారిపోయిందా? లేక, ఎండమావియా ?) అనే విధంగా హనుమంతుడు సీతాదేవికి ముందుకు వెళ్లి విషయాలను చెప్పినప్పటికీ, "6 ఈ లోకంలో ఇది సంభవించడానికి సాధ్యమైనదా? అనే సందేహంతో "మనసు తడబడుతున్నదా?పైత్యం పట్టిందా? నా స్వభావం మారిపోయిందా? ఇది ఏ విధంగా జరిగింది?" అని సందేహపడి, తరువాత తెలివి తెచ్చుకున్న సీతాదేవి వలె, ఈ గోపికలు కూడా కొన్ని విధాలుగా సందేహపడి,

అన్ని దిక్కులలో చూస్తూ ఉండేటప్పుడు, శ్రీకృష్ణుడు కుందవృక్షం పైన కనబడ్డాడు. " ఈతడు మన కొంగును పట్టుకొని, మన వస్త్రాలను దొంగిలించడం కోసం వెంబడించి వచ్చాడు. మనంకూడా ఇతనిని అనుసరించి, మోసం చేసి, వీటిని తీసుకొని పోయే దారి ఏది?" అని ఆలోచించి, ఇతనిని ప్రార్థించారు, స్తుతించారు, మంగళాశాసనం చేశారు. " ఈ విధంగా తుంటరితనం చేసే ఇతనిని కన్నతల్లి కూడా ఒక తల్లియేనా?" అని యశోదా దేవిని కూడా నిందించారు. ఈ విధంగా తమ ఆర్తిని వ్యక్తం చేసేవారై, పలు విధాలుగా అతనిని ప్రాధేయపడ్డారు– అనే విషయాన్ని శ్రీకృష్ణుడు కూడా వీరికి వస్త్రాలను, ఆభరణాలను మొదలైనవానిని తిరిగి ఇచ్చి వీరితో కలిశాడు –అనే విషయాన్ని తెలిసి ఈ దశకం పూర్తి అవుతున్నది.

*** కోళి అழைప్పదన్ మున్న మ్ * కుడైందు నీరాడువాన్ పోందోమ్ **
*ఆழியన్ శెల్వన్ ఎழுన్దాన్ * అరవణై మేల్ పళ్ళి కొండాయ్! ***
*ఏழைమై ఆట్పువుమ్ పట్టోమ్ * ఇని ఎన్ఱుమ్ పొయ్ కైక్కు వారోమ్ **
*తోழியుమ్ నానుమ్ తొழுదోమ్ * తుగిలై ప్పణిత్తరుళాయే 1*

తాము పడే నైచ్యాన్ని పలుకుతూ, నమస్కరిస్తూ, ఈ తమ వస్త్రాలను తిరిగి ఇమ్మని శ్రీకృష్ణుని గోపికలు ప్రార్థిస్తున్నారు.

ఆదిశేషుడనే పడుకపై నిద్రించే స్వామీ! కొలనులో మునిగి స్నానం చేయడం కోసం కోడి కూయడానికి ముందే వచ్చాము. ఇప్పుడు, లక్ష్మీ సహితుడై తనలో భగవంతుడు వేంచేసి ఉండడం అనే సంపదను కలవాడైన సూర్యుడు ఉదయించాడు. మేము నీవల్ల చాలా కష్టాన్ని పొందాము. ఇకపై మా ఏనాటికి ఈ సరస్సు దగ్గరకు రాము. నేను, నా చెలికత్తె నీకు నమస్కరిస్తున్నాము. మా వస్త్రాలను నీవు తిరిగి ఇయ్యి.

*ఇదు ఎన్ పుగుందదు ఇంగందో! * ఇప్పొయ్యెక్కు ఎవ్వాఱు వందాయ్? **
*మదు ఇన్ తుழாయ్ ముడి మాలే! * మాయనే! ఎంగళ్ అముదే! ***
*విది ఇన్మై యాల్ అదు మాట్టోమ్ * విత్తగ ప్పిళ్ళాయ్! విరైయేల్ **
*కుది కొండరవిల్ నడిత్తాయ్! * కురుందిడై క్కూ ళై పణియాయ్ 2*

"ఈ గోపికలు తాము కోరినట్లు తమ వస్త్రాలను పొంది వెళ్ళిపోవాలని భావిస్తున్నారు తప్ప, నా అభిమతం ప్రకారం సంశ్లేషానికి అంగీకరించడంలేదు. వీరికి ఒక పాఠం నేర్పించాలి "అని భావించి, శ్రీకృష్ణుడు కుందదవృక్షంనుండి కిందకు దిగి, తాను ఇంతకుముందే చికటిలో మూటగట్టుకుని పోగా మిగిలిన వస్త్రాలను అన్నిటిని, దేనిని విడవకుండా, సేకరించి తీసుకొని, సుడిగాలి వలె తీరం అంతటా సంచరించి, " ఈ పని చేశాడు" అని గోపికలు తెలుసుకోవడానికి సాధ్యం కాని విధంగా, వస్త్రాలను వలె వారి మనసును కూడా దొంగిలించి, చాలా వేగంగా మళ్లీ కుందవృక్షం పైకి ఎక్కి దాగుకున్నాడు. ఉన్న వస్త్రాలను ధరించాలని భావించి గోపికలు తీరానికి వచ్చి చూడగా, అక్కడ ఒక్క వస్త్రం కూడా లేనందువల్ల, ఏమి చేయాలో తెలియలేక, శ్రీకృష్ణుని స్తుతించి, వస్త్రాలను తిరిగి ఇమ్మని కోరుతున్నారు.

ఇక్కడ ఏమి జరిగింది? అయ్యో! ఈ చెరువు దగ్గరకు ఏ దారిలో వచ్చావు? తేనె ఎల్లప్పుడూ స్రవించే భోగ్యమైన తులసినిమాలను శిరస్సులో అలంకరించుకున్న కిరీటాన్ని కల మహానుభావా! ఆశ్చర్యకరమైన చేష్టలను చేసేవాడా! మాకు అమృతం వలె భోగ్యమైనవాడొ!ఇది లేనందువల్ల మేము నీతో సంశ్లేషానికి అంగీకరించలేము. ఆశ్చర్యకరమైన చేష్టలను కల కుర్రవాడా! లొందర పడవద్దు. కాళియుడనే సర్పంపైన దూకి అతని శిరస్సుల పైన నాట్యం చేసినవాడా!ఔ కుందవృక్షం పైన పెట్టిన మా బట్టలను అనుగ్రహించు.

*ఎల్లే! ఈదెన్న ఇళమై? * ఎమ్మనైమార్ కాణిల్ ఒట్టార్ **
పొల్లాంగు ఈదెన్దు కరుదాయ్ * పూంగురుందేఱి ఇరుత్తి **
విల్లాల్ ఇలంగై అళిత్తాయ్! * నీ వేణ్డియదు ఎల్లామ్ తరువోమ్ *
పల్లారుమ్ కాణామే పోవోమ్ * పట్టై పణిత్తరుళాయే 3*

గోపికలు చిరకాలం నీటిలో నిలచి, చలివల్ల, కాళ్ళను కరిచే చేపల వల్ల బాధను పొందగా, శ్రీకృష్ణుడు వీరి వస్త్రాలను అన్నిటిని తీసుకొని కుందవృక్షం పైన పెట్టుకొని ఉన్నాడు. "మేము నీటిలో నిలచి బాధను పొందుతూ ఉండగా, నీవు ఏమి పలుకకుండా

ఉండవచ్చునా?మా వస్త్రాలను ఇచ్చి వేయి" అని గోపికలు అన్నారు. " మీరు తీరానికి రండి. మీ వస్త్రాలను ఇస్తాను" అన్నాడు, కృష్ణుడు. దానిని నిజమని నమ్మి కొందరు ఒడ్డు పైకి వచ్చారు. ఆ విధంగా ఒడ్డుకు వచ్చిన గోపికల అవయవాలను గుచ్చి చూచి, చిరునవ్వు నవ్వి, కొన్ని కాముక వ్యాపారాలను కృష్ణుడు చేశాడు. దానిని చూచి గోపికలు ఈ విధంగా పలుకు తున్నారు.

ధనస్సుతో లంకను నాశనం చేసినవాడా! ఇవి ఏమి కుర్రతనపు చేష్టలు! మా తల్లులు చూస్తే మళ్ళి మమ్ములను ఇంటికి దారిలో రానివ్వరు. నీవైతే అందరూ నిందించేటట్లు మమ్ములను ఈ విధంగా నిలుపుతున్నావు. ఇది చాలా తగని కార్యమని నీవు భావించడం లేదే! పూచిన కుందవృక్షం పైన ఎక్కి కూర్చున్నావు. నీవు కోరిన వాటిని అన్నిటిని ఇస్తాము. ఊరిలో ఉండేవారు పలువురు మమ్ములను చూడడానికి ముందే వెళ్లిపోతాము. మా వస్త్రాలను తిరిగి ఇయ్యి.

*పరక్క విళిత్తెంగుమ్ నోక్కి * ప్పలర్ కుడైందాడుమ్ శునైయిల్ **
అరక్క నిల్లా కణ్ణ నీర్గళ్ * అలమరుగిన్రవా పారాయ్ **
ఇరక్కమేల్ ఒన్రుమిలాదాయ్! * ఇలంగై అళిత్త పిరానే! *
కురక్క రశు ఆవదఱిందోమ్ * కురుందిడై క్కూళై పణియాయ్ 4*

ఈ విధంగా తాను చెప్పిన దానికి అంతటికి గోపికలు బదులు చెప్పడాన్ని చూసిన కృష్ణుడు వీరిని భయపెట్టడం కోసం కొన్ని పనులను చేశాడు. దానిని చూసి గోపికలు తమ నిస్సహాయతను ప్రదర్శిస్తూ, అతడు తమను అనుగ్రహించే చెట్లు ప్రార్థిస్తున్నారు.

లంకను నాశనం చేసిన స్వామి!పలువురు దిగి స్నానం చేసే ఈ సరస్సు తీరంలో నాలుగు వైపుల బాగా నిశితంగా గమనించి చూస్తున్నావు. మా కన్నీళ్లు ధారలుగా పారుతూ ఎంత తుడుచుకున్నా నిలువకుండా కారుతున్నాయి, చూడు. కొంచెం కూడా దయ లేనివాడా! నీవు చెట్టు పైకి ఎక్క గలిగినవారిలో చాలా సమర్థుడవు అనే సంగతిని తెలుసుకున్నాము. అందువల్ల కుందవృక్షంపై ఉండే మా వస్త్రాలను మాకు ఇయ్యి.

*కాలై క్కదు విడుగిన్ఱ * కయలొడు వాళై విరవి *
వేలై ప్పిడిత్తు ఎన్నై మార్గళ్ ఓట్టిల్ * ఎన్న విళైయూట్టో? **
కోల చ్చిఱ్ఱాడై పలవుమ్ కొండు * నీ ఏఱి ఇరాదే *
కోలం కరియ పిరానే! * కురుందిడై క్కూత్తై పణియాయ్ 5*

గోదాదేవికి గోపిక భావన మనసులో ఉన్నందున, గొల్లవాడైన ఆ శ్రీకృష్ణుని వలె ఈమె కూడా గొల్ల కులంలో జన్మించినట్లుగా భావించినదై, అతని మనసు గ్రహించినద. . పూర్వం ఒకానొక సమయంలో గజేంద్రుడు మొసలిచే బాధను పొందినప్పుడు, భగవంతుడు తన సౌకుమార్యాన్ని ఏమీ చూడకుండా, ఆ ఏనుగు ఉండే సరస్సు తీరానికి చాలా తొందరగా వచ్చి, గజేంద్రుని రక్షించి, దానికి కలిగిన ఆపదను తీర్చిన తర్వాత కూడా, అతని మనస్సు శాంతించలేదు. "ఈ భక్తునకు ఆపద రావడానికి ముందుగానే వచ్చి, ఇతని బాధను తీర్చలేకపోయానే! బాధ కలిగిన తర్వాత వచ్చి బాధను పోగొట్టడం నిజమైన పరిహారం అవుతుందా!" అని భగవంతుని మనస్సు, గాయపడినద విషయాన్ని గోదాదేవి గ్రహించింది. " నీవు పూర్వం ఒకానొక సమయంలో నిన్ను ఆశ్రయించిన గజేంద్రుని ఒక ముసలి బాధించగా, ఆ మొసలి ఒక నీటిలోని జంతువు కదా! అని ముసలిని చూసి భావించకుండా, వేగంగా గజేంద్రుడు ఉండే తీరానికి వచ్చి, అతని బాధను తీర్చావు కదా. ఈనాడు రెండు చేపలు మా కాళ్ళను కరుస్తున్నాయి, చూశావా?" అని అంటే, ఆ మాట విని, కృష్ణుడు తన బాధను తీర్చడం కోసం వేగంగా చెట్టు దిగి వస్తాడు వస్తాడు అని భావించి, " తన కాళ్ళను చేపలు కరిచే విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ పాశురంలో గోదాదేవి పలుకుతున్నది.

నల్లని తిరుమేని కల స్వామీ! శ్రీ కృష్ణా!నీటిలో ఉండే బేడిస చేపలు, సొర చేపలు ఒకటిగా కలిసి మా కాళ్ళను కరుస్తున్నాయి. ఈ విధంగా నీవు మమ్ములను బాధపెట్టడాన్ని మా తండ్రులు చూసి, వేలాయదధాలను పట్టుకొని, నిన్ను తరుముకుంటూ వస్తే ఆ తరువాత ఏమి జరుగుతుంది? నీవు అందమైన వస్త్రాలను

అన్నిటిని అలంకరించుకొని, చెట్టు పైకి ఎక్కి కూర్చోకుండా, కుందవృక్షంపై ఉండే మా వస్త్రాలను మాకు తిరిగి ఇయ్యి.

*తడత్తవిళ్ తామరై ప్పొయ్ కై * త్తాళ్ కళ్ ఎమ్ కాలై క్కదువ *
విడ త్తేళ్ ఎఱిందాలే పోల * వేదనై ఆట్రుమ్ పట్టోమ్ **
కుడత్తై ఎడుత్తేఱి విట్టు * క్కూత్తాడ వల్ల ఎమ్ కోవే! *
పడిట్టై ఎల్లామ్ తవిర్ న్దుదు * ఎంగళ్ పట్టై ప్పణిత్తరుళాయే 6*

గడచిన పాశురంలో సరస్సులో ఉండే చేపలు తమ కాళ్ళను పట్టుకొని కరుస్తున్నవి అని గోపికలు అన్నారు. ఆ మాట ఏమీ ఉపయోగం లేనందున, " ఈ సరస్సులో తామర కాడలు విషపు తేళ్ళు కుట్టినట్లుగా మమ్ములను బాధిస్తున్నాయి "అని పలికినట్లయితే శ్రీకృష్ణుడు తమపై దయచూపిస్తాడేమో! అని భావించి, ఆ విధంగా అతనిలో ఈ పాశురంలో పలుకుతున్నారు.

విశాలంగా వికసించిన తామర పువ్వులను కలిగిన ఈ తటాకంలోని తామర కాడలు మా కాళ్ళను విషపు తేళ్లు కుట్టినట్లుగా చాలా బాధ పెడుతున్నాయి. కుండలను ఎత్తి పట్టుకొని పైకి ఎగురవేసి, నాట్యం చేయడంలో సామర్థ్యం కల మా స్వామీ! నీవు చేసే తుంటరి పనులను అన్నిటిని విడచిపెట్టి, మా వస్త్రాలను మాకు తిరిగి ఇయ్యి.

*నీరిలే నిన్దయర్క్కిన్ఱోమ్ * నీది అల్లాదన శెయ్ దాయ్ *
ఊర్ అగమ్ శాలవుమ్ శేయ్ త్తాల్ * ఉళ్ళి ఎల్లామ్ ఉణర్వానే! **
ఆర్వముునక్కే ఉడైయోమ్ * అమ్మనైమార్ కాణిల్ ఒట్టార్ *
పోర విడాయ్ ఎంగళ్ పట్టై * ప్పూంగురుందేఱి ఇరాదే 7*

"సరస్సులోని తామర కాడలు విషపు తేళ్ళు కుట్టినట్లుగా మమ్ములను బాధిస్తున్నాయి" అని తాము చెప్పినప్పటికీ, శ్రీకృష్ణుడు దయ చూపించలేదు. అందువల్ల గోపికలు, " ఈ విధంగా మేము బాధపడేటప్పుడు, నీతిలేని ఈ చేష్టలను చేసి,

నీ పట్ల ప్రేమను కలిగిన మాకు నిందను కలిగించి, మమ్ములను బాధ పెట్టకుసుమా!" అని అంటూ ఇందులో శ్రీకృష్ణుని చూసి అంటున్నారు.

కల్పాంతకాలాలలో అంతటా జగద్రక్షణ చింతనతో మేల్కొని ఉండేవాడా! నీటిలో నిలచి ఉండి మేము చాలా బాధపడుతున్నాము. నీతిలేని చేష్టలను నీవు చేస్తున్నావు. నీ విషమకృత్యాలకు తప్పించుకుని పోదామని అంటే, మా ఊరు ఈ రేపల్లె, అందులోని ఇళ్ళు ఇక్కడికి చాలా దూరంలో ఉన్నాయి. అయ్యో! విధంగా నీవు మమ్ములను బాధించినా, నీ విషయంలోనే ప్రేమను కలవారమై ఉన్నాము. మా తల్లులు నీవు మమ్ములను కలవడాన్ని చూస్తే అంగీకరించరు. మా వస్త్రాలు మాకు దొరికేటట్లు అనుగ్రహించు. కుంద వృక్షం పైన ఎక్కి కూర్చొని, తుంటరి పనులను చేయకు.

*మామిమార్ మక్క ళే అల్లోమ్ * మట్టుమ్ ఇంగెల్లారుమ్ పోందార్ *
తూమలర్ క్క ణ్ణాళ్ వళర * త్తొల్లై ఇరా త్తుయిల్వానే! **
శేమమేల్ అన్నిదు శాల * చ్చిక్కెన నామిదు శొన్నోమ్ *
కోమళ ఆయర్ కొ ళ్ళుదే! * కురుందిడై క్కూత్తై పణియాయ్ 8*

"నీతిమాలిన పనులను చేసి, మమ్ములను బాధించకు" అని పలికిన తరువాత కూడా శ్రీకృష్ణుడు తాన చిలిపి చేష్టలను చేయడం మాని, తమ వస్త్రాలను ఇవ్వనందు వల్ల, " నీవు జంకవలసిన రీతిలోని సంబంధాన్ని కల మా అత్తగారు మొదలైనవారు ఇక్కడకు వచ్చారు. కనుక, వారికి ముందు ఈ విధంగా నీవు తుంటరి పనులను చేసి, అపవాదాన్ని కలిగించకు" అని ఇందులో పలుకుతున్నారు.

గడచిన రాత్రులలో పరిశుద్ధమైన తామరపూవువంటి కన్నులను నిద్రాపరవశం అయ్యేటట్లు నిదురించినవాడా! ఈ సరస్సు తీరంలో ఉండేవారు కేవలం నీకు పత్నులవరుసలోని సంబంధం కలిగినవారు మాత్రమే కాదు, ఇంకా మిగిలిన మా అత్తగారు, వారి తల్లులు మొదలైనవారు కూడా ఇక్కడకు వచ్చి ఉన్నారు. నీవు చేసే ఈ తుంటరితనం ఎంత మాత్రం మంచిది కాదు. ఈ మాటను మేము నిజంగానే

చెబుతున్నాము. గోపాలురకు అందరికీ చిగురువంటివాడా! మా వస్త్రాలను మాకు ఇయ్యి.

*కంజన్ వలై వైత్త అస్తు * కార్ ఇరుళ్ ఎల్లిల్ పిశైత్తు *
నెంజు దుక్కమ్ శెయ్య పోందాయ్ * నిన్న ఇక్కన్ని యరోమై **
అంజ ఉరప్పాళ్ అశోదై * ఆణాడ విట్టిట్టిరుక్కుమ్ *
వంజగ ప్పేయ్ చ్చి పాల్ ఉణ్ణ * మశిమై ఇలి! కూళై తారాయ్ 9*

శ్రీకృష్ణునకు రెండు విధాలైన స్వభావాలు ఉన్నాయి. అవి ఏమి ?అంటే, పంచ పాండవులవలె తనను స్తుతించేవారికి వారు కోరిన కోరికలను ఇస్తాడు. శిశుపాలుని వలె తనను నిందించేవారికి కూడా మంచిని చేస్తాడు. ఇంతకుముందు గోపికలు శ్రీకృష్ణుని సుతించినప్పటికీ ఏమి ప్రయోజనం కలుగలేదు. అందుచేత ఇతనిని ఇక నిందిస్తే, ఆ విధంగా అయినా మన కార్యం సిద్ధిస్తుందా? అని భావించి, ఈ పాశురంలోల గోపికలు అతనిని నిందించడం ప్రారంభించారు.

కంసుడు నిన్ను వధించాలని భావించిన కాలంలో, చాలా దట్టమైన చీకటిని కలిగిన రాత్రిలో, తప్పించుకుని బయటపడి, కన్యలమైన మాకు మనోవేదన కలగడం కోసమే వచ్చి నీవు జన్మించావు. యశోదా దేవి నీవు భయపడేటట్లు అదలించకుండా, నీవు తుంటరితనం చేసేటట్లుగా విడిచిపెట్టిం. ది వంచన కలిగిన పూతన పాలను ఆమె ప్రాణాలతో పాటు తాగిన సిగ్గులేనివాడా! మా వస్త్రాలను మాకు తిరిగి ఇయ్యి.

*** కన్ని యరోడెంగళ్ నంబి * కరియ పిరాన్ విళైయాట్టై *
పొన్ని యల్ మాడంగళ్ శూళ్ంద * పుదువైయర్ కోన్ పట్టన్ కోదై **
ఇన్ని శైయాల్ శొన్న మాలై * ఈరైందుమ్ వల్లవర్ తామ్ పోయ్ *
మన్ని య మాదవనోడు * వైకుందమ్ పుక్కిరుప్పారే 10*

తమ మనోరథం సిద్ధించి, ఈ దశకఫలాన్ని పలుకుతూ ముగిస్తున్నారం. ఈ దశక ప్రవేశంలో —"ఈ విధంగా అనేక విధాలుగా తనను గోపికలు అనువర్తించగా, కృష్ణుడు

కూడావారికి వస్త్రాలను ఇచ్చి, వారితో కలిశాడు—అని ముగించబడుతున్నది" అని తెలుపబడడం గమనించాలి. ఈ పాశురంలో శ్రీకృష్ణుడు గోపికలను సంశ్లేషించినట్లు చెప్పబడలేదే! అని అంటే, తరువాత దశకంలో శ్రీకృష్ణుని విశ్లేషించిన గోపికలు తమ విరహాన్ని సూచించే "కూడల్" అనే క్రీడను ఆడుతున్నందున, ఇక్కడ విశ్లేషానికి ముందు సంశ్లేషం ఏర్పడి ఉండాలి కనుక, గోపికలను శ్రీకృష్ణుడు ఇక్కడ సంశ్లేషించాడు అనేది సిద్ధం.

మాకు స్వామియై, నల్లని వర్ణాన్ని కలిగిన శ్రీకృష్ణుడు రేపల్లెలోని గొల్ల కన్యలతో ఆడిన దివ్యలీలనుగూర్చి బంగారం వలె అందమైన భవనాలను చుట్టూ కలిగిన శ్రీవిల్లి పుత్తూరు నగరానికి నాయకులైన పెరియాళ్వార్ల కుమార్తె అయిన గోదాదేవి మధురమైన స్వరంతో వాగ్మాలిక అయిన ఈ పది పాశురాలను పలికింది. వీనిని అనుసంధించగలిగినవారు అర్చిరాది మార్గంలో పయనించి, పరమపదాన్ని పొంది, అక్కడ నిత్య వాసం చేసే లక్ష్మీ నాథునితో కలసి నిత్యానుభవాన్ని పొంది ఉజ్జీవిస్తారు.

நாலாம் திருமொழி - தெళ్ళియార్ పలర్

గడచిన దశకంలో గోపికలు తమ వస్త్రాలను ఇవ్వవలసినదిగా శ్రీకృష్ణుని ప్రార్థించారు. వారి ప్రార్థనను మన్నించి శ్రీకృష్ణుడు వారిది వస్త్ర ప్రదానాన్ని చేసి అంతర్ధానం చెందాడు. తరువాత శ్రీకృష్ణ భగవానునిలో తమకు సమాగమం కలుగుతుందా? లేదా? అనే ఆర్తి గోపికలకు అధికమైనది. వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం ఒక విధానాన్ని ఆచరించాడురు. ఆ విధానమే ఈ దశకంలో ప్రస్తావింపబడుతున్నది ఇది ద్రావిడ దేశంలో ఉండే ఒక దేశ్యమైన ప్రకారం. ప్రేయసీ ప్రియులు ఒకరికొకరు దూరమైనప్పుడు, తాము కోరినవారిలో తమకు కలయిక సంభవిస్తుందా? సంభవించదా? అని పరీక్షించుకునే రీతి ఇది. నేలపై పలుగీతలను గీసి, వాటిని జంటలు జంటలుగా లెక్కించినప్పుడు, చివరిగా సరి సంఖ్య వస్తే, తమ మనోరథం నెరవేరుతుందని, బేసి సంఖ్య మిగిలితే తమ కోరిక నెరవేరదని విశ్వాసం. ఈ విధంగా పరీక్షించి చూసుకుంటూ కాలాన్ని గడపడం అనేది విరహిణుల స్వభావం. దీనికి తమిళంలో "కూడల్ ఇழైత్తల్" అని అంటారు. గోపికల ఈ క్రమాన్ని ఆచరించి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నట్లుగా భావిస్తూ, గోదాదేవి ఈ దశకంలోని పాశురాలను పాడుతున్నది. శ్రీరంగం, తిరుమల, తిరుమాలిరుమ్ శోలై, వేంకటాచలం తిరుక్కణ్ణపురం మొదలైన క్షేత్రాలలో వేంచేసి ఉండే స్వామిలో తనకు కలయిక సంభవిస్తుందా? లేదా? అని గోదాదేవి తనకు స్వామిలో సంశ్లేష విషయంలో ఉండే కుతూహలాన్ని పరీక్షించుకోవడం ఈ దశకంలోని ప్రమేయం.

గడచిన దశకంలో శ్రీకృష్ణుడు గోపికల వస్త్రాలను అన్నిటినీ అపహరించి కుందవృక్షం పైకి ఎక్కి కూర్చున్నాడు. ఈ గోపికలు అతనిని ప్రార్థించి, నిందించి, ఇంకా పలుదారులలో తమ వస్త్రాలను ఇస్తే తప్ప నిలువ లేని రీతిలో కొన్ని పనులను చేశారు. అతడు కూడా వారికి వస్త్రాలను తిరిగి ఇచ్చాడు. గోపికలు వాటిని పొందారు. శ్రీకృష్ణుడు. గోపికలు కోరినట్లు వారి మధ్య సంశ్లేషం నెరవేరింది.

"సంయోగాః విప్రయోగాంతాః" (రామాయణం –అయోధ్యకాండ –105 –16) (సంయోగాలు విరహంతో పూర్తి అవుతాయి) అనే విధంగా వీరి సంశ్లేషం కూడా విశ్లేషంతోనే పూర్తి అయినది. ఈ సంసార మండలంలో ఏ భోగం కూడా నిలుకడగా నిలిచేదిగా ఉండదు. కనుక శ్రీకృష్ణుడు ఈ గోపికలను విడచిపెట్టి వెళ్ళాడు. వీరు కూడా మళ్లీ ఒకసారి మన వస్త్రాలను అపహరించినా పాపం లేదు, శ్రీకృష్ణుని చూస్తే చాలు అని అతనిని దర్శించడం కోసం కూడల్ అనే ప్రక్రియను అనుసరిస్తున్నారు.

ఈ ప్రక్రియ వివరం ఏమంటే –భూమిలో గుండ్రంగా గీచి, దాని లోపల లెక్కించకుండా గడులను గీచి, వాటిని రెండు రెండుగా గడులుగా లెక్కించి చూసినప్పుడు, చివరలో సరి సంఖ్యలో వస్తే తలచిన కార్యం పూర్తి అవుతుంది అని, బేసి సంఖ్యలో వస్తే భావించిన కార్యం పూర్తి కాదు అని భావించడమే ఇది. ఈ లోకంలో భగవద్భాగవతానుభవాలు కొంతసేపు కలిగి, కొంతసేపు కలుగకుండా కదా ఉంటాయి. కలుగకుండా కూడా పోయే అవకాశం కల ఈ అనుభవాన్ని వీరు మళ్ళి కోరవచ్చునా? అంటే, ఇంతకంటే తక్కువది అయినా, లోకంలోని శబ్దాదివిషయాల అనుభవం కూడా తప్పక కలుగుతుంది అనే నిశ్చయం లేకపోయినా, వాటిని పలువురు కోరినప్పుడు, దాని కంటే చాలా గొప్పది అయిన ఈ భగవదనభవాన్ని కోరడం గొప్పదే కదా. ఈ విధంగా గొప్ప విషయాన్ని, పొందినా పొందలేకపోయినా, ఆశపడడమే గొప్ప భాగ్యం కదా. భగవంతుని ఉపాయంగా ఆశ్రయించిన ఈ గోదాదేవి కూడల్ కాలిలో పడవచ్చునా? అని అంటే, పరమ చేతనుని విడచి, అచేతనాలైన తమ ప్రయత్నాలతో ఫలాన్ని పొందాలని చూచే సాధనాంతరనిష్ఠులవలె ఈమె కూడా అచేతనమైన కూడల్ కాలిలో పడుతున్నది. భగవంతుని పొందాలి అనే లొందరలోని అతిశయించేత ఈమె విధంగా చేస్తున్నది. ఈ త్వరగా చేత ఏర్పడిన అజ్ఞానం వల్ల ఈమె ఈ పనిని చేస్తున్నది. వృత్తహీనుడైన (ఏ ఆచారం లేనివాడైన, తనను ఆశ్రయించినవారి దగ్గర వారు ఏమి సాధనాన్ని అనుష్ఠించారు? అని చూడనవాడైన) శ్రీకృష్ణుని వృత్తవతియై, (కూడల్ అనే ప్రక్రియను చేసేదై, సాధనానుష్ఠానాన్ని చేసేదై) భగవంతుని పొందాలని చూస్తున్నది కదా.

భగవద్విషయం యొక్క గొప్పతనాన్ని చూసినప్పుడు, ఈమె ఇంత అజ్ఞానాన్ని పొందడం కూడా పొసగుతుంది. భగవంతుని విషయంలో చాలా అభినివేశాన్ని కల ఈమె ఇంతటి అజ్ఞానం పొందకపోతే భగవంతుడనే విషయాన్ని వైలక్షణ్యమే లేకుండా పోతుంది.

*** తెళ్ళియార్ * పలర్ కై తొ ఱ్ఱుమ్ దేవనార్ *
వళ్ళల్ * మాలిరుంజోలై మణాళనార్ **
పళ్ళి కొళ్ళుమిడత్తు * అడి కొట్టిడ *
కొళ్ళుమాగిల్ * ని కూడిడు కూడలే! 1*

తిరుమాలిరుమ్ శోలై క్షేత్రంలో వేంచేసి ఉండే స్వామి పవళించి ఉండే చోటు అయిన శ్రీరంగంలోని స్వామికి శ్రీచరణ కైంకర్యం చేసే అదృష్టం కలుగుతుందా? లేదా? అని ఇందులో గోదాదేవి పరీక్షించుకుంటున్నది.

ఓ కూడిక దైవమా! జ్ఞానాన్ని కలిగిన నిత్యులు పలువురు తమ చేతులను జోడించి నమస్కరించే స్వామియై, గొప్ప ఉదారుడైన తిరుమాలిరుమ్ శోలై అనే క్షేత్రంలో వేంచేసి ఉండే అందమైన వరుడైన పరమపురుషుడు శయనించి ఉండే చోటు అయిన శ్రీ రంగంలో అతని శ్రీ పాదాలను నేను సంవాహనం చేసేటట్లు అతడ సంకల్పించినట్లయితే నీవు కూడాలి.

*** కాట్టిల్ వేంగడమ్ * కణ్ణపుర నగర్ *
వాట్టమిన్ఱి * మగిళ్ందుఱై వామనన్ **
ఓట్టురా వందు * ఎన్ కై పఱ్ఱి * తన్నొ డుమ్
కూట్టుమాగిల్ * ని కూడిడు కూడలే! 2*

స్వామి వేంకటాచలంలోను, తిరుక్కణ్ణ పురంలోను నన్ను పొందడానికి సాధనానుష్ఠానం చేయడానికి ఆరంభించినట్లున్నాడు. దాని ఫలంగా అతడు వేగంగా వచ్చి, నా హస్తాన్ని పట్టుకునేటట్లు నీవు చేయగలిగితే, ఓ కూడిక దైవమా! నీవు కూడు.

*పూమగన్ పుగళ్ వానవర్ * పోట్టుద*

*ఱ్ఱామగన్ * అణి వాణుదల్ * దేవకి*
*మామగన్ ** మిగు శీర్ * వశుదేవర్ తమ్ *
*కోమగన్ వరిల్ * కూడిడు కూడలే! 3*

ఉభయవిభూతి నాథుడై, శ్రీకృష్ణుడుగా అవతరించినవానిని నీవు నాతో కలపాలి అని ఇందులో కూడిక దైవాన్ని గోదాదేవి వేడుతున్నది

నాభీకమలంలో జన్మించిన జన్మ బ్రహ్మ, గొప్ప కీర్తిని కలిగిన నిత్య సూరులు పాడి స్తుతించడానికి తగిన గొప్పతనాన్ని కలిగిన పురుషోత్తముడై, అందమైన ఫాలభాగాన్ని కలిగినవాడై దేవకీ పుత్రుడై, గొప్ప కళ్యాణ గుణాలను కలవాడై వసుదేవుని పుత్రుడైన కృష్ణుడు నన్ను సంశ్లేషించటానికి వచ్చేటట్లయితే, ఓ కూడిక దైవమా! నువ్వు కూడు.

*ఆయ్ చ్చిమార్గళుమ్ * ఆయరుమంజిడ *
*పూత్త నిళ్ * కడంబేఱి ప్పుగ ప్పాయ్ న్దు **
*వాయ్ త్త కాళియన్ మేల్ * నడమాడియ *
*కూత్తనార్ వరిల్ * కూడిడు కూడలే! 4*

తన కాళ్లతో కాళీయుని మర్దించినవాడైన శ్రీకృష్ణుడు తన చేతులతో నా వక్షోజాలను మర్దించేటట్లుగా నీవు కూడాలి –అని ఇందులో అంటున్నది.

గోపికలు, గొల్లలు భయపడేటట్లుగా పూచిన, ఎత్తయిన కుందవృక్షాన్ని ఎక్కి, కాళీయుని తలలపై దుమికి, అతని శిరస్సులు నీటిలో మునిగిపోయేటట్లుగా చేసి, భాగ్యశాలి అయిన అతనితలలపై నర్తనం చేసిన నాట్యశాస్త్ర ప్రవీణుడైన కృష్ణుడు నా దగ్గరకు వచ్చేటట్లయితే, ఓ కూడిక దైవమా! నీవు కూడాలి.

*మూడ మాళిగై శూళ్ * మదురై ప్పది*
*నాడి * నమ్ తెరువిన్ * నడువే వందిట్టు **
*ఓడై మా *మద యానై ఉదైత్తవన్ *
*కూడుమాగిల్ * ని కూడిడు కూడలే! 5*

విరోధులను నిరసించడం అనేది స్వభావంగా కలిగినవాడు నా దగ్గరకు వచ్చేటట్లయితే కూడమని ఇందులో కూడిక దైవంతో గోదాదేవి పలుకుతున్నది.

ఫాలభాగంలో పట్టాన్ని కలిగినదై, చాలా మదాన్ని కలిగినది అయిన కువలయాపీడం అనే ఏనుగును మర్దించి, వధించిన శ్రీకృష్ణుడు అంతస్తులను కలిగిన సౌధాలను చుట్టూ కల మధురా నగరంలో మా ఇంటిని అన్వేషిస్తూ, మా వీధి నడుమ వచ్చి మనతో కలిసేట్లయితే, ఓ కూడిక దైవమా! నువ్వు కూడు.

*అట్రువన్ * మరుద ముఱియ నడై*
*కట్రువన్ * కంజనై * వంజనైయిల్*
*శెట్రువన్ ** తిగ్రుమ్ మదురై ప్పది *
*కొట్రువన్ వరిల్ * కూడిడు కూడలే! 6*

"నాకోసమే ఇక్కడకు వచ్చి అవతరించినవాడు నాలో కలిసేటట్లయితే, కూడిక దైవమా !నువ్వు కూడాలి"అని ఇందులో పలుకుతున్నది.

ఇంతకు ముందే నాకుకోసం అవతరించినవాడై, రెండు మద్ది చెట్లమధ్య అవి విరిగిపడేటట్లు దోగాడుతో వెళ్ళినవాడై, కంసుని వంచనతో వధించినవాడై, ప్రకాశించే మధురానగరానికి ప్రభువైన శ్రీకృష్ణుడు వచ్చేటట్లు అయితే, ఓ కూడిక దైవమా! నువ్వు కూడు.

*అన్రిన్నా దన శెయ్ * శిశుపాలనుమ్ *
*నిన్ర నిళ్ * మరుదుమ్ ఎరుదుమ్ పుళ్ళుమ్ **
*వెన్ఱి వేల్ * విఱల్ కంజనుమ్ విఱ్ఱ * మున్*
*కొన్రవన్ వరిల్ * కూడిడు కూడలే! 7*

విరోధులను అందరినీ నిరసించిన శ్రీకృష్ణుడు వచ్చేటట్లయితే కూడమని ఇందులో పలుకుతున్నది.

పూర్వం ఏవగించుకోదగిన కార్యాలను చేసిన శిశుపాలుడు, దారిలో అడ్డుగా నిలచి ఉండే రెండు పెద్ద మద్ది చెట్లు, ఏడు ఎద్దులు, బకాసురుడు, విజయాన్ని కలిగించ

గలిగిన వేలాయుధాన్ని, బలాన్ని కలిగిన కంసుడు నశించిపోయేటట్లుగా అందరి ముందు వారిని వధించిన కృష్ణుడు వచ్చేటట్లయితే, కూడిక దైవమా! నువ్వు కూడు.

*ఆవల్ అన్బుడైయార్ తమ్ * మనత్తన్ని*
*మేవలన్ * విరై శూళ్ * తువరాపది*
*క్కావలన్ ** కట్టు మేయ్ త్తు * విళైయాడుమ్ *
*కోవలన్ వరిల్ * కూడిడు కూడలే! 8*

"స్వామి విషయంలో నా ఆర్తికి, ప్రేమకు ఏ కొరత లేదు. అతని దగ్గర రక్షకత్వ సౌలభ్య గుణాలకు ఏ కొరత లేదు. కూడిక దైవమా! నువ్వు కూడకపోవడమే లోటు అయినది అయినది" అని ఇందులో పలుకుతున్నది.

తన విషయంలో ఆశను, ప్రేమను కలిగినవారి మనసులో తప్ప ఇంకొక చోట పొందికను లేనివాడు, చక్కని వాసన కలిగిన ద్వారకా నగరానికి రక్షకుడు, లేగ దూడలను మేపి, క్రీడించే గోపాలుడు అయిన కృష్ణుడు వచ్చేటట్లయితే, ఓ కూడిక దైవమా! నువ్వు కూడు.

*కొణ్ణ కోల * క్కుఱుంగుడి వాయ్ చ్చెన్ఱు *
*పణ్ణు మావలి తన్ * పెరు వేళ్వియిల్ **
*అణ్ణముమ్ నిలనుమ్ * అడి ఒన్ఱినాల్ *
*కొణ్ణవన్ వరిల్ * కూడిడు కూడలే! 9*

తన సొత్తు అయిన లోకాన్ని కొలిచినవాడు, స్వామి అయిన శ్రీకృష్ణుడు నన్ను స్వీకరించేటట్లు చేయమని ఇందులో కూడిక దైవాన్ని గోదాదేవి వేడుతున్నది.

పూర్వం యజ్ఞోపవితాన్ని, కృష్ణాజినాన్ని, మౌంజిని, పవిత్రాన్ని, దండాన్ని అలంకరించుకున్న వామనమూర్తియై మహాబలియొక్క గొప్ప యాగ భూమిలో ప్రవేశించి, పై లోకాలను, క్రింది లోకాలను తన ఒక పాదంతో కొలిచినవాడైన త్రివిక్రముడు వచ్చేటట్లయితే, ఓ కూడిక దైవమా! నువ్వు కూడు.

*పగ్గగు నాన్మఱైయిన్ * పొరుళాయ్ *
మదమొగ్గగు వారణమ్ * ఉయ్య అళిత్త ** ఎమ్
అగ్గనార్ * అణి ఆయ్ చ్చియర్ శిందైయుళ్ *
కుగ్గనార్ వరిల్ * కూడిడు కూడలే! 10*

"శమదమాదులు లేని గజేంద్రుని కూడా రక్షించినవాడు మనలను రక్షించడంలో ఏ కొరత లేదు. కూడికదైవమా! అతడు వచ్చేటట్లయితే నీవు కూడు" అని ఇందులో పలుకుతున్నది.

అనాది అయిన నాలుగు వేదాల అంతరార్థమై ఉండేవాడు, మదం స్రవించే గజేంద్రుని కష్టాన్ని తీర్చి, అతడు తరించేటట్లు కృప చేసినవాడు, మేము అవినివేశం పొందేటట్లు చేయగలిగిన అందాన్ని కలవాడు, అందమైన గోపికల మనస్సు లోపల ప్రవేశించినవాడైన శ్రీకృష్ణుడు వచ్చేటట్లయితే, ఓ కూడిక దైవమా! నువ్వు కూడు.

*** ఊడల్ కూడల్ * ఉణర్ తల్ పుణర్దలై *
నీడు నిన్ఱ * నిఱై పుగళ్ ఆయ్ చ్చియర్ **
కూడలై * క్కుళిందై మున్ కూఱియ *
పాడల్ పత్తుమ్ వల్లార్క్కు * ఇల్లై పావమే 11*

ఈ దశకాన్ని అభ్యసించినవారికి కలిగే ప్రయోజనాన్ని పలికి ముగిస్తున్నది.

శ్రీకృష్ణ భగవానుని విషయంలో ప్రణయ రోషాన్ని కలిగి ఉండడం, దోషాలను లెక్కపెట్టడం, తరువాత సంశ్లేషించడం అనే ఇటువంటి కార్యాలలో చిరకాలంగా వర్తించేవారు, నిండయిన కీర్తిని కలిగినవారైన గోపికలు పలికిన, కూడిక దైవాన్ని గూర్చిన ప్రస్తావనను, అందమైన కేశపాశాన్ని కలిగిన గోదాదేవి అనుగ్రహించిన ఈ పది పాశురాలను అభ్యసించగలిగినవారికి భగవానుని విశ్లేషించి, క్లేశాన్ని పొందే రీతిలోని పాపం ఉండదు.

ఐందామ్ తిరుమొళి - మన్ను పెరుమ్ పుగళ్

శ్రీకృష్ణ భగవానుని రాకను తెలియజేయమని గోదాదేవి ఈ దశకంలో కోకిలలను ప్రార్థిస్తున్నది. గోదాదేవి తన ఉద్యానవనాలలో చిలుకలు, గోరువంకలు మొదలైన పక్షులను పోషిస్తూ, వాటికి భగవద్గుణాలను నేర్పుతున్నది. ఆ పక్షులలో చాలా మధురంగా కూయగలిగిన ఒక కోకిలను చూచి, "ఓ కోకిలా! శ్రీవేంకటేశ్వర్లు, రామచంద్ర మూర్తి, గరుడత్వధుడు లోకాలను ఆక్రమించిన శరణాలను కలవాడు శ్రీవిల్లి పుత్తూరు నగరానికి నాయకుడు శంఖచక్రగదాపాణి క్షీరసాగరంలో పరుండి ఉండేవాడు, శ్రీ శార్ ఙ్గం అనే ధనుస్సును ధరించినవాడు. నారాయణుడైన నా స్వామి లొందరగా నా దగ్గరకు వచ్చేటట్లు మధురంగా నీవు కూస్తేని విషయంలో నేను చాలా కృతజ్ఞతను కలిగి ఉంటాను. నీవు ఆ విధంగా చేయకపోతే నిన్ను ఇప్పుడే ఉద్యానవనం నుండి తరిమి వేస్తాను. ఓ కోకిలా! ని మధురమైన ధ్వనులతో నా ప్రియుడైన శ్రీకృష్ణుడు ఇక్కడకు వచ్చినప్పుడు, నేను అతనితో జరిపే ఆలోకన నీకు పరమ ప్రయోజనంగా ఉంటాయి నీవు గొప్ప ధర్మాన్ని చేసినదానివి కాగలవుసుమా!" అని అంటూ చాలా అందంగా కోకిలను ఉద్దేశించి గోదాదేవి సంభాషించడం ఈ దశకంలోని ప్రమేయ సారాంశం.

ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చు. పక్షులకు మన భాషను అర్థం చేసుకునే శక్తి గాని, తిరిగి సమాధానం చెప్పే సామర్థ్యం గాని లేనప్పుడు, అటువంటి పక్షులలో ఒక పక్షి అయిన కోకిలను చూచి గోదాదేవి ఈ విధంగా పలకడం ఏ విధంగా సమంజసం? గొప్ప వివేకాన్ని కలిగిన గోదాదేవి కోకిల కూసిన మధుర ధ్వనులను విని, భగవంతుడు తన వద్దకు వస్తాడని ఏ విధంగా భావించింది? అనేది ఆ సందేహం. ఈ విధంగా భావించనక్కరలేదు. ఎందుకంటే, "ఉభాభ్యామేవ పక్షాభ్యాం ఆకాశే పక్షిణాం గతిః, తథైవ జ్ఞాన కర్మభ్యాం ప్రాప్యతే పురుషోత్తమః" (పక్షులు తమ రెండు రెక్కలతో ఆకాశంలో ఎగిరగలిగేటట్లు, జ్ఞానులనే పక్షులు కూడా జ్ఞాన కర్మలనే రెండు రెక్కల ద్వారా పురుషోత్తమ ప్రాప్తిని పొందుతున్నారు) అనే మహర్షి సూక్తి ఒకటి ఉన్నది కదా. ఆ విధంగా జ్ఞానం, అనుష్ఠానం అనే రెండిటిని చక్కగా కలిగిన ఆచార్యులు మనలను భగవంతుని

సన్నిధి దగ్గరకు చేర్చగల సమర్థులని ఆళ్వార్లు తమ ప్రబంధాల్లో మనకు ఉపదేశించారు. ఆళ్వారులు చేసిన దూతప్రేషణ రూపమైన దశకాలను వివరించేటప్పుడు మన పూర్వాచార్యులు కూడా ఈ అభిప్రాయాన్నే. వ్యక్తం చేశారు. నాయనార్ అనేవర్యులు ఆచార్య హృదయం అనే గ్రంథంలో దీనిని సప్రమాణంగా తెలియజేశారు. అందుచేత ఇక్కడ గోదాదేవి కోకిలను ప్రార్థించడం అంటే –ఆచార్యులను గాని, శిష్యులను గాని ప్రార్థించడం అని భావించాలి.

"నీ కూడిడు కూడలే" (ఓ కూడిక దైవమా! భగవంతుడు నన్ను అనుగ్రహించేటట్లయితే నీవు కూడు) అని గడచిన దశకంలో భగవంతుని పొందడం అనే ప్రాప్యంలోని లోందరవల్ల అచేతనమైన కూడల్ యంత్రాన్ని శరణాగతి చేసింది, గోదాదేవి. కాని, అది జ్ఞాన శూన్యం కనుక, "కూడుతాను" అని కాని, "కూడను" అని కాని ఏ బదులు చెప్పలేదు. అందుచేత "అచేతనం కాలిలో పడడంలో ఏ ప్రయోజనం లేదు" అని భావించి, చైతన్యాన్ని కలిగిన కోకిలను శరణాగతి చేస్తున్నది, ఈ దశకంలో. దేనిని శరణాగతి చేస్తూ, ఏమి చేయమని చెప్పబోతున్నది? అని అంటే, స్వామితో కలిసి ఉండేటప్పుడు, మాటలను వింటే వాటికి బదులును చెప్పే అలవాటును కలిగినది, "అతిశక్యా పతత్రిషు "(పక్షులలో చాలా దూరం ఎగిరేది, జ్ఞానం మొదలైన శక్తులను కలిగినది) అనే విధంగా "జ్ఞానం అధికంగా కలిగినది కనుక, ఇది భగవంతునితో నన్ను చేరుస్తుంది" అని భావించి, కోకిల కాలిలో గోదాదేవి పడుతూ, "నీవైనా నన్ను స్వామితో చేర్చు"అని కోరుతున్నది. అడిగిన దానికి కోకిల తిరిగి సమాధానం చెప్పగలదు –అనేది మాత్రమే కూడల్ కంటే కోకిలకు కల ఆధిక్యం. దీనిని ఆధారంగా చేసికొని, గోదాదేవి ప్రార్థిస్తున్నది, ఈ దశకంలో.

"మిత్రమౌపయికం కర్తుం శత్రు స్థానం పరీప్సతా, వధం చానిచ్ఛతా ఘోరం త్వయాసౌ పురుషర్షభ!" (రావణా! నీవు బతకాలని అనుకుంటే, ఘోరమైన చావు తప్పించుకోవాలని అనుకుంటే, ఈ పురుషోత్తముడైన శ్రీరాముని స్నేహితునిగా చేసుకోవడం తగినది) అని, "విదితః స హి ధర్మజ్ఞః శరణాగత వత్సలః, తేన మైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి", (రావణా! శ్రీరాముడు ధర్మాన్ని తెలిసినవాడై, తనను శరణం

పొందినవారి విషయంలో వాత్సల్యాన్ని కలవాడుగా ప్రసిద్ధుడు. నీవు ప్రాణాలతో జీవించాలి) అని అనుకుంటే, అతనితో నీకు స్నేహం కలగాలి) అనే విధంగా ప్రతికూలుడైన రావణునితో కూడా "నీవు రామునకు మిత్రుడవై, నన్ను అతనిని కలిపి, మంచిగా కాలక్షేపం చేయవచ్చు కదా" అని పలికేవారు అటువంటి ప్రాతికూల్యం లేని కోకిలను ఈ విధంగా ప్రార్థించడంలో ఆశ్చర్యం లేదు కదా.

*** మన్ను పెరుమ్ పుగழ్ మాదవన్ * మామణివణ్ణన్ మణిముడి మైందన్*
*తన్నై * ఉగందదు కారణమాగ * ఎన్నంగிழక్కుమ్ వழక్కుడ్డో? ***
*పున్నై కురుక్కత్తిప్పూழల్ శెరుంది *ప్పొదుంబినిల్ వాழ్ముమ్ కుయిలే! *
*పన్ని ఎప్పోదుమిరుందు విరైందు * ఎన్నవళహాయన్ వర కూవాయ్ 1*

"బలవంతులు బలహీనులను బాధించకుండా ఉండేటట్లు ఆయా వస్తువులను అవి ఉండవలసిన స్థితిలో నిలిపి రక్షించే స్వామి నన్ను రక్షించకపోతే, అతనితో నన్ను చేర్చి రక్షించడం నీకే బాధ్యత కదా" అని అంటున్నది. స్వాపదేశంలో కోకిల మొదలైన పక్షులు జీవుని భగవంతునితో చేర్చే ఆచార్యులను సూచిస్తాయి అనే విషయం ఇక్కడ గమనించాలి.

మాధవి, ప్రియంగు, పున్నాగ మొదలైన వృక్షాలు నిండుగా ఉండే తోటలో వృక్షాల వివరాలలో నివసించే కోకిలా! నిత్యమై, అవధిలేని కళ్యాణ గుణాలను కలిగిన మాధవుడు, నీలమణి వంటి వర్ణాన్ని కలవాడు, నవరత్నాలు పొదిగిన కిరీటాన్ని కలవాడు, బలాన్ని కలిగినవాడైన స్వామిని ఆశపడడమే కారణంగా నా చేతి వలయాలు జారిపోయాయి. ఈ న్యాయం లోకంలో ఎక్కడైనా ఉన్నదా? ఇది చాలా అన్యాయంగా ఉన్నది. దీనికి నేనేమి చేయను? అని అంటావా! పగడం వంటి, పండిన దొండ పండు వంటి అధరాన్ని కలవాడైన నా స్వామి నా దగ్గరకు వచ్చి చేరేటట్లు రాత్రి పగలు అతని నామాలను పలుకుతూ శీఘ్రంగా నీవు పిలవాలి.

*వెళ్ళై విళి శంగు ఇడంగైయిల్ కొణ్ణ *విమలన్ ఎనక్కు రు క్కాట్టాన్ **
*ఉళ్ళం పుగుందెన్నై నైవిత్తు * నాళుమ్ఉయిర్ప్పెయ్ దు కూత్తాట్టు క్కాణుమ్ ***
*కళ్ళవిళ్ శెణ్బగ ప్పూమలర్ కోది *క్క ళిత్తిశై పాడుమ్ కుయిలే! **
*మెళ్ళ ఇరుందు మిళ్ళిట్టి మిళ్ళిట్టాదు * ఎన్ వేంగడవన్ వర కూక్కాయ్ 2*

తాను ఇప్పుడు ఉండే స్థితిని తెలిపినప్పుడే కోకిలకు దానికి తగిన పరిహారాన్ని అన్వేషించడానికి వీలుంటుంది కనుక, తన స్థితిని గోదా దేవి ఇందులో పలుకుతున్నది.

మకరందం స్రవిస్తున్న సంపెంగ పువ్వులోని అసారమైన అంశాన్ని తీసివేసి, సారమైన అంశాన్ని అనుభవించి, దానివల్ల ఆనందాన్ని పొంది, రాగాలను పాడుతున్న ఓ కోకిలా! శుద్ధ స్వభావాన్ని కలిగినదై, భగవంతునకు కైంకర్యం చేయడంలో రుచిని కలిగినవారిని ఆహ్వానించే శ్రీ పాంచ జన్యమనే శంఖాన్ని ఎడమ చేతిలో ధరించి ఉండే పరిశుద్ధుడైన పరమ పురుషుడు తన దివ్య మంగళ విగ్రహాన్ని నాకు దర్శింప చేయను అని అంటున్నాడు. అంతేకాక, నా హృదయం లోపల వచ్చి ప్రవేశించి, నేను బాధ పడేటట్లు చేసి, ఆ సమయంలో నేను ముగిసిపోయేటట్లు ఉంటే, ఇంకా నన్ను హింసించడం కోసం నన్ను పోనివ్వకుండా నిలిపి, ప్రతి దినం నా ప్రాణాలను హింసించి, నన్ను తల్లడిల్లి చేసి, వేడుకను చూస్తున్నాడు. నీవు చేయవలసినది ఏమి? అంటే, నీ మధురమైన పలుకులను పలికి, విలాస చేష్టితాలను చేయకుండా, నా కోసం, శ్రీవేంకటాచలంలో వచ్చి వేంచేసి ఉండే భగవంతుని ఇక్కడకు వచ్చేటట్లు పిలవాలి.

*మాతలి తేర్ మున్ను కోల్ కొళ్ళ * మాయన్ఇరావణన్ మేల్ * శరమారి*
*తాయ్ త్తలై అట్టుట్టు వీళ్ * త్తొడుత్తతలైవన్ వరవెంగుమ్ కాణేన్ ***
*పోదలర్ కావిల్ పుదు మణమ్ నాఱు *ప్పొఱి వణ్ణిన్ కామరమ్ కేట్టు * ఉన్*
*కాదలియోడుడన్ వాళ్ కుయిలే! * ఎన్ కరుమాణిక్కమ్ వర కూక్కాయ్ 3*

"మన విరోధులను పోగొట్టి పరమ భోగ్యమైన తన తిరుమేనిని మనకు అనుభవింపజేసేవాడు వచ్చేటట్లు నీవు కూయాలి" అని ఇందులో అంటున్నది.

చక్కని పూలు పూచే తోటలలో నూతనమైన పరిమళం వీచగా, అందమైన తుమ్మెద పాడే కామరం అనే రాగాన్ని ఆలకించి, ళనీ పెంటి పక్షితోపాటు ఆనందించే ఓ కోకిలా! మాతలి రావణుని రథం ముందు ముళ్ళు కర్రను తీసుకొని తన తేరును నడపగా, మాయావి అయిన రావణునిపై బాణ వర్షాన్ని, ఆరావణుని ప్రధానమైన తలను పలుమార్లు ఖండించి కింద పడేటట్లుగా ప్రయోగించినవాడైన భగవంతుని రాకను నేను ఏ దిక్కులోనూ చూడలేకున్నాను. అందుచేత నా అనుభవానికి యోగ్యుడై, నీల రత్నంవంటి తిరుమేని కలవాడైన ఆ స్వామి ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూయాలి.

*ఎన్బరుగి ఇనవేల్ నెడుకణ్ గళ్ *ఇమై పొరుందా పల నాళుమ్ **
*తుంబ క్కడల్ పుక్కు వైకుంన్ ఎన్బదోర్ *తోణి పెఱాదుళల్ కిన్ఱేన్ ***
*అంబుడైయారై ప్పిరివుఱు నోయ్ * అదు నీయుమ్ అఱిది కుయిలే! *
*పొంపురై మేని క్కరుళ క్కొడియుడై *ప్పుట్టణియనై వర క్కూవాయ్ 4*

"భక్తులను రక్షించడం కోసం పతాకాన్ని నిలిపినవాడై, మోక్షోపాయరూపుడై ఉండే వైకుంఠుడు ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూయాలి" అని అంటున్నది.

ఓ కోకిలా! ఎముకలు కూడా కరిగి పోవడమే కాకుండా, వేలాయుధ సమూహంవంటి, పదునైన, విశాలమైన నా కన్నులు దుఃఖం తీరి మూసుకోవడం లేదు. చిరకాలంగా విరహ దుఃఖమనే సముద్రంలో మునిగి, శ్రీ వైకుంఠనాథుడనే ఒక నావను నేను పొందలేక, ఆ సముద్రంలోపలనే తల్లడిల్లుతూ ఉన్నాను. ఇష్టమైనవారుదూరం కావడంవల్ల కలిగే దుఃఖాన్ని నీవు కూడా తెలిసిన దానవే కదా. బంగారం వలె ఆకర్షణీయమైన తిరుమేనిని కలవాడై, గరుడుని ధ్వజంగా కలవాడై, ధర్మమే మూర్తీభవించినట్లున్నాడు అని చెప్పబడే శ్రీకృష్ణుడు ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూయాలి.

*** మెన్న డై అన్న మ్ పరందు విళైయాడ్మ *విల్లిపుత్తూర్ ఉళ్ళాన్ తన్ *
*పొన్న డి కాణ్బదోర్ ఆశైయినాల్ * ఎన్నొరుకయఱ్ కణ్ణినై తుంజా***
*ఇన్న డిశిలోడు పాల్ అముదూట్టి *ఎడుత్త ఎన్ కోల క్కిళియై *
*ఉన్నొ డు తోళ్మై కొళ్ళువన్ కుయిలే! *ఉలగళందాన్ వర క్కూవాయ్ 5*

"వటపత్ర శాయిని నేను దర్శించేటట్లు నీవు కూయాలి" అని ఇందులో గోదాదేవి అంటున్నది.

మందగమనాన్ని కలిగిన హంసలు అంతటా వ్యాపించి, క్రీడించే చోటు అయిన శ్రీవిల్లి పుత్తూరులో వేంచేసి ఉండే భగవంతుని అందమైన శ్రీచరణాలను దర్శించాలి అనే ఒక ఆశతో పరస్పరం స్పర్ధించే రెండు చేపలవంటి నా కన్నులు నిద్రను పొందడం లేదు. ఓ కోకిలా! త్రివిక్రముడై, లోకాలను కొలిచిన స్వామి ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూయాలి. ఆ విధంగా నీవు కూయకపోతే, తీయని అన్నాన్ని, పాయసాన్ని తాగించి పెంచిన నా అందమైన చిలుక నీతో స్నేహం కలిగి ఉండేటట్లు చేయను సుమా.

*ఎత్తిశైయుమ్ అమరర్ పణిందేత్తుమ్ *ఇరుడీకేశన్ వలి శెయ్య *
ముత్తన్న వెణ్ముఱువల్ శెయ్య వాయుమ్ *ములైయుమ్ అఱగళ్నేన్ నాన్ **
కొత్తలర్ కావిల్ మణిత్తడమ్ * కణ్ణాడైకొళ్ళుమ్ ఇళంకుయిలే! * ఎన్
తత్తువనై వర కూగిట్రాగిల్ *తలై అల్లాల్ కైమ్మా ఱిలేనే 6*

"నేను ప్రాణాలను ధరించి నిలుపుకోవడానికి కారణమైన అతడు ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూసినట్లయితే, నేను జీవించినంత కాలం నా తలను నీ కాలిలో పొందికగా ఉండేటట్లు చేస్తాను (తనతో నమస్కరిస్తాను)" అని అంటున్నది, ఈ పాశురంలో.

పూల గుత్తులు వికసించే చోటు అయిన తోటలలో అందమైన ఒక చోట నిద్రించే ఓ కోకిలా! అన్ని దిక్కులలోని దేవతలు నమస్కరించి, స్తుతించే రీతిలోని గొప్పతనాన్ని కలిగినవాడు, తనను చూచినవారి ఇంద్రియాలను అన్నిటిని కొల్లగొట్టేవాడైన స్వామి తనను నాకు చూపకుండా కష్టపెట్టగా, దానివల్ల నేను ముత్యం వలె తెల్లని చిరునవ్వు, ఎర్రని ఆధారం, స్తనాలు అనే వీటి అందాన్ని కోల్పోయాను. నేను ప్రాణాలను ధరించి ఉండడానికి మూల కారణమైన ఆ స్వామి ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూసినట్లయితే, నేను జీవించినంత కాలం నా తలను నీ పాదాలలో పెట్టడం తప్ప, ఇంకొక ప్రత్యపకారాన్ని దేనిని చేయలేను.

*పొంగియ పాఱ్కడల్ పళ్ళి కొళ్వానై *పుణర్వదోర్ ఆశైయినాల్ * ఎన్*
*కొంగై కిళర్ న్దు కుమైత్తు క్కు తుగలిత్తు *ఆవియై ఆకులమ్ శెయ్యుమ్*
*అంగుయిలే! ** ఉనక్కెన్న మఱైందుఱైవు? *ఆళ్గియుమ్ శంగుమ్ ఒణ్ తణ్ణుమ్ **
*తంగియ కైయవనై వర క్కూవిల్ ని *శాల త్తరుమమ్ పెఱుది 7*

నేను పడే పాట్లను చూసి జాలిపడి, అతడు వచ్చేటట్లు నీవు కూసినట్లయితే, నీవు గొప్ప ధర్మాన్ని చేసినట్లు అవుతుంది అని అంటున్నది.

ఓ అందమైన కోకిలా!అలలు ఎగిసిపడే పాల సముద్రంలో పరుండి ఉండే భగవంతునితో సంశ్లేషించాలనే ఆశ చేత నా వక్షోజాలు పెద్దవై, చాలా ఉత్సాహాన్ని పొంది, నా ప్రాణాన్ని కరిగించి, వ్యాకుల పెడుతున్నాయి. అందమైన కోకిలా! ఎండ పడకుండా నీడలోనే ఉండడం వల్ల నీకు ఏమి ప్రయోజనం? శ్రీసుదర్శన పాంచజన్యాలను, గదను కలిగిన శ్రీహస్తాలను కలిగిన స్వామి ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూసినట్లయితే చాలా ధర్మాన్ని చేసినదానవు అవుతావు.

*శార్ ఙ్గమ్ వళైయ వలిక్కుమ్ * తడక్కై చ్చదురన్ పొరుత్తమ్ ఉడ్డైయ *
*నాంగళ్ ఎమ్మిల్ ఇరుందు ఒట్టియ కచ్చంగమ్ *నానుం అవనుమ్ అఱిదుమ్ **
*తేంగని మాంపొళిల్ శెంతళిర్ కోదుమ్ *శిఱు కుయిలే! * తిరుమాలై*
*ఆంగు విరైందొల్లై కూగిట్టి ఆగిల్ *అవనై నాన్ శెయ్ వన కాణి 8*

"మేము కూస్తేమాత్రం స్వామి వస్తాడా?" అని కోకిలకు అభిప్రాయమని భావించి, "వీర్యగుణంలోనూ అందరిని మించి ఉండేవాడు, అతడు. అతడు ఇక్కడకు వచ్చేటట్లు చేయగలిగిన లక్ష్మీదేవి కూడా దగ్గరలో ఉన్నది. అందుచేత అతడు రావడంలో ఏ అడ్డు లేదు. కనుక నువ్వు కూయాలి" అని ఇందులో అంటున్నది.

మధురమైన ఫలాలను కలిగిన మామిడి తోటలలో ఎర్రని చిగుళ్ళను నోటితో భుజించే ఓ లేత కోకిలా! తన వింటిని వంచి లాగే శక్తిని కలిగిన గొప్ప బాహువులను కలవాడై, మిక్కిలి సామర్థ్యాన్ని కలవాడైన స్వామి ప్రణయ రీతిలోనూ సామర్థ్యం

కలవాడు. అతడు, నేను– అనే ఇద్దరం కలసి ఉండి, మాలో మేము రహస్యంగా తీసుకొన్న సంకేతాన్ని మేము ఇద్దరమే తెలియగలం తప్ప, ఇంక వేరు ఎవరూ తెలియలేరు. దూరంలో ఉండేవాడైన శ్రియఃపతిని శీఘ్రంగా నీవు ఇక్కడకు వచ్చేటట్లు చేయగలిగితే, అతడు ఇక్కడకు వచ్చిన తరువాత అతని విషయంలో నేను చేయబోయే కృత్యాలను (అతడు నన్ను బాధ పెట్టిన దానికి సమాధానంగా నేను చేయబోయి పనులను) నీవు చూడబోతావు.

*పైంగిళి వణ్ణన్ శిరీదరన్ ఎన్బదోర్ *పాశత్తగప్పట్టు ఇరుందేన్ *
పొంగొళి వణ్డిరైక్కుమ్ పొళిల్ వాళ్ కుయిలే! *కుఱిక్కొణ్డు ఇదు ని కేళ్ **
శంగొడు చక్కరత్తాన్ వర క్కూవుదల్ *పొన్వళై కొణ్డు తరుదల్ *
ఇంగుళ్ళ కావినిల్ వాళ్ క్కరుదిల్ *ఇరణ్డత్తొన్ఱేల్ తిణ్ణమ్ వేణ్డుమ్ 9*

మెల్లిగా చెప్పి చూచినా కోకిల వినకపోవడంచేత, ఇందులో, దానిని, తన ఆర్తి కారణంగా గోదాదేవి భయపెడుతున్నది.

మిక్కిలి ధ్వనిని చేసే తుమ్మెదలు మకరందాన్ని తాగిన కారణంచేత కలిగిన మత్తు వల్ల రాగాలను పాడుతూ ఉండే తోటలలో ఆనందంగా విహరించే కోకిలా! నేను చెప్పి ఈ మాటను నీవు పరాకు లేకుండా సావధానంగా విను. నేను పచ్చని చిలుకవంటి వర్ణాన్ని కలవాడైన మాధవుడనే ఒక వలలో చిక్కుకొని ఉన్నాను. ఈ తోటలో నీవు నివసించాలని అనుకుంటే, శంఖచక్రాలను కలవాడైన భగవంతుడు ఇక్కడకు వచ్చేటట్లు కూయడం, నేను కోల్పోయిన బంగారు గాజులను తీసుకొని వచ్చి ఇవ్వడం –అనే ఈ రెండిటిలో ఏదో ఒక పనిని నీవు తప్పకుండా చేసి తీరాలి.

*అన్దులగమ్ అళందానై ఉగందు *అడిమైక్కణ్ అవన్ వలి శెయ్య *తెన్దలుమ్ తింగళుమ్
ఊడఱుత్తు * ఎన్నై నలియుం ముళైమై అఱియేన్ **
ఎన్దుమ్ ఇక్కావిల్ ఇరుందిరుందు * ఎన్నై త్తదర్త్తాదే నీయుమ్ కుయిలే! *
ఇన్దు నారాయణనై వర క్కూవాయేల్ *ఇంగుట్టు నిన్దుమ్ తురప్పన్ 10*

సామ దాన భేదాలనే మూడు ఉపాయాలు కోకిల విషయంలో ఫలించకపోగానే, "ఈ తోటనుండి నిన్ను తరిమి వేస్తాను" అని దండోపాయాన్ని ఉపయోగించడానికి ఇందులో ప్రయత్నిస్తున్నది.

మహాబలి గర్వించిన ఆ సమయంలో ముల్లోకాలను తన పాదంతో కొలిచినవాడైన స్వామి విషయంలో నేను కైంకర్యంచేయాలని ఆశపడ్డాను. కాని, గ ఆ స్వామిని ఆ కైంకర్యంలో వంచన చేయగా, అందువల్ల నేను చాలా బాధపడ్డాను. ఆ సమయంలో మలయ మారుతం, పూర్ణ చంద్రుడు నా మనసు లోపల భేదించి, ప్రవేశించి హింసించే రీతి ఇటువంటిది అని నేను తెలియలేను. ఓ కోకిలా! నా క్షేమాన్ని కోరే నీవు కూడా ఎల్లప్పుడూ ఈ తోటలో నిరంతరంగా ఉంటూ, ఇంతకుముందే భగవంతుని విరహం వల్ల చాలా కృశించిన నన్ను హింసించకుండా ఉండు. ఇప్పుడు శ్రీమన్నారాయణుడు ఇక్కడికి వచ్చేటట్లు నీవు కూయకపోయినట్లయితే, ఈ తోట నుండి నిన్ను తరిమి కొడతానుసుమా!

*విణ్ణుఱ నీణ్డుడి తావియ మైందనై * వేఱ్కొణ్ మడందై విరుంబి *
కణ్ణుఱ ఎన్ కడల్ వణ్ణనై * క్కూవు కరుమ్ కుయిలే! ఎన్న మాట్రుమ్ **
పణ్ణుఱు నాన్మ ఱైయోర్ పుదువై మన్న న్ *పట్టర్ పిరాన్ కోదై శొన్న *
నణ్ణుఱు వాశగ మాలై వల్లార్ * నమో నారాయణాయ ఎంబారే 11*

ఈ దశకాన్ని తాత్పర్య సహితంగా అధ్యయనం చేయగలిగినవారు తమ స్వరూపానికి తగిన కైంకర్యం అనే ఫలాన్ని పొందుతారు –అని అంటున్నది.

వేలాయుధంవంటి నిశితమైన, అందమైన నేత్రాలను కలిగినదై, స్త్రీత్వానికి తగిన గుణాలు నిండుగా కలిగినదై, స్వర ప్రధానమైన నాలుగు వేదాలను అధ్యయనం చేసిన శ్రీవైష్ణవులు నివసించే శ్రీవిల్లి పుత్తూరుకు నాథులైన పెరియాళ్వారుల పుత్రిక అయిన గోదాదేవి, తన శ్రీపాదం పరమపదం వరకు వ పోయి వ్యాపించే విధంగా దీర్ఘంగా వృద్ధి చెంది వ్యాపించిన శక్తిని కలవాడైన భగవంతుని కోరి ఆశపడి, "ఓ నల్లని కోకిలా!

సముద్రంవంటి వర్ణాన్ని కలవాడైన నా ప్రియుని నేను సేవించే రీతిలో నీవు కూయాలి" అని నియమించే పాశురంగా భగవంతుని గూర్చి చక్కగా పలికిన ఈ శ్రీసూక్తిమాలను అధ్యయనం చేయగలిగినవారు భగవంతునకు అంతరంగ కైంకర్యాన్ని చేయగలరు.

ఆఱామ్ తిరుమొழి - వారణమాయిరమ్

గడచిన దశకంలో గోదాదేవి కోకిలను చూచి "నీవు భగవంతుడు నా దగ్గరకు వచ్చేటట్లు కూయాలి" అని ప్రార్థించిన తరువాత కూడా, అది ఆ విధంగా చేయలేదు. ఆ విధంగా చేసి ఉంటే అతడు వెంటనే వచ్చి ఉండేవాడు కదా. అతడు వేగంగా రావడం కనిపించనందున, కోకిల అతడు వచ్చేటట్లు కూయ లేదు అని గోదాదేవి తెలుసుకున్నది. "అతడు వచ్చినప్పుడు రాని" అని సహించి ఉండే స్వభావాన్ని కలిగినది కాదు కదా, ఈమె. స్వామి వేగంగా రాకపోయినట్లయితే ప్రాణం ధరించలేని స్థితిని పొందినది కనుక, అతనిని వెంటనే పొందలేనందు వల్ల చాలా బాధను పొందింది. అతడు కూడా ఈమె స్థితికి తగినట్లుగా వేగంగా వచ్చి తన దర్శనాన్ని అనుగ్రహించలేదు. అయితే, ఈమె పడే బాధను అతడు తెలియనివాడు అని చెప్పలేము, " ఈమె ఆర్తి ఇంకా వృద్ధి చెందిన తరువాత వచ్చి దర్శనాన్ని అనుగ్రహిద్దాం" అని అతడు భావించాడు. నమ్మాళ్వార్లను కూడా అతడు ఈ విధంగానే కదా అనుగ్రహించాడు. "మయర్వఱ మదినలమ్ అరుళినన్" (ఏ దోషం లేని భక్తి రూపంగా పరిణమించిన జ్ఞానాన్ని అనుగ్రహించాడు (1—1—1) అని తిరువాయిములి ప్రబంధంలో ఆరంభంలోనే అజ్ఞానం కొంచెం కూడా లేని జ్ఞాన భక్తులను అనుగ్రహించినప్పటికీ "మునియే!నాన్ముగనే!"(10—10—1)

అని చివరి దశకంలో "అవా వఱ్ఱు వీడు పెఱ్ఱ కురుకూర్ శడకోపన్"(10—10—10) (కోరిక తీరి పరమపదాన్ని పొందిన నమ్మాళ్వార్లు) అనే చోట పొందిన ప్రాప్యాన్ని ప్రారంభంలోనే పొందలేదుకదా. ఆరంభంలో భగవంతుని పొందాలి అనే ఆర్తి ఉన్నప్పటికీ ఆర్తి క్రమక్రమంగా వృద్ధి చేసికొని, పర భక్తి —పరజ్ఞానం— పరమభక్తి అనే దశలను పొందిన తరువాతకదా పరమపురుషార్థాన్ని భగవంతుడు అనుగ్రహించాడు. తెల్లని వస్త్రానికి కొంచెం కొంచెం ఛాయను కలిగించినట్లుగా, ఈ లోకంలో పరమభక్తివరకు దశలు ఏర్పడిన తరువాత కదా పరమపదానికి చేరి అనుభవించే అనుభవం జీవునకు వంట పట్టేదిగా ఉంటుంది. సాక్షాత్తు భూదేవి యొక్క అవతారమైన ఈ గోదా దేవికి జన్మనుండే పరమ భక్తి

ఉన్నది కదా!అందువల్ల నమ్మాళ్వార్లకు వలే ఈమె విషయంలో కాలం తామసించనక్కరలేదే! అని అంటే, మొదటిలోనే పరమ భక్తి ఉన్నప్పటికీ, కాలం గడవగా గడువగా, ఆర్తి వృద్ధి చెందుతుంది కదా లక్ష్మీదేవి యొక్క అవతారమైన సీతా దేవికి కూడా శ్రీరామచంద్రుని విశ్లేషించినప్పుడే అతనిలో సంశ్లేషించాలి అనే ఆశ ఉన్నప్పటికీ, "ఊర్ధ్వం మాసాత్ న జీవిష్యే" (ఒక మాసానికి మించి రాముని విడచి నేను జీవించలేను) కానీ ఒక అవధిని పెట్టినది కదా. "న జీవేయం క్షణమపి" (ఒక్క క్షణం కూడా నేను సీతను విడిచి ఉండలేను) కానీ రామచంద్రుడు పలికినట్లు పలుకలేదే అందుచేత ఆశ ఉన్నప్పటికీ, కాలక్రమంలో పరమ భక్తిదశ వరకు భక్తి వృద్ధి చెందిన తరువాత ప్రాప్యాన్ని ఇవ్వాలి– అనే నియమం భూదేవి అవతార మైన ఈమె విషయంలో కూడా పొసగుతుంది. అందుచేత అతడు రాకుండా ఆలస్యం చేశాడు. ఆఈమె ఆలస్యాన్ని సహించలేక చాలా క్లేశాన్ని పొందినది. దానిని చూచిన భగవంతుడు " నేను నేరుగా వెళ్లి దర్శనాన్ని అనుగ్రహిస్తే ఆ ఆనందాన్ని ఈమె తట్టుకోలేదు. ఇందుచేత, కలలో కనిపించి ఈమెను వివాహాన్ని చేసుకుంటున్నట్లుగా ఒక అనుభవాన్ని కలిగించి, ఈమెకు సమాశ్వాసాన్ని కలిగిస్తాను. కాలక్రమంలో ప్రాప్యాన్ని ఇస్తాను" అని భావించి, ఆ విధంగానే స్వప్నంలో గోదాదేవికి భగవంతుడు ఆమెను వివాహం చేసికొన్న అనుభవాన్ని కలిగించాడు. ఆ అనుభవాన్ని ఆమె ఈ దశకంలో తెలుపుతున్నది. ఈ విషయంలో సీతాదేవి కంటే గోదాదేవికి వై లక్ష్యణ్యం ఉన్నది. "కలలో అయినా శ్రీరామచంద్రుని దర్శించి ప్రాణాలను ధరించవచ్చు "అని ఆశపడిన సీతాదేవికి భగవంతుడు ఆ స్వప్నానుభవాన్ని అనుగ్రహించలేదు. " స్వప్నేపి యద్యహం వీరం రాఘవం సహ లక్ష్మణమ్, పశ్యేయం యది జీవేయం స్వప్నోపి మామ మత్సరీ" (రామాయణం– సుందరకాండ –34 –21) (కలలో అయినా నేను లక్ష్మణునితో కూడిన వీరుడైన రామచంద్రుని చూడగలిగితే, ప్రాణాలను ధరిస్తాను. అయితే, స్వప్నం కూడా నాకు కలుగడం లేదు, విరోధి అయినది) అని ఆమె పలికింది కదా. "కలలో చూసినా తన దుఃఖాలను పోగొట్టగలిగిన వీరుడు శ్రీరాముడు" అనే అర్థాన్ని వీరశబ్దంతో ఆమె తెలియజేసింది. విశ్లేషించేటప్పుడు లక్ష్మణుడు, శ్రీరాముడు– అనే ఇద్దరినీ

విశ్లేషించినందున, కలలో చూచేటప్పుడు కూడా ఇద్దరినీ కలిపి దర్శించాలని ఆమె ఆశపడింది. విశ్లేషించేటప్పుడు మాయలేడి అయిన మారీచుడు శ్రీరాముని, లక్ష్మణుని విశ్లేషింపజేసినందున, వారు ఇద్దరూ మళ్లీ ఒకటిగా కలసి ఉన్నారా? లేదా? అనే సందేహం తీరేటట్లుగా కలలో ఇద్దరిని కలిపి దర్శించాలని ఆశపడుతున్నది. నేను పడే పాట్లను తెలుసుకొని, ప్రాణాలను ధరించేటట్లు శీఘ్రంగా తన దర్శనాన్ని ఇవ్వకుండా, అతడు బాధ పెట్టడం చాలదు అన్నట్లు ఈ కల కూడా నా విషయంలో విరోధం కలిగి, నా దగ్గరకు రాకుండా బాధ పెడుతున్నది అనే భావాన్ని ముందు ప్రస్తావించిన శ్రీరామాయణ వాక్యంలో సీతాదేవి తెలిపినందున ఆమెకు భగవంతుడు స్వప్నానుభవాన్ని కలిగించలేదు –అని తెలుస్తున్నది. ఆ విధంగా అయితే, సీతాదేవి ఏ విధంగా ప్రాణాలను ధరించి ఉన్నది? అని అంటే, తాను కలను కనకపోయినా మిగిలిన వారు చెప్పగా విని ప్రాణాలను ధరించింది ఆ విధంగా ఒకరు చెప్పగా విని ధరించగలిగిన స్వభావం కలిగినది కానందున, ఈ గోదాదేవి తన ప్రాణాలను ధరించి నిలువలేదు– అని భావించి, ఆమెకు స్వప్నానుభవం కలిగించాలి –అని, తలచి, ఒక విలక్షణమైన స్వప్నానుభవాన్ని కలిగించి, తన ఆమె ప్రాణాలను ధరించేటట్లు భగవంతుడు చేసిన రీతి ఈ దశకంలో చెప్పబడుతున్నది.

ఉపనిషత్తులలో, బ్రహ్మసూత్రాలలో సంధ్యాధికరణంలో సంసారి జీవులు నిద్రించేటప్పుడు " ఏష సుప్తేషు జాగర్తి కామం కామం పురుషో నిర్మిమాణః" (కఠవల్లి–2–5– 8) (ఈ జీవులు నిద్రించేటప్పుడు, పరమ పురుషుడు, విరిని స్వప్నంలో అనుభవింపజేయడం కోసం పదార్థాలను తన సంకల్పానుసారంగా సృష్టిస్తూ మేల్కొని ఉంటాడు) అనే విధంగా భగవంతుడు తాను మేల్కొని ఉండి వారి కర్మలకు అనుగుణంగా స్వప్నంలో పదార్థాలను సృష్టించి అనుభవింప చేస్తాడు –అని చెప్పబడింది. గోదాదేవికి భగవంతుడు ఇక్కడ కలిగించిన అనుభవం మిగిలిన జీవులకు కలిగే అనుభవం వలె కర్మానుగుణమైన అనుభవం కాదు. భగవంతుని పరిపూర్ణంగా అనుభవించాలి అనే ఆశపడిన ఈమెకు భగవంతుడు నిర్హేతుకంగా కలిగించే అనుభవం కనుక, ఈమె అనుభవించాలి అని ఆశపడిన స్వభావాలలో ఏదీ కొరత లేకుండా ఉండేటట్లు,

ఆణిగ్రహణం చేయడం సన్నికల్లును తొక్కడం మొదలైన అన్ని వివాహ వైభవాలను ఈమె నేరుగా అనుభవించినట్లే, పరిపూర్ణంగా అనుభవింపజేయగా అనుభవించి, దానిని గోదాదేవి తన చెలికత్తె ఈ దశకంలో తెలియజేస్తున్నది. "స్వప్నెఽపి కేశవాదన్యం న పశ్యతి మహామతిః, నిద్రాపి తస్య నాయాతి పురుషార్థవిరోధివి" (మహా బుద్ధిశాలి అయిన అతడు స్వప్నంలో కూడా కేశవుడైన భగవంతుని కంటే వేరొకరిని చూడలేదు. భగవంతుని అనుభవం అనే పరమ పురుషార్థానికి ఆటంకం కనుక, నిద్ర కూడా, అంటే, స్వప్నానుభవం కూడా అతనికి కలుగలేదు) అనే ప్రమాణంలో భక్తి కలిగినవారి విషయంలో భగవంతుడు వారి కర్మకు అనుగుణంగా కాకుండా, భక్తుల రుచికి తగినట్లుగా స్వప్నానుభవాన్ని కలిగిస్తాడు– అని పలకడం ఇక్కడ అనుసంధించదగినది.

*** వారణమాయిరమ్ * శూழ్ వలమ్ శెయ్ దు **
*నారణ నంబి * నడక్కిన్రాన్ ఎన్రెదిర్ ***
*పూరణ పొఱ్కుడమ్ * వైత్తు ప్పురమెంగుమ్ **
*తోరణమ్ నాట్ట * క్కనా క్కణ్డేన్ తోழీ! నాన్ 1*

శ్రీకృష్ణుడు వచ్చిన తరువాత అనుభవించడం అనేది చాలదు కనుక, గోదాదేవి "వివాహం చేసుకోవడం కోసం శ్రీకృష్ణుడు వస్తున్నాడు" అని ఊరిలో మాట వినబడే క్షణంనుండి అనుభవించాలని ఆశపడుతున్నది కనుక, కలలో కూడా, అతడు నడచి వచ్చే చోటుకు చేసే అలంకారాలను అన్నిటిని దర్శిస్తున్నది.

చెలీ! సకల గుణ పరిపూర్ణుడైన శ్రీమన్నారాయణుడు, ఏనుగులు తన చుట్టూ రాగా ప్రదక్షిణంగా వస్తున్నాడు అని వాయిద్యాల ఘోషలు మొదలైనవాటితో నిశ్చయించి తెలుసుకొని అతనికి స్వాగతం పలకడం కోసం ఎదురుగా బంగారు పూర్ణకుంభాలను పట్టుకొని వెళ్లడం, నగరం అంతా తోరణ స్తంభాలు నాటడం అనే ఈ సన్నివేశాన్ని నేను స్వప్నంలో అనుభవించాను.

*నాళై వదువై * మణమెన్దు నాళిట్టు *
పాళై కముగు * పరిశుడై ప్పందల్కీళ్ **
కోళరి మాదవన్ * గోవిందన్ ఎన్బాన్ ఓర్ *
కాళై పుగుద * క్కనా క్కణ్డేన్ తోళీ! నాన్ 2*

"పెళ్లి పందిరి కింద శ్రీకృష్ణుడు ప్రవేశించిన రీతిని కలగన్నాను "అని ఇందులో పలుకుతున్నది.

సఖీ! "రేపు వివాహ మహోత్సవం జరగబోతున్నది" అని ముహూర్తం నిర్ణయించి, పూర్ణకుంభాలతో, పోక చెట్లతో అలంకరింపబడిన పెళ్లి మండపం కింద నరసింహుడని, మాధవుడని, గోవిందుడని తిరునామాలు కలిగిన ఒక యువకుడు ప్రవేశించినట్లు నేను కలగన్నాను.

*ఇందిరన్ ఉళ్ళిట్టు * దేవర్ కుళామెల్లామ్ *
వందిరుందెన్నై * మగళ్ పేశి మందిరిత్తు **
మందిర క్కోడి ఉడుత్తి * మణ మాలై *
అందరి శూట్టు * క్కనా క్కణ్డేన్ తోళీ! నాన్ 3*

వివాహ మహోత్సవ చీరను ధరించి, కళ్యాణమాలికను అలంకరించుకొన్న వైభవాన్ని నేను కలలో అనుభవించాను –అని ఇందులో పలుకుతున్నది.

సఖీ! ఇంద్రుడు మొదలైన దేవతల సమూహం అంతా ఈ భూమికి వచ్చి, నన్ను కళ్యాణ వధువుగా నిశ్చయించారు. ఆ తరువాత సంబంధులు ఒకరికొకరు చేసుకోవలసిన ఏర్పాట్ల విషయంగా ఆలోచించి నిశ్చయించుకున్నారు. తరువాత దుర్గ అనే ఆడబడుచు కళ్యాణ చీరను నాకు కట్టి, పరిమళం నిండుగా కలిగిన కళ్యాణ పుష్పమాలికలను అలంకరించినట్లుం నేను కలగన్నాను.

*నాల్ తిశై త్తీర్త్తమ్ కొణర్ న్దు * నని నల్గి *
పార్ప్పన చ్చిట్టర్గళ్ * పల్లూర్ ఎడుత్తేత్తి **
పూప్పునై కణ్ణి * ప్పునిదనోడు ఎందన్నై *
కాప్పు నాణ్ కట్టు * క్కనా క్కణ్డేన్ తోళీ! నాన్ 4*

పెళ్లి ఆరంభంలో కంకణ ధారణ వైభవాన్ని కలలో అనుభవించగలిగాను– అని అంటున్నది.

చెలీ! శిష్టులైన పలువురు బ్రాహ్మణోత్తములు నాలుగు దిక్కులలో వేంచేసి ఉండి, పుణ్యతీర్థాన్ని తీసుకొని వచ్చి చక్కగా తేర్చి, ఉచ్చైఃస్వరంతో మంగళాశాసనం చేశారు. అనేక విధాలయిన పూలతో కూర్చిన పుష్పమాలికను కల పరమపావనుడైన శ్రీకృష్ణునితో నన్ను చేర్చి, కంకణం కట్టినట్లు నేను కలగన్నాను.

*కదిరొళి దీపమ్ * కలశమ్ ఉడన్ ఏంది *
శదిర్ ఇళమంగైయర్ తామ్ * వందెదిర్ కొళ్ళ **
మదురైయూర్ మన్న న్ * అడి నిలై తొట్టెంగుమ్ *
అదిర పుగుద * క్క నా క్కణ్ణేన్ తోళీ! నాన్ 5*

పెళ్లి మండపం లోపల దీపాలతో, పూర్ణకుంభాలతో ఎదురు రాగా, భగవంతుడు వేంచేయడాన్ని నేను కలలో దర్శించాను– అని అంటున్నది.

చెలీ! అందమైన, లేత వయస్సులోని కన్యలు సూర్యుని కాంతి వంటి కాంతిని కల మంగళ దీపాన్ని, బంగారు కలశాలను చేతిలో ధరించి ఎదురు రాగా, మధురలో ఉండేవారికి ప్రభువైన శ్రీకృష్ణుడు పాదుకలను ధరించినవాడై, భూమి అంతా అదిరేట్లుగా వేంచేసినట్లుగా నేను కలగన్నాను.

*మత్తళం కొట్ట * వరి శంగమ్ నిన్ఱూద *
ముత్తుడై త్తామ్ * నిలై తాళ్ందన పందఱ్కీళ్ **
మైత్తునన్ నంబి * మదుసూదన్ వందెన్నై *
కైత్తలమ్ పట్ట * క్క నా క్కణ్ణేన్ తోళీ! నాన్ 6*

మధుసూదనుడు నన్ను పాణిగ్రహణం చేసిన రీతిని నేను కలలో కన్నాను– అని అంటున్నది.

చెలీ! మద్దెలలను వాయించగా, సుడులను కల శంఖాలు చాలాసేపు మోగగా, నాతో మేనరికపు చుట్టారికాన్ని కలిగినవాడై, పరిపూర్ణుడైన శ్రీకృష్ణుడు ముత్యాలతో పొదిగిన మాలికల సమూహాలు వేలాడదీయబడిన పెండ్లి పందిరి కిందకు వచ్చి, నన్ను పాణిగ్రహణం చేసుకోవడాన్ని నేను కలలో చూశాను.

*వాయ్ నల్లార్ * నల్ల మఱై ఓది మందిరత్తాల్ **
పాశిలై నాణల్ పడుత్తు * ప్పరిది వైత్తు **
కాయ్ శిన మా కళిఱన్నా న్ * ఎన్ కై ప్పట్టి *
తీ వలమ్ శెయ్య * క్కనా క్కణ్డేన్ తోళీ! నాన్ 7*

అగ్ని ప్రదక్షణాన్ని చేయడం కూడా నేను కలలో అనుభవించాను– అని అంటున్నది.

చక్కగా వేదాలను అభ్యసించిన వైదికులు గొప్ప వేదమంత్రాలను ఉచ్చరించి, ఆయా కార్యాలకు తగిన మంత్రాలతో దర్భలతో చేసిన పరిస్తరణలను అగ్ని చుట్టూ అమర్చి, పరిధులుగా సమిధలను పెట్టగా, మిక్కిలి కోపాన్ని కలిగిన మదగజం వలె రీవిని కలవాడైన శ్రీకృష్ణుడు నా చేతిని పట్టుకొని అగ్నికి ప్రదక్షిణం చేయగా నేను కలలో చూశాను.

*ఇమ్మైక్కుమ్ * ఏడ్ఏళ్ పిఱవిక్కుమ్ పట్ట్రావాన్ *
నమ్మై ఉడైయవన్ * నారాయణన్ నంబి **
శెమ్మై ఉడైయ * తిరుక్కైయాల్ తాళ్ పట్టి *
అమ్మి మిదిక్క * క్కనా క్కణ్డేన్ తోళీ! నాన్ 8*

అగ్నిని ప్రదక్షిణంచేసిన తరువాత సన్నికల్లును తొక్కడం అనే అశ్మారోహణక్రియను కూడా నేను కలలో చూచి ఆనందించాను– అని అంటున్నది.

సఖీ! ఈ జన్మకు, రాబోయే ఏడేడు జన్మలకు శరణ్యుడై ఉండేవాడై, మనకు శేషియై, సకల కళ్యాణ గుణాలతో పరిపూర్ణుడై, నారాయణుడైన కృష్ణుడు నా కాలిని పట్టుకొని సన్నికల్లుపచ పెట్టినట్లు నేను కలగన్నాను.

*వరిశిలై వాళ్ ముగత్తు * ఎన్నై మార్ తామ్ వందిట్టు *
ఎరి ముగమ్ పారిత్తు * ఎన్నై మున్నే నిఱుత్తి **
అరి ముగన్ అచ్చుతన్ * కైమ్మేల్ ఎన్ కై వైత్తు *
పొరి ముగందట్ట * క్కనా క్కణ్ణేన్ తోళీ! నాన్ 9*

వివాహ ప్రక్రియలో లాజహోమం అని చెప్పబడిన వైదిక కార్యాన్ని చేయడం కూడా నేను కలలో చూశాను– అని అంటున్నది.

చెలీ! అందమైన విల్లువంటి కనుబొమ్మలను, కాంతి నిండిన ముఖాన్ని కలవాడైన నా అన్న వచ్చి, అగ్నిని చక్కగా జ్వలింపచేసి, ఆ అగ్ని ముందు నన్ను నిలిపి, అందులో, సింహం వంటి ముఖాన్ని కలిగినవాడై ఉండే శ్రీకృష్ణుని చేతిపై నా చేతిని పెట్టి, లాజలను ఉంచి సమర్పించినట్లు నేను కలగన్నాను. ఱూ

*కుంగుమమప్పి * క్కుళిర్ శాందమ్ మట్టిత్తు *
మంగల విది * వలమ్ శెయ్ దు మణ నీర్ **
అంగు అవనోడుమ్ * ఉడన్ శెన్ఱంగు ఆనై మేల్ *
మంజ్చనమాట్ట * క్కనా క్కణ్ణేన్ తోళీ! నాన్ 10*

ఏనుగుపై స్వామితో ఎక్కి, ఊరిలో ఊరేగినట్లు, ఆ తరువాత మంగళ స్నానం చేసినట్లు నేను కలగన్నాను– అని అంటున్నది.

ఓ సఖీ!కుంకుమ పంకాన్ని ఒంటికి అంతా పూసి, చల్లని చందనాన్ని దట్టంగా అలది, అక్కడ ఉండే మదగజం పైన ఆ శ్రీకృష్ణునితో పాటు కలిసి నన్ను కూర్చోపెట్టినట్లు, ఆ తరువాత ఆ స్వామితో నేను వివాహం కోసం చేసిన అలంకారాలతో వెలిగే వీధులలో అంతట ఊరేగినట్లు, తరువాత పరిమళం కలిగిన నీటిలో మాకిద్దరికీ స్నానం చేయించినట్లు నేను కలగన్నాను.

*** ఆయనుక్కాగ * తతాన్ కణ్ణ కనావినై *
వేయర్ పుగళ్ * విల్లిపుత్తూర్ క్కోన్ కోదై శొల్ **
తూయ తమిళ్ మాలై * ఈరైందుమ్ వల్లవర్ *
వాయు నన్మక్కళై పెట్టు * మగిళ్వరే 11*

చివరి పాశురమైన ఇందులో ఈ దశకాన్ని అనుసంధించినందువల్ల కలిగే ఫలాన్ని పలుకుతూ ముగిస్తున్నది.

వేయర్ కులంవల్ల కీర్తిని పొందినవారై, శ్రీవిల్లి పుత్తూరు అనే నగరానికి నాథులైన పెరియాళ్వార్ల పుత్రిక గోదాదేవి తనకు శ్రీకృష్ణునితో వివాహం జరిగిన రీతిని గూర్చి స్వప్నంలో దర్శించి, ఆ క్రమాన్ని తెలియజేస్తూ పలికిన, పరిశుద్ధమైన, ద్రావిడ భాషలోని ఈ పది పాశురాలను అధ్యయనం చేయగలిగినవారు మంచి గుణాలను కల, విష్ణులైన పుత్రులను పొంది, ఆనందిస్తారు.

ఏళామ్ తిరుమొళి - కరుప్పూరమ్ నాఱుమో

సీతాదేవి కంటే గోదాదేవికి కల భాగ్యం విలక్షణమైనది. సీతాదేవి ఇంతకు ముందు తనకు పరిచయం లేని వానర జాతికి చెందిన హనుమంతుని చూచి, " కీదృశం తస్య సంస్థానం రూపం రామస్య కీదృశమ్, కథ మూరూ కథం బాహూ లక్ష్మణస్య చ శంస మే" (రామాయణం—సుందరకాండ— 35 —4) (ఆ శ్రీరాముని శరీర సన్నివేశం ఎటువంటిది? రూపం ఎటువంటిది? అతని ఊరువులు ఎటువంటివి? బాహువులు ఎటువంటివి? లక్ష్మణునకు కల ఈ లక్షణాలను కూడా నాకు తెలియజేయి) అని అడిగింది. గోదా దేవి అయితే, ఈ దశకంలో భగవంతుని పొందడానికి పురుషకారమై, అతనిని అనుభవించడానికి దారి చూపే దేశికుడై ఉండే పాంచజన్యాళ్వాన్ ను చూచి, "కరుప్పూరమ్ నారుమో? కమల పూ నారుమో? (స్వామి అధరం కర్పూరం వలె పరిమళిస్తుందా? లేక, తామర పువ్వువలె పరిమళిస్తుందా?) అని అడిగే గొప్పతనాన్ని పొందినది కదా! గడచిన దశకంలో భగవంతుడు తనను వివాహం చేసుకున్నట్లుగా కల కనడంలో నిలువకుండా, గోదాదేవి భగవంతునిలో కలిసింది కూడా అనే విషయం ఈ దశకం వల్ల స్పష్టమవుతున్నది. లేకపోతే, "మరుప్పొశిత్త మాధవన్ తన్ వాయ్ చ్చువైయుమ్ నాత్తముమ్ విరుప్పుట్రు క్కేట్కిన్ఱేన్" (కువలయాపీడం అనే ఏనుగు దంతాన్ని విరిచిన మాధవుని ఆధరం రుచిని, పరిమళాన్ని తెలుసుకోవాలని అడుగుతున్నాను) అని ఇక్కడ గోదాదేవి పలకడం పొసగదు కదా. గడచిన దశకంలో లభించిన అనుభవం కలలోని అనుభవం కనుక, మిణుగురు పురుగు కాంతివలె చాలా అల్పంగా ఉన్నది తప్ప, ఆమె మనసులో స్థిరంగా నిలువలేదు. అయినా, భగవంతుని విషయాన్ని గూర్చిన స్వప్నం కనుక మనసులో పడకుండాను ఉండదు. తరువాత సంభవించిన సమాగమంలో కూడా, ఈమె ఆర్తిని అధికం చేసేటట్లుగా భగవంతుడు ప్రారంభంలోనే దానిని కోల్పోయేటట్లు చేశాడు. అందుచేత తాను పొందవలసిన అనుభవాన్ని గోదాదేవి శ్రీపాంచజన్యాన్ని ఉద్దేశించి ఇక్కడ ప్రశ్నించడంలో ఏ లోటు

లేదు. గరుడుడు, విష్వక్సేనుడు మొదలైన మిగిలినవారు కూడా ఉండేటప్పుడు, శ్రీ పాంచ జన్యాళ్వాన్ ను మాత్రమే అడగడం ఎందుకు?అని అంటే,

1) చక్రవర్తి నాయకిలో ఏకాంతంగా తెర లోపల ఉండేటప్పుడు, వయస్సు ముదిరిన గూనివాళ్ళు, మరుగుజ్జులువంటి కొందరికి అక్కడ ఉండే అనుమతి ఉంటుంది, వారివలె పాంచజన్యం కూడా భగవంతుని చేతిని ఏనాడు విడవకుండా అంతరంగుడై ఉంటాడు.

2) భగవంతుని అధరామృతాన్ని పానం చేసే నాయకి అయిన తనవలె స్వామి నోటిలోనే ఉండి, అతని అధరం రుచిని ఆస్వాదించడంలో పాంచజన్యం సమర్ధుడై ఉంటాడు.

3) అప్పుడప్పుడు మాత్రమే భగవంతునిలో సంశ్లేషాన్ని పొందే తనవలె కాకుండా, ఎల్లప్పుడూ భగవంతుని సంశ్లేషాన్ని కలవాడు, ఇతడు.

4) శ్రీసుదర్శనం ఇతని వలె భగవంతుని చేతిని ఏనాడూ విడవని అంతరంగ సేవకుడు అయినా, ఒక కార్యం ఏర్పడితే, "కరుదు మిడమ్ పొరుదు కైన్నిన్ఱ శక్కరత్తన్" (తిరువాయ్ మొழி –10– 6– 8) (తాను తలచిన చోటుకు వెళ్లి, శత్రువులలో పోరాడేవాడు, తన చేతిలో ఎల్లప్పుడూ నిలచి ఉండే సుదర్శనం అనే చక్రాన్ని కలవాడు) అనే విధంగా ఆ కార్యాన్ని పూర్తి చేయడం కోసం భగవంతుని చేతిని విడచి వెళ్లి, ఆ కార్యాన్ని నిర్వహిస్తాడు. పాంచజన్యం మాత్రం, ఎల్లప్పుడూ భగవంతుని చేతిలోనే ఉండే ప్రేమను కలిగినవాడై, ఏదైనా కార్యం ఏర్పడితే, చేతిలోనే ఉండి, నోటితో అధరాన్ని స్పృశించి, ఆ ఆధరాన్ని పానం చేయడం ఆరంభిస్తాడు. " ఉపసంహర సర్వాత్మన్! రూపమేతత్ చతుర్భుజమ్, జనాతు మావతారం తే కంసోయం దితిజన్మనః" (శ్రీవిష్ణు పురాణం–5–3–11) (ఓ సర్వాంతర్యామీ! నాలుగు చేతులను కల ఈ రూపాన్ని నువ్వు ఉపసంహరించుకో. అసురుడైన ఈ కంసుడు నీ అవతారాన్ని గూర్చి తెలియవద్దు) అని పాంచజన్యం భగవంతుని చేతిని విడచి అంతర్ధానం కావడం శత్రువైన కంసుడు మొదలైనవారి వల్లనే జరిగింది. తన విషయంలో ప్రేమను కల కన్యలకు

శంఖచక్రాలతో కూడినవాడై భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. ఆధరంలో చేరి నిలచి, పెద్ద ధ్వనిని చేసి, ఆ ధ్వనితోనే శత్రువులు అదిరిపడేటట్లు చేసేవాడై, " ఉపసంహర" అని ఇంతకు ముందు ప్రస్తావించిన ప్రమాణం ప్రకారం, భక్తిని కలవారు "శత్రువులైన కంసుడు మొదలైనవారు చూడకుండా ఉండేటట్లు ని చతుర్భుజత్వాన్ని ఉపసంహరించుకోవాలి" అనిషతనను ప్రార్థిస్తే, అప్పుడు అంతర్ధానమై, చేతిలో శంఖం ధరించిన భగవంతుని సన్నివేశాన్ని దర్శించాలని ఆశపడే కన్యలకు అతని చేతిలో నిలచి, తన దర్శనాన్ని పాంచజన్యం అనుగ్రహిస్తాడు

6) భక్తులు భగవంతుని నల్లని తిరుమేని దర్శించేటప్పుడు, దానికి శోభను కలిగించే తెల్లని వర్ణాన్ని పాంచజన్యం కలిగినవాడు అయినందున, భగవంతునితో చేర్చి ఇతనిని అనుసంధించడం తగినది. ఇతడు మిక్కిలి తెల్లదనాన్ని కల శుద్ధస్వభావం కలిగిన వాడు కదా! "తామగక్కుమ్ తమ్ కైయిల్ శంగమే పోలావో" (నాచ్చియార్ తిరుమొழி −11−1) (తాను అభిమానించి, చేతిలో ధరించే పాంచజన్య శంఖంతో సాటి వస్తుందా?అని, " వెళ్ళై విళి శంగు ఇడక్కైయిల్ కొండ విమలన్" (నాచ్చియార్ తిరుమొழி−5−2) (తెల్లని, ధ్వనించే పాంచ జన్య శంఖాన్ని ఎడమ చేతిలో ధరించిన పరిశుద్ధ స్వభావుడు) అని, " పాలన్న వణ్ణత్తు పాంజశన్నియమే పోల్వన శంగంగళ్" (పాలవంటి వర్ణాన్ని కలిగిన, పాంచజన్యం వంటి శంఖాలు) (తిరుప్పావై− 26) అని గోదాదేవి ఎల్లప్పుడు భావించేది కూడా ఈ పాంచజన్య శంఖాన్నే కదా.

7) ఈ పాంచజన్యం యొక్క ధ్వనిని వింటే భగవంతుని మాట విన్నట్లు ఉన్నందున, మధురంగా ఉంటుంది.

ఈ విధంగా ఉండే కారణాలవల్ల వేరొక నిత్యసూరిని ప్రశ్నించకుండా, గోదాదేవి ఈ పాంచజన్యాన్నే అడుగుతున్నది.

*** కరుప్పూరమ్ నాఱుమో? * కమలప్పూ నాఱుమో? *
తిరుప్పవళ చ్చెవ్వాయ్ తాన్ * తిత్తిత్తిరుక్కుమో? **
మరుప్పొ శిత్త మాదవన్ తన్ * వాయ్ చ్చువైయుమ్ నాట్టుముమ్ *
విరుప్పుట్టు క్కేట్కిన్ఱేన్ * శొల్ ఆళి వెణ్ శంగే! 1

"భగవంతుని నోటిలో ఉండి, ఎల్లప్పుడూ దాని రుచిని అనుభవించేవాడవు నీవే అయినందున, అతని ఆధరం రుచిని, నోటి పరిమళాన్ని తెలిసినవాడవు నీవే. అవి ఏ విధంగా ఉంటాయి? అనే విషయాన్ని నీవు నాకు తెలియజేస్తావా? "అని అంటూ గోదాదేవి శ్రీపాంచజన్యాళ్వాన్ ను ఈ పాశురంలో అడుగుతున్నది.

గంభీరమైన, తెల్లని వర్ణాన్ని కలిగిన ఓ పాంచజన్యమా! కువలయాపీయడం అనే ఏనుగుయొక్క కొమ్మును విరిచిన శ్రీకృష్ణుని ఆధరంలోని రుచిని, పరిమళాన్ని గూర్చి తెలుసుకోవాలనే కుతూహలంతో నిన్ను అడుగుతున్నాను. ఆ స్వామి యొక్క, అందమైన పగడం వంటి ఎర్రని ఆధరం పచ్చ కర్పూరం వలె పరిమళిస్తుందా? లేక, తామర పువ్వు వలె పరిమళిస్తుందా? మధురమైన రసాన్ని కలిగి ఉంటుందా? ఏ విధంగా ఉంటుందో నాకు తెలియజేయి.

కడలిల్ పిఱందు * కరుదాదు * పంజశనన్
ఉడలిల్ వళర్ న్దుపోయ్ * ఊళియాన్ కైత్తల
త్తిడరిల్ ** కుడి ఏఱి* త్తియ అశురర్ *
నడలై ప్పుడ ముళ్గుమ్ * తోట్టుత్తాయ్ నఱ్చంగే! 2

భగవంతుని వద్ద భక్తి లేనివారిని నశింప చేసేటట్లే, నీవు అతని విషయంలో ప్రేమను కల నా వంటి వారిని ఉజ్జీవింపజేయాలి– అని అంటున్నది. లేక, నీ జన్మ, పెరుగుదల ఇతరుల కోసమే ఉన్నట్లే, నీవు చేసే కార్యాలు కూడా ఇతరుల కోసమే కావాలి –అని అంటున్నది అని కూడా చెప్పవచ్చు.

అందమైన పాంచ జన్య శంఖమా! నీవు సముద్రంలో పుట్టి, అక్కడనుండి పంచజనుడు అనే అసురుని శరీరంలో చేరి పెరిగి, ఈ విధంగా పుట్టిన చోటును, పెరిగిన చోటును ఏమాత్రం భావించకుండా, భగవంతుని శ్రీహస్తం అనే ఉన్నతమైన స్థానంలో నివాసం ఏర్పరచుకొని, క్రూరులైన అసురులు దుఃఖం పొందేటట్లు ధ్వని చేసే గొప్పతనాన్ని కలిగినవాడవై ఉన్నావు.

*తడ వరైయిన్ మీదే * శరత్కాల చందిరన్ *
ఇడైయువావిల్ వందు * ఎళ్ళున్దాలే పోల ** నియుమ్
వడమదురైయార్ మన్న న్ * వాశుదేవన్ కైయిల్ *
కుడి ఏఱి వీట్రిరుందాయ్ * కోల ప్పెరుమ్ శంగే! 3*

శరత్కాలంలో ఉదయగిరి పైన పున్నమి చంద్రుడు ఉదయించినట్లుగా ఉండే, వాసుదేవుని చేతిలో శంఖాన్ని కీర్తిస్తున్నది.

అందమైన, పెద్ద పాంచజన్య శంఖమా! శరత్కాలంలో పౌర్ణమినాడు చంద్రుడు పెద్దదైన ఉదయ పర్వతం పైకి వచ్చి ఉదయించినట్లుగా, ఉత్తర మధురానగరంలో ఉండేవారికి ప్రభువైన శ్రీకృష్ణుని శ్రీహస్తంలో నీవు వాసం ఏర్పరచుకుని, నీ గొప్పతనం అంతా స్ఫురించేటట్లు ఉన్నావు.

*చందిర మణ్డలమ్ పోల్ * దామోదరన్ కైయిల్ *
అందరమొన్ఱిన్ఱి * ఏఱి అవన్ శెవియిల్ **
మందిరమ్ కొళ్వాయే పోలుమ్ * వలంపురియే! *
ఇందిరనుమ్ ఉన్నో డు * శెల్వత్తుక్కే లానే 4*

భగవంతుని చెవిలో రహస్యార్థాలను చెప్పగలిగిన నీవు నా గూర్చి అతనికి తెలియజేయాలి –అని ఇందులో పలుకుతున్నది.

ఓ దక్షిణావర్త శంఖమా! దామోదరుని చేతిలో చంద్రమండలంవలె నిరంతరం వాసం చేస్తూ, అతని చెవిలో ఏదో రహస్యాన్ని పలుకుతున్నట్టుగా ఉన్నావు. గొప్పవాడుగా పేరుపడిన ఇంద్రుడు కూడా ఐశ్వర్యంలో నీకు సాటి రాడు.

*ఉన్నో డు ఉడనే * ఒరు కడలిల్ వాళ్వారై *
ఇన్నా ర్ ఇనైయార్ ఎన్ను * ఎణ్ణువార్ ఇల్లై కాణ్ **
మన్ ఆగి నిన్ఱ * మదుశూదన్ వాయ్ అముదమ్ *
పన్నా ళుమ్ ఉణ్ణిన్దాయ్ * పాంజశన్ని యమే! 5*

మధుసూదనుని అధరామృతాన్ని ఎల్లప్పుడూ పానం చేసే నీకు లోకంలోని మిగిలిన శంఖాలు ఏమీ సమానంగా కావు –అని పొగడుతున్నది.

ఓ పాంచ జన్య శంఖమా! నీతో పాటు ఓకే సముద్రంలోపుట్టి, నీతో పాటు నివసించే శంఖాలను ఒక వస్తువుగా లెక్క పెట్టేవారు ఎవరూ లేరు సుమా! నీవు ఒక్కడవు మాత్రమే సర్వస్వామివై ఉన్నావు. శ్రీకృష్ణుని అధరామృతాన్ని చిరకాలంగా ఆస్వాదిస్తున్నా వు. అందువల్ల నీవే భాగ్య శాలివి.

*పొయ్ త్తీర్త్త మాడాదే * నిన్ఱ పుణర్ మరుదమ్ *
శాయ్దూర్త్తాన్ కైత్తలత్తే * ఏఱి క్కుడి కొణ్డు **
శేయ్ త్తీర్త్తమాయ్ నిన్ఱ * శెంగణ్మా ల్ తన్ను డైయ *
వాయ్ త్తీర్త్తమ్ పాయుందాడ వల్లాయ్ * వలంపురియే! 6*

స్నానం చేయడం కోసం అంతటా పరిభ్రమించి తిరుగవలసిన ఆవశ్యకత లేకుండా, పరమ పావనమైన భగవంతుని ఆధర తీర్థంలో స్నానం చేసే భాగ్యాన్ని నీవు పొందావు– అని ఇందులో కీర్తిస్తున్నది.

ఓ దక్షిణావర్త శంఖమా! చాలా దూరం నడచి వెళ్లి, గంగ మొదలైన తీర్థాలలో స్థానం చేసే కష్టాలు పడనక్కర లేకుండా, నారదుని శాపంచేత రెండు మద్ది చెట్లు

రూపాన్ని పొందిన గంధర్వుల ఆ వృక్షాల రూపాలు విరిగిపడి పడేటట్లు గెంటిన శ్రీకృష్ణుని శ్రీ హస్తతలమనే ఉన్నత స్థానాన్ని అధిరోహించి, అక్కడే నిత్య వాసం చేస్తూ, లోకోత్తరమైన తీర్థం అయిన, పుండరీకాక్షుడైన శ్రీకృష్ణుని ఆధరంలోని తీర్థంలో అవగాహించి స్నానం చేసే భాగ్యాన్ని పొందావు

*శెంగమల నాణ్మ లర్ మేల్ * తేనుగరుమ్ అన్న మ్ పోల్ *
శెంగట్కు రుమేని * వాశుదేవనుడైయ **
అంగై త్తలమేఱి * అన్న వశమ్ శెయ్యుమ్ *
శంగరైయా! ఉన్ శెల్వమ్ * శాల అఴగియదే 7*

వాసుదేవుని శ్రీహస్తమనే తామరలో నీవు ఉండడం, తామర పువ్వులో మకరందాన్ని ఆస్వాదించే హంస ఉన్నట్లుగా అందంగా ఉన్నది సుమా!– అని ఇందులో కీర్తిస్తున్నది.

అప్పుడే వికసించిన ఎర్ర తామర పువ్వులో ప్రవేశించి, అందులోని తేనెను తాగే హంస పక్షి వలె, ఎర్రని తిరునేత్రాలను, నల్లని తిరుమేని కలిగిన శ్రీకృష్ణుని అందమైన శ్రీహస్తంపై అధిరోహించి, నిద్రించే, శంఖాలకు అన్నిటికీ ప్రభువైన, ఓ పాంచజన్య శంఖమా! నీ సంపద అనేది చాలా గొప్పది సుమా!

*ఉణ్బదు శొల్లిల్ * ఉలగళందాన్ వాయ్ అముదమ్ *
కణ్బడై కొళ్గిల్ * కడల్వణ్ణన్ కైత్తలత్తే **
పెణ్బడైయార్ ఉన్ మేల్ * పెరుమ్ పూశల్ శాట్టుగిన్ఱార్ *
పణ్బల శెయ్ కిన్ఱాయ్ * పాంజశన్ని యమే! 8*

ఈ పాశురంలోను, అనంతర పాశురంలోను " తగని కార్యం చేస్తున్నావు "అని దోషం పలుకుతున్నట్టుగా పలుకుతూ, అతని గొప్పతనాన్ని చాటింపు వేస్తున్నది.

ఓ పాంచ జన్య శంఖమా! నీవు భుజించేది ఏమి? అంటే, లోకాలను కొలిచినవాడైన భగవంతుని అధరంలో ఉండే అమృతాన్ని. నీవు పరుండి ఉండేది ఎక్కడ?అంటే,

సముద్రంవంటి వర్ణాన్ని కలిగిన ఆ భగవంతుని శ్రీహస్తంలో. ఈ విధంగా నీకు తిండి, నిద్ర కూడా అక్కడే అయినందున స్త్రీకులంలోనివారు అందరూ నీ విషయంగా చాలా తగవులాడుతున్నారు. "మా జీవనాన్ని ఇతడే కొల్లగొడుతున్నాడు" అని తగవులాడుతున్నారు. (ఈ విధంగా వీరు బాధపడేటట్లు అన్యాయమైన కార్యాన్ని చేస్తున్నావే! ఇది నీకు తగినది కాదు! అని భావం)

*పదినాఱా మాయిరవర్ * దేవిమార్ పార్త్తు ఇరుప్ప *
మదు వాయిల్ కొణ్డాఱ్పోల్ * మాదవన్ తన్ వాయ్ అముదమ్ **
పొదువాగ ఉణ్బదనై * ప్పుక్కు నీ ఉణ్ణక్కాల్ *
శిదైయారో ఉన్నోడు? * శెల్వ పెరుమ్ శంగే! 9*

దివ్యదేవేరులు అందరికి చెందిన భగవంతుని అధరామృతాన్ని నీవు ఒక్కడవే అనుభవించడం తగదు సుమా –అని అంటున్నది.

గొప్ప సంపదను కలిగిన ఓ పాంచజన్య శంఖమా! పదివేల మంది దేవేరులు "శ్రీకృష్ణుని అధరామృతాన్ని మేము ఆస్వాదించాలి" అని కోరి ఎదురుచూస్తూ ఉండగా, భగవత్సంబంధులు అందరూ కలసి అనుభవించదగిన భగవంతుని అధరామృతాన్ని నీవు ఒక్కడివే అక్రమించి, తేనెను ఆస్వాదించినట్లు ఆస్వాదిస్తే, మిగిలిన వారు నీతో తగవులాడరా?

*** పాంజశన్ని యత్తై * ప్పఱ్పనాబనోడుమ్ *
వాయ్ న్ద పెరుమ్ శుట్రుమ్ * ఆక్కి య వణ్బుదువై **
ఏయ్ న్ద పుగళ్ ప్పట్టర్ పిరాన్ * కోదై తమిళ్ ఈరైందుమ్ *
ఆయ్ న్దు ఏత్త వల్లార్ * అవరుమ్ అణుక్కరే 10*

పాంచజన్యాళ్వాన్ ఈ విధంగా ఈమె అడిగిన ప్రశ్నలకు ఏ విధమైన సమాధానం ఇవ్వనందున, దశక ప్రయోజనాన్ని పలికే ఈ చివరి పాశురంలో, పాంచ జన్యానికి తనతో కల సంబంధాన్ని దృఢంగా ప్రస్తావించి పలికే ఈ పది పాశురాలను నేర్చినవారికి ఈ

విధంగా పాంచజన్య శంఖంతో తమకు ఉండే సంబంధాన్ని గట్టిగా ప్రస్తావించి పలికేటట్లు భగవంతునకు అంతరంగులు కాగలరు– అని ఫలాన్ని చెప్పి. గోదాదేవి దశకాన్ని ముగిస్తున్నది.

పాంచజన్య శంఖాన్ని పద్మనాభునితో ఏర్పడిన గొప్ప సంబంధాన్ని కలిగినదిగా పలికే, అందమైన శ్రీవిల్లి పుత్తూరు నగరంలో అవతరించినది, నిండైన కీర్తిని కలిగినది, శ్రీ పెరియాళ్వారుల పుత్రిక అయిన గోదాదేవి పలికిన, ద్రావిడమయమైన పాశురాలను ఈ పదింటిని అనుసంధించి, వీటితో భగవంతుని స్తుతించగలవారు గోదాదేవి అనే నా వలె భగవంతునకు అంతరంగులు కాగలరు.

ఎట్టామ్ తిరుమొళి - విణ్ణీల మేలాప్పూ

ఈ దశకంలో గోదాదేవి శ్రీ వేంకటేశ్వరుని విషయంలో తనకు కల ప్రేమను వ్యక్తం చేస్తూ మేఘాలను ఆ స్వామి దగ్గరకు దూతలుగా పంపుతున్నది. ముందు దశకంలో శ్రీ పాంచ జన్యంతో మాటలను పలికిన ఈమె ఇప్పుడు శ్రీ వేంకటేశ్వరుని వద్దకు దూతలను పంపడం ఎందుకు? అని అంటే, శ్రీ పాంచజన్యంతో మాటలాడగానే, భావనా ప్రకర్ష వల్ల భగవంతుని వరకు గోదాదేవి యొక్క భావవృత్తి వెడుతుంది కదా. అంతేకాక, స పాంచజన్యం భగవంతుని ఆశ్రయించి, అతనికి శేషభూతుడై ఉన్నందున, అతనికి ధర్మం వలె ప్రకారమై ఉండేవాడతడు. ధర్మియై, అంటే, ప్రకారియై ఉండే భగవంతుని విడచి, ధర్మం, అంటే, ప్రకారం మాత్రమై ఉండే పాంచ జన్యానికి స్థితి, రూపం మొదలైనవి లేవు కదా. గడచిన దశకంలో శ్రీపాంచ జన్యాన్ని ఉద్దేశించి కొన్ని ప్రశ్నలను గోదాదేవి అడిగింది. కానీ అతడు బదులు పలకలేదు. వర్షాకాలం వచ్చి నందున మేఘాలు ఆకాశంలో కనిపించి గర్జించాయి. భగవంతుడు కూడా తాను ఆమెను విడచి వెళ్ళేటప్పుడు, వర్షాకాలంలో తిరిగి వస్తానని చెప్పి వెళ్ళాడు. ఆ కాలం వచ్చిన తరువాత కూడా అతడు రాలేదు. అతని వలె నల్లని వర్ణాన్ని కల మేఘాలే వచ్చాయి. అతడు కూడా వచ్చాడేమో అని ఆమె భ్రమించింది. అయితే, మేఘాలను చూచిందే తప్ప, భగవంతుడు కనిపించలేదు. పాంచజన్యం బదులు చెప్పకపోయినా, "కార్ క్కోడు పట్రియాన్ కై" (ముదల్ తిరువందాది– 27) అని పొయ్ గై అళ్వార్లు మేఘానికి, పాంచ జన్యానికి స్వభావంలో సామ్యాన్ని చెప్పినందున, మేఘ గర్జనను విని కొంచెం తృప్తి పొందింది. మేఘాలను చూసి, "భగవానుని గూర్చి విషయాలను అడిగింది. అవి కూడా ఏ బదులు చెప్పలేదు. అందుచేత గోదాదేవి చాలా బాధపడి, మళ్లీ "అతడు వే

వేంచేసి ఉండే వేంకటాచలంలో మీరు కూడా నివసిస్తున్నందున, నీకు అతనితో ఒక సంబంధం ఉన్నది. అందుచేత నా స్థితిని మీరే అతని దగ్గరకు దూతలుగా వెళ్లి తెలియజేయాలి" అని మేఘాలను దూతలుగా పంపుతున్నది.

శ్రీరామాయణంలో ఐంద్రవ్యాకరణాన్ని తెలిసిన, చాలా గొప్ప జ్ఞానాన్ని కలిగిన హనుమంతుని రాముని దగ్గరకు దూతగా పంపిన సీతవలె, అర్చావతారంలో ఈ మేఘాలను గోదాదేవి దూతలుగా పంపుతున్నది. " కామార్తా హి ప్రకృతికృపణాः చేతనాచేతనేషు" (కామం వల్ల ఆర్తిని పొందినవారు సహజంగానే వివేకాన్ని కోల్పోతారు గదా) (మేఘ దూతం—1—5) అనే విధంగా కామం వల్ల ఆర్తిని పొందినవారు" ఇది చేతనమా ?లేక అచేతనమా? అనే విషయాన్ని గమనించకుండా కలత చెంది, మేఘం మొదలైన అచేతన వస్తువులను కూడా దూతలుగా పంపిస్తారు కదా! ఆ విధంగానే గోదాదేవి కూడా "ఈ మేఘాలు మాటలాడ లేవు" అని తెలియలేక, కలతను చెంది, శ్రీ వేంకటేశ్వరుని వద్దకు వాటిని దూతలుగా పంపుతున్నది. అర్చావతారంలో దర్శనాన్ని అనుగ్రహించడం తప్ప మాటలాడడం, తాకడం, కలసి వ్యవహరించడం అనే ఇవి ఉండవు. విభవావతారాలలోనే ఇవి ఉంటాయి అని కూడా గోదాదేవికి స్ఫురించడం లేదు. ఈ గోదాదేవి లోకంలో ఉండేవారివలె కామాన్ని ప్రదర్శించడం తక్కువదనం కదా? అని అంటే, ఇక్కడ కామం అనబడేది పరమ పురుషుని విషయంలోని భక్తియే. లోకంలో కనిపించే ప్రాకృత కామం కానే కాదు. భక్తిని కలవారకూడా ప్రాకృత కాముకులవలె తాము తమ నాయకుడైన భగవంతునితో కూడితే ప్రాణాలను నిలుపుకోవడం, దూరమైతే ధరించలేకపోవడం అనే స్థితి ఉన్నందున, భక్తి అనేది శృంగార ప్రక్రియలో ఇక్కడ వ్యక్తం చేయబడుతున్నది. భగవంతుని కలిస్తే ప్రాణాలను ధరించడం, దూరమైతే ధరించలేకపోవడం గోదాదేవి వంటి దివ్యపతులకు సహజంగా ఉన్నది. అందువల్లనే ఆళ్వార్లు కూడా నాయకీ భావాన్ని పొంది, స్త్రీ వచనాలతో తమ భక్తిని వ్యక్తం చేస్తారు. మగవారిగా పుట్టిన వారికి అది కృతకం, క్లేశకరం. కాని, సహజంగానే స్త్రీ అయిన ఈమెకు స్త్రీభావన సహజ సిద్ధమై, సులభమై ప్రకాశిస్తున్నది.

*** విణ్ణీల మేలాప్పు * విరిత్తాఙ్పోల్ మేగంగాళ్! **
*తెణ్ణీర్ పాయ్ వేంగడత్తు * ఎన్ తిరుమాలుమ్ పోందానే? ***
*కణ్ణీర్గళ్ ములైక్కువట్టిల్ * తుళి శోర చ్చోర్వేనై **
*పెణ్ణీర్మై ఈడఴిక్కుమ్ ఇదు * తమక్కోర్ పెరుమైయే 1*

నా స్త్రీత్వాన్ని రూపుమాపడం వేంకటేశ్వర స్వామికి గొప్పతనం అవుతుందా? అని ఆ స్వామి దగ్గరకు వెళ్లి అడగమని మేఘాలతో గోదా దేవి పలుకుతున్నది.

ఆకాశంలో అంతటా నల్లని రంగులో మేల్కట్టును విస్తరించి, కట్టినట్లుగా ఉండే ఓ మేఘాలలారా!స్వచ్ఛమైన కొండవాగులు ప్రవహిస్తున్న శ్రీవేంకటాచలంలోకి వచ్చి నిలచి లక్ష్మీ నాథుడైన భగవంతుడు నితో కూడా వేంచేశాడా? నా స్తనాల చివరలో కన్నీరు ప్రవహించగా బాధపడే నా స్త్రీత్వాన్ని రూపుమాపడం అనేది ఆ స్వామికి ఒక గొప్పతనం అవుతుందా?

*మామత్త నిది శొరియుమ్ * మాముగిల్గాళ్! * వేంగడత్తు*
*చ్చామత్తిన్ నిఱమ్ కొణ్ * తాడాళన్ వార్త్తై ఎన్నై ! ***
*కామత్తీ ఉళ్ పుగుందు * కదువప్పట్టు ఇడై క్కంగుల్ **
*ఏమత్తోర్ తెన్నలుక్కు * ఇంగిలక్కాయ్ నాన్ ఇరుప్పేనే 2*

మలయ మారుతం వల్ల బాధపడే నాకు భగవంతుడు ఏదైనా ఒక మాటను పలికి పంపించాడా? అని మేఘాలను గోదాదేవి అడుగుతున్నది.

గొప్ప గొప్ప ముత్యాలను, బంగారా న్ని తీసుకొని వచ్చి వర్షించే ఓ కాలమేఘాలలారా! తిరుమలలో నీల వర్ణాన్ని కలిగిన భగవంతుని సంగతి ఏదైనా ఉన్నదా? కామాగ్ని నా లోపల ప్రవేశించి దహించగా, దానివల్ల బాధపడుతూ, రాత్రివేళ నడుజాములో ఒక మలయ మారుతానికి నేను లక్ష్యమై ఇక్కడ పడి ఉన్నానే!

*ఒళి వణ్ణమ్ వళై శిందై * ఉఱుక్కత్తోడివై ఎల్లామ్ **
*ఎళిమైయాల్ ఇట్టైన్నై * ఈడழிయ ప్పోయినవాల్ ***
*కుళిర్ అరువి వేంగడత్తు * ఎన్ గోవిందన్ గుణమ్ పాడి **
*అళియత్త మేగంగాళ్! * ఆవి కాత్తిరుప్పేనే 3*

అన్నిటినీ పోగొట్టుకున్న స్థితిలో ఉండే నేను స్వామితిరునామ సంకీర్తనంతో ప్రాణాలను ధరించడం సాధ్యమా ?అని అంటున్నది.

కరుణించే స్వభావాన్ని కలిగిన మేఘాలలారా !నా దేహంలోని కాంతి, వర్ణం, గాజులు, మనసు, నిద్ర అనే ఇవి అన్నీ నా దైన్య మే కారణంగా నన్ను ఉపేక్షించి నేను బలాన్ని కోల్పోయేటట్లు నన్ను విడిచి వెళ్లిపోయాయే! అయ్యో! చల్లని కొండవాగులు ప్రవహించే తిరుమలలో వేంచేసి ఉన్న నా శ్రీకృష్ణుని కళ్యాణ గుణాలను నోరార కీర్తిస్తూ ఆ పాటే ధారకంగా నా ప్రాణాలను రక్షించుకోవడం నాకు సాధ్యమా?

*మిన్నా గత్తు ఎழுగిన్ఱ * మేగంగాళ్! * వేంగడత్తు*
*త్తన్నా గ త్తిరుమంగై * తంగియ శిర్ మార్వర్కు **
*ఎన్నా గత్తు ఇళంగొంగై * విరుంబి త్తామ్ నాళ్ తోఱుమ్ **
*పొన్నా గమ్ పుళ్ళుదఱ్కు * ఎన్ పురివుడైమై శెప్పుమినే 4*

పురుషకారస్వరూపిణి అయిన లక్ష్మీదేవిని ముందుంచుకొని, తన అభిమతాన్ని శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో విన్నపించమని ఇందులో కోరుతున్నది.

శరీరంలో మెరుపు ప్రకాశిస్తున్న మేఘాలలారా! నా వక్షఃస్థలంలో ఉండే లేత వక్షోజాలను ఆ స్వామి కోరి, అందమైన తన వక్షఃస్థలంతో ఆలింగనం చేసికోవాలని నాకు ఆశ ఉండే రీతిని, తిరుమలలో తన తిరుమేనిలో లక్ష్మీదేవివేంచేసి ఉండే వక్షస్సును కలిగిన గొప్పతనాన్ని కలిగినవానికి చెప్పండి.

వాన్ కొణ్ణు కిళర్ న్దెழுన్ద మాముగిల్ కాళ్! * వేంగడత్తు*
త్తేన్ కొణ్ణ మలర్ శిదఱి త్తిరణ్డేఱి ప్పొழிవిర్గాళ్! **
*ఊన్ కొణ్ణ వళ్ళుగిరాల్ * ఇరణియనై ఉడల్ ఇడందాన్ **
*తాన్ కొణ్ణ శరివళైగళ్ * తరుమాగిల్ శాట్టుమినే 5*

భక్తుల విరోధులను పొగొట్టేవాని వద్ద తన స్థితిని విన్నపించమని ఇందులో కోరుతున్నది.

తిరుమలలో తేనె నిండుగా ఉండే పూలు చెదరి పడేటట్లు గుంపులు గుంపులుగా ఆకాశంలోకి వెళ్లి, వర్షాన్ని కురిపించేవై, ఆకాశాన్ని అంతటా వ్యాపిస్తూ, ఉన్నతంగా

విజృంభిస్తున్న ఓ కాలమేఘాలలారా! దృఢంగా, చాలా పదునుగా ఉండే గోళ్ళతో హిరణ్యకశిపుని శరీరాన్ని చిల్చివేసిన స్వామి నా విషయంలో కొల్లగొట్టుకొనిపోయిన చేతి గాజులను తిరిగినాకు ఇచ్చేటట్లయితే నా అవస్థను అతనికి తెలియజేయండి.

*శలమ్ కొణ్ణు కిళర్ న్దెఱ్ఱన్ * తణ్ ముగిల్ కాళ్! * మావలియై*
*నిలమ్ కొణ్డాన్ వేంగడత్తే * నిరందేఱి ప్పొళివిర్గాళ్! ***
*ఉలంగుణ్ణ విళంగని పోల్ * ఉళ్ మెలియ ప్పుగుందు * ఎన్నై*
*నలంగొణ్ణ నారణఱ్కు * ఎన్ నడలై నోయ్ శెప్పుమినే 6*

నా స్త్రీత్వపూర్తిని అపహరించిన నారాయణునకు నా దుఃఖాన్నిగూర్చి చెప్పండి అని అంటున్నది.

చల్లని జలాన్ని గ్రహించి, ఆకాశంలోకి ఉన్నతంగా వచ్చి ప్రకాశించే ఓ మేఘాలలారా!మహాబలి దగ్గర నుండి భూమిని యాచించి పొందిన భగవంతుడు వేంచేసి ఉండే తిరుమలలో అంతటా వ్యాపించి వర్షించే మేఘాలలారా! నేను, పెద్ద దోమలు భుజించిన వెలగపండువలె, నా మనసు లోపల క్లేశాన్ని పొందేటట్లు ప్రవేశించి, నా గుణపూర్తిని అపహరించిన నారాయణునకు నా క్లేశాన్ని తెలియజేయండి.

*** శంగమా కడల్ కడైందాన్ * తణ్ము గిల్గాళ్! * వేంగడత్తు*
*చ్చెంగణ్మాల్ శేవడి క్కీళ్ * అడివీళ్చ్చి విణ్ణప్పమ్ ***
*కొంగై మేల్ కుంగుమత్తిన్ * కుళ్మబ్బళియ ప్పుగుందు * ఒరు నాళ్*
*తంగుమేల్ * ఎన్నా వి తంగుమ్ ఎన్దురైయీరే 7*

స్వామి ఆలింగనం చేసుకుంటే తప్ప నా ప్రాణం నిలువదు– అని చెప్పండి –అని అంటున్నది.

శంఖాలను కలిగినదై, గొప్పతనాన్ని కలిగినదైన సముద్రాన్ని చిలికిన స్వామి వేంచేసి ఉండే తిరుమలలో సంచరించే చల్లని మేఘాలలారా! ఎర్రని కన్నులను కలిగిన ఆ స్వామి యొక్క ఎర్రని శ్రీ పాదాల చెంత నా విజ్ఞాపన ఏమంటే –నా వక్షోజాలపైన

పూయబడిన కుంకుమ పంకం అనేది బాగా చెదరిపోయేటట్లు ఏనాడైనా ఒకనాడు అతడు వచ్చి నన్ను సంశ్లేషిస్తే, అప్పుడే నా ప్రాణం నిలుస్తుంది అనేదే. ఈ విజ్ఞాపనను నా స్వామి దగ్గర చెప్పండి.

*కార్ కాలత్తెళ్గిన్ఱ * కార్ ముగిల్ కాళ్! * వేంగడత్తు*
*ప్పొర్ కాలత్తెళ్ందరుళి * ప్పురుదవనార్ పేర్ శొల్లి **
*నీర్ కాలత్తెరుక్కి ల్ * అమ్ పళ్ళ ఇలై పోల్ వీళ్ంవేనై *
*వార్ కాలత్తొరు నాళ్ * తమ్ వాశగమ్ తందరుళారే 8*

ఏనాడూ ఒక మాట కూడా అనుగ్రహించకపోవడం అందంగా లేదు –అని విన్నపించండి –అని అంటున్నది.

వర్షాకాలం లో తిరుమలలోకి వచ్చి ప్రకాశించే కాలమేఘాలలారా! యుద్ధ కాలంలో యుద్ధ రంగానికి వచ్చి యుద్ధం చేసి జయాన్ని పొందే స్వామి యొక్క తిరునామాలను సంకీర్తనం చేసి, వర్షాకాలంల అంతట జిల్లేడు ఆకులు రాలిపోయేటట్లు, కృశించి, రాలిపోయే నాకు దీర్ఘంగా కొనసాగుతున్న కాలంలో ఒకనాడుకూడా తాను ఒక మాటను చెప్పకుండా ఉన్నాడే!

*** మద యానై పోల్ ఎళ్ందవ * మాముగిల్గాళ్! * వేంగడత్తై*
*ప్పదియాగ వాళ్ంవిర్ కాళ్! * పాంబణైయాన్ వార్త్తై ఎన్నై ! ***
*కది ఎట్టుమ్ తాన్ ఆవాన్ * కరుదాదు * ఓర్ పెణ్ కొడియై*
*వదై శెయ్ దాన్ ఎన్ను మ్ శొల్ * వైయగత్తార్ మదియారే 9*

నన్ను చిత్రవధ చేయడం తనకు లోకనిందను కలిగిస్తుంది– అని చెప్పండి– అని అంటున్నది.

తిరుమలను నివాసస్థానంగా కలిగి, ఉజ్జీవిస్తున్న, మదించిన ఏనుగువలె గర్వంతో విజృంభించినవై ఉండే గొప్ప మేఘాలలారా! శేషశాయి అయిన భగవానుని సంగతి ఏదైనా ఉన్నదా? ఆ స్వామి ఎప్పటికీ రక్షకుడై ఉండి, తన స్వరూపహానికి

భావించకుండా, ఒక స్త్రీని వధించాడు– అనే మాటను ఈ భూమిలో ఉండేవారుఎవరూ గౌరవించరు కదా.

*** నాగత్తిన్ అణైయాళై * నన్ను దలాళ్ నయందురై శెయ్*
*మేగత్తై * వేగడ క్కోన్ * విడు తూదిల్ విణ్ణప్పమ్ ***
*బోగత్తిల్ వళ్ళువాద * పుదువైయర్ కోన్ కోదై తమిళ్ **
*ఆగత్తు వైత్తురైప్పార్ అవర్ * అడియార్ ఆగువరే 10*

ఈ దశకాన్ని అధ్యయనం చేసినవారికి కలిగే ప్రయోజనాన్ని తెలుపుతూ ముగిస్తున్నది.

విలక్షణమైన ముఖాన్ని కలిగినవారు, భగవదనుభవంలో ఏ లోటు లేనివారు, శ్రీవిల్లిపుత్తూర్ నగరానికి నాథులైన, పెరియాళ్వార్ల పుత్రిక గోదా దేవి ఆదిశేషుని పర్యంకంగా కలిగినవాడైన శ్రీ వేంకటేశ్వరుని ఆశపడి పలికినవి, మేఘాలను దూతలుగా పంపిస్తూ విన్నపించే ఈ ద్రావిడ పాశురాలను హృదయంలో పెట్టుకొని అధ్యయనం చేయగలిగినవారు భగవంతునకు నిత్యకైంకర్యాన్ని చేయగలుగుతారు.

ఒన్బదామ్ తిరుమొళి - శిందుర చ్చెమ్మొబడి

" గతేఽపి హరిశార్దూల! పునరాగమనాయ తు, ప్రాణానామపి సందేహో మమ స్యాన్నాత్ర సంశయః" (రామాయణం –సుందరకాండ– 39– 22) (వానరులకు ప్రభువైన హనుమా! నీవు తిరిగి రావడం కోసం వెళ్ళినప్పటికీ, నేను ప్రాణాలతో జీవించి ఉండడం సందేహమే సుమా! ఈ విషయంలో సందేహం లేదు) అని సీతాదేవి పలికినట్లు, గడచిన దశకంలో ప్రాణాలను ధరించడం సాధ్యమా? సాధ్యం కాదా? అనే స్థితి గోదాదేవికి కలిగింది. అయినా, తన ఆ స్థితిని అక్కడకు వెళ్లి స్వామి వద్ద తెలుపడానికి హనుమంతునివంటి దూతలను పంపే స్థితి సీతాదేవికి ఉన్నది. గోదాదేవికి ఆ విధంగా దూతలను పంపి తన స్థితిని తెలుపడానికి ఎవరూ లేకుండా పోయారు. గడచిన దశకంలో తెలుపమని తాను నియమించిన మేఘాలు కూడా ఎక్కడికి వెళ్లకుండానే గోదాదేవి ఉన్న చోటనే వర్షాన్ని కురిపించాయి. అందువల్ల వర్షాకాలంలో గోచరించే పూలు మొదలైన వస్తువులు అన్ని అంకురించడం ప్రారంభించాయి. వాటిలో కొన్ని పుష్పించడం ఆరంభించాయి. మరికొన్ని పుష్పించాయి. ఈ విధంగా చాలా అందంగా ఉండే ఇవి భగవంతుని తిరుమేని, కన్నులు మొదలైన అవయవాల అందాన్ని స్మరింపజేస్తూ కనుపించినవి. ఈ సన్నివేశం అంతా ఈమెను బాధించేదై గోచరించింది. కనుపించిన వస్తువులు అన్ని ఈమెను బాధించడం ఆరంభించాయి అని తెలుపబడుతున్నది, ఈ దశకంలో. ఈ స్థితి వృద్ధి చెంది గోదాదేవికి ప్రాణాలను ధరించడం దుర్లభమై ఉండే స్థితి ఏర్పడింది అని తెలుపబడుతున్నది, తరువాత వచ్చే పదవ దశకంలో. అందుచేత, ఈ రెండు దశకాలు కలిపి తిరువాయ్ మొళి ప్రబంధంలోని "ఇన్నుయర్ చ్చెవలుమ్ నిరుమ్" (9–5) అనే దశకంలో నమ్మాళ్వార్లకు కలిగిన స్థితి గోదాదేవికి ఏర్పడినదని తెలుపుతున్నవి.

*** శిందురచ్చెంపొడి ప్పూల్ * తిరుమాలిరుంజోలై ఎంగుమ్ **
*ఇందిర కోపంగళే * ఎళ్ళుమ్ పరందిట్టునవాల్ ***
*మందరమ్ నాట్టి అన్రు * మదుర క్కొళ్ళూజు కోణ **
*శుందర త్తోళుడైయాన్ * శుళలైయిల్ నిన్రుయ్ దుంగొలో? 1*

తిరుమాలిరుమ్ శోలై పర్వతం కనుపించని విధంగా ఇంద్రగోపకీటకాలు దానిని ఆవరిస్తూ ఉన్నాయి. సుందర బాహు స్వామి విసరిన వలనుండి మనం తప్పుకోగలమా?అని అంటున్నది.

తిరుమాలిరుమ్ శోలైలో కనిపించిన చోట అంతా ఇంద్రగోపకీటకాలు ఎర్రని సింధూరపు పొడివలె పైకి లేచి అంతటా వ్యాపించాయి. "పాల సముద్రాన్ని చిలిపి అమృతాన్ని ఇవ్వాలి" అని దేవతలు శరణు పొందిన ఆ సమయంలో మందరపర్వతాన్ని పాలసముద్రంలో నిలిపి, దానిని చిలికి, చాలా మధురమైన అమృతం అయిన లక్ష్మీదేవిని స్వీకరించిన సుందర బాహు స్వామియొక్క వలలోనుండి తప్పుకోగలమా?

*పోర్ క్క ళిఱు పొరుమ్ * మాలిరుంజోలై అమ్ పూమ్ పుఱవిల్ *
తార్క్కొ డి ముల్లైగళుమ్ * తవళ నగై కాట్టుగిన్ఱ **
కార్క్కొ ళ్ పడాక్క ళ్ నిన్ఱు * కళ్ళి చ్చిరిక్క త్తరియేన్ *
ఆర్క్కి డుగో? తోళీ! * అవన్ తార్ శెయ్ ద పూశలైయే 2*

స్వామి బాహువులలో ధరించిన మాలను ఆశపడి మనం పడిన పాట్లనుగూర్చి ఎవరి దగ్గర మొరపెట్టుకోవడం! అని పలుకుతున్నది.

యుద్ధం చేయడమే కృత్యంగా కలిగిన ఏనుగులు పోరాడుతూ ఉండే చోటు అయిన తిరుమాలిరుమ్ శోలై పర్వతంలో ఉండే చాలా అందమైన కొండ చరియలలో మొగ్గలను కలిగిన మొల్లతీగలు అందంగా ఉండే స్వామి తెల్లని చిరునవ్వును చూపుతున్నాయి. అంతేకాక, గుత్తులను కలిగిన, " పడా" అనే పేరు కలిగిన లతలు చక్కగా పూచి, "నా నుండి నీవు తప్పించుకోలేవు" అని అంటూ నవ్వుతున్నట్లు వికసిస్తున్నవి. వాటిని చూచి నేను ప్రాణాలను ధరించలేను. ఓ ప్రాణసకఖీ!మనం ఆశపడిన, స్వామి బాహువులలో అలంకరించుకున్న మాలిక మనకు కలిగించిన పరాభవాన్ని ఎవరి దగ్గర మొర పెట్టుకోవడం?

*కరువిళై ఒణ్ మలర్ కాళ్! * కాయా మలర్ కాళ్! * తిరుమాల్
ఉరువొళి కాట్టుగిన్ఱిర్ * ఎనక్కు ఉయ్యుమ్ ఒన్ఱుమిల్లైయీర్ **

*తిరు విళైయాడు తిణ్ తోళ్ * తిరుమాలిరుంజోలై నంబి *
వరి వళైయిల్ పుగుందు * వంది పట్టుమ్ వళక్కు ళదే 3*

కొన్ని పూలను చూచి, లక్ష్మీనాథుని వర్ణాన్ని స్మరింపజేసే మీరు స్వామి చేసిన పని న్యాయమా? అని చెప్పండి– అని అంటున్నది.

అందమైన కరువిళై (కాక్కణమ్) పుష్పాల లారా! అగిసే పూలలారా! మీరు లక్ష్మీదేవితో కూడిన భగవంతుని తిరుమేని వర్ణాన్ని గుర్తు చేస్తున్నారు. దానిని స్మరించి బాధపడుతున్న నాకు బతికి బయటపడే ప్రకారాన్ని చెప్పండి. లక్ష్మీదేవి క్రీడించే స్థానమైన, దృఢమైన బాహువులను కలవాడైన సుందర బాహు స్వామి నా ఇంటిలో ప్రవేశించి, నా అందమైన గాజులను బలాత్కారంగా తీసుకుని పోవడం న్యాయమేనా?

*పైమ్బొళిల్ వాళ్ కుయిల్ కాళ్! మయిల్ కాళ్! * ఒణ్ కరువిళైగాళ్! *
వంబు క్క ళంగనిగాళ్! * వణ్ణ ప్పూవై నఱుమలర్ కాళ్! **
ఐమ్బెరుమ్ పాదకర్ కాళ్! * అణి మాలిరుంజోలై నిన్ఱ *
ఎమ్బెరుమానుడైయ నిఱమ్ * ఉంగళుక్కున్ శెయ్ వదే? 4*

తనను బాధించే పంచ మహాపాతకులను ఖండిస్తున్నది:

విస్తరించిన ఉద్యానవనాలలో నివసిస్తున్న కోకిలలారా! అందమైన పుష్పాలలారా! నూతనమైన కళా పండ్లలారా! అందమైన వర్ణాన్ని, సువాసనను కల అతసీ పుష్పాలలారా! మీరు ఐదుగురు పంచ మహాపాతకులు. మీకు అందమైన తిరుమాలిరుమ్ శోలై క్షేత్రంలో ఉండే స్వామియొక్క తిరుమేని వర్ణం ఎందుకోసం? నన్ను బాధించడానికేనా!

*తుంగ మలర్ పొళిల్ శూళ్ * తిరుమాలిరుంజోలై నిన్ఱ *
శెంగట్రు రుముగిలిన్ * తిరువురు ప్పోల్ ** మలర్ మేల్
లొంగియ వణ్ణినంగాళ్! * లొగు పూంజునైగాళ్! * శునైయిల్
తంగు శెంతామరైగాళ్! * ఎనక్కో ర్ శరణ్ శాట్రుమినే 5*

తుమ్మెదలను, సరోవరాలను, తామర పూలను తనకు ఒక ఆశ్రయాన్ని చెప్పమని కోరుతున్నది.

ఉన్నతమైన పూలను కలలను చుట్టూ కలై తిరుమల క్షేత్రంలో ఉండే ఎర్ర తామరల వంటి కన్నులను, మేఘంవంటి అందమైన రూపాన్ని కలిగిన భగవంతుని విగ్రహంవలె పూలపై దట్టంగా నిలచి ఉండే తుమ్మెదలారా! అందమైన సరోవరాలలారా! ఆ చెరువులలో ఉండే, ఎర్రని తామర పూలలారా! నాకు ఒక శరణాన్ని చెప్పండి.

*** నాఱు నఱుమ్ పొఴిల్ * మాలిరుంజోలై నంబిక్కు * నాన్*
*నూఱు తడావిల్ వెణ్ణెయ్ * వాయ్ నేర్ న్దు పరావి వైత్తేన్ ***
*నూఱు తడా నిఱైంద * అక్కార అడిశిల్ శొన్నేన్ *
*ఏఱు తిరు ఉడైయాన్ * ఇన్ఱు వందివై కొళ్ళుంగొలో? 6*

నూరు గంగాళాల వెన్నను, నూరు గంగాళాల పాయసాన్ని సుందర బాహు స్వామికి సమర్పించాలని ఆశపడుతున్నది. అనంతర కాలంలో ఈ ఆశను పూర్తిచేసి, శ్రీవిల్లి పుత్తూరు క్షేత్రానికి శ్రీరామానుజులు వచ్చినప్పుడు ఆనందంలో వారిని "కోయిలణ్ణా!" అని వారిని గోదాదేవి సంబోధిస్తూ పొగడింది– అనే వృత్తాంతం సుప్రసిద్ధం.

సువాసన నిండుగా ఉండే తోటలు పరిమళిస్తూ ఉన్న తిరుమాలిరుం శోలై క్షేత్రంలో ఉన్న గుణపూర్ణునకు నేను నూరు కటాహాల నిండుగా వెన్నను నోటితో పల్కి సమర్పించాను. అంతేకాక, నూరు గంగాళాల నిండుగా అక్కార అడిశిల్ అనే పాయసాన్ని నోటితో సమర్పించాను. ఈ వెన్నను, పాయసాన్ని, క్రమక్రమంగా వృద్ధి చెందే సంపదను కలవాడైన సుందర బాహు స్వామి ఇప్పుడు వచ్చి అనుగ్రహిస్తాడా? (స్వీకరిస్తాడా?)

*ఇన్ఱు వందు ఇత్తనైయుమ్ * అముదు శెయ్ దిడ పెఱిల్ * నాన్*
*ఒన్ఱు నూఱాయిరమా క్కొడుత్తు * పిన్ను మాళుమ్ శెయ్ వన్ ***
*తెన్ఱల్ మణమ్ కమ్ఱుమ్ * తిరుమాలిరుంజోలై తన్ను ళ్*
*నిన్ఱ పిరాన్ * అడియేన్ మనత్తే వందు నేర్ పడిలే 7*

నేను సమర్పించిన నూరు గంగాళాల వెన్నను, నూరు గంగాళాల పాయసాన్ని స్వామి ఆరగిస్తే, ఇంకా నూరువేలుగా సమర్పించి కైంకర్యాన్ని చేస్తాను– అని అంటున్నది.

మలయ మారుతం సువాసనను గ్రహించి వీచే తిరుమాలిరుం శోలైలో వేంచేసి ఉండే స్వామి అయిన సుందర బాహు స్వామి ఈనాడు ఇక్కడకు వచ్చి, నూరు గంగాళాల నిండుగా వెన్నను, అకార ఆడిశిల్ పాయసాన్ని ఆరగించినట్లయితే, నేను అంత మాత్రంతోనే ఆగకుండా, నా హృదయంలోనే నిత్య వాసం చేయగలిగితే, నేను ఒకటికి నూరు వేల రెట్లు సమర్పించి, ఆ తరువాత కూడా సకలవిధసేవలను స్వామికి చేస్తాను.

*కాలై ఎழுన్దిరుందు * కరియ కురువి క్కణంగళ్ *
మాలిన్ వరవు శొల్లి * మరుళ్ పాడుదల్ మెయ్ మ్మై కొలో? **
శోలై మలై పెరుమాన్ * తువరాపది ఎంబెరుమాన్ *
ఆలిన్ ఇలై పెరుమాన్ * అవన్ వార్త్తై ఉరైక్కిన్ఱదే 8*

పిచ్చుకల సమూహాలు భగవంతుని రాకనుగూర్చి పలికినది నెరవేరుతుందా ? అని అంటున్నది.

నల్లని పిచ్చుకల సమూహలు ప్రాతఃకాలంలో నిద్రలేచి, తిరుమలిరుమ్ శోలే క్షేత్రానికి నాయకుడు, ద్వారకానగరానికి నాయకుడు, మర్రి ఆకులో శయనించిన భగవంతుడై ఉండే ఆ సర్వేశ్వరుని సంగతులను పలుకుతున్నవి. ఈ విధంగా భగవంతుని రాకను తెలుపుతూ మరుళ్ అనే రాగాన్ని పాడుతున్నవి. ఏ పిచ్చుకలు పలికే స్వామి రాక నిజమై పరిణమిస్తుందా?

*కోంగలరుమ్ పొழిల్ * మాలిరుంజోలైయిల్ కొన్జైగళ్ మేల్ *
తూంగు పొన్ మాలైగళోడు * ఉడనాయ్ నిన్ను తూంగుగిన్ఱేన్ **
పూంగొళ్ తిరుముగత్తు * మడుత్తూదియ శంగొలియుమ్ *
శారంగ విల్ నాణ్ ఒలియుమ్ * తలైప్పెయ్ వదు ఎళ్ఱాట్టు కొలో 9*

తిరుమలేరుమ్ శోలై క్షేత్రంలోని గన్నేరు పువ్వులవలె వ్యర్థంగా పడి ఉండే నేను ఆ భగవంతుని శంఖధ్వనిని, అతని శార్ ఙ్గం అనే వింటినారి ధ్వనిని విని, ప్రాణాలను ధరించగల్గడం ఏనాడో కదా! అని అంటున్నది.

కోంగు అనే పూలు పూస్తున్న తోటలను కల తిరుమాలిరుమ్ శోలై క్షేత్రంలో ఉండే గన్నేరు చెట్లపై వేలాడుతూ, బంగారు రంగును కలిగిన పూలతో సమంగా వ్యర్థంగా పడి ఉన్నాను. స్వామి అందం నిండుగా కలిగిన తన అధరంలో పెట్టుకుని ఊదిన పాంచజన్యం అనే శంఖంయొక్క ధ్వనిని, శార్ ఙ్గం అనే వింటి యొక్క ధ్వనిని నేను వినగలగడం ఏనాడో కదా.

*** శందొడు కార్ అగిలుమ్ శుమందు * తడంగళ్ పొరుదు *
వందిళియుమ్ శిలంబాఱుడై * మాలిరుంజోలై నిన్ఱ
శుందరనై ** శురుంబార్ కుళల్ * కోదై లొగుత్తురైత్త *
శెంతమిళ్ పత్తుమ్ వల్లార్ * తిరుమాల్ అడి శేర్వర్గళే 10*

ఈ దశకాన్ని అనుసంధించగలిగినవారికి కలిగే ప్రయోజనాన్ని పలికి, దశకాన్ని పూర్తి చేస్తున్నది.

చందనపు కట్టెలను, నల్లని అగరు కట్టెలను కొట్టుకుంటూ, తీరాలను కూలుస్తూ ప్రవహించే నూపుర గంగ అనే నదిని కలిగిన తిరుమాలిరుమ్ శోలై అనే క్షేత్రంలో నివసిస్తున్న సుందర బాహు స్వామిని గూర్చి, తుమ్మెదలు వాలిన కేశబంధాన్ని కల గోదాదేవి అందమైన ద్రావిడ భాషలో కూర్చిపలికిన ఈ పది పాశురాలను అనుసందించగలిగినవారు శ్రీమన్నారాయణుని శ్రీచరణాలను పొందగలరు.

పత్తామ్ తిరుమొழி - కార్‌కోడల్ పూక్కాళ్

తాను ఉజ్జీవించాలి అనే ఆశలో గడచిన దశకం అయిన "శిందుర చ్చెంబొడి" లో "ఎనక్కు ఓర్ శరణ్ శాற்றుమినే" (5) అనే పాశురంలో తుమ్మెదలు మొదలైనవాని పాదాలలో, దానికి ముందు, " విణ్ణిల మేలాప్పూ"అనే దశకంలో మేఘాల పాదాలలోనూ గోదాదేవి పడి ప్రార్థించింది. ఆ ప్రయత్నాలు ఏమీ ఫలించలేదు. ఈమె ఆర్తి అయితే, భగవంతుడు నిరుగా వచ్చి తన దర్శనాన్ని అనుగ్రహిస్తే కాని, అతడు రాబోతున్నాడు అనే విషయాన్ని తెలిపే కొన్ని గుర్తులు కనబడితే గాని ప్రాణాలను ధరించవచ్చు అనే రీతిలోని పరిపూర్ణమైన దశను పొందింది. నేను తిరిగి వస్తాను అని స్వామి చెప్పిన వర్షాకాలం వచ్చినప్పటికీ అతడు రాలేదు. ఆ కాలంలో కనిపించే పూలు మొదలైనవి ఎక్కడ చూసినా కనిపించి, స్వామి తిరుమేని, అందమైన అతని దివ్యాంగాలు, అవయవ శోభ, పలుకులు మొదలైనవానిని స్మరింపచేసేవై, ఈమె కొంత సమయం మోహాన్ని పొందేటట్లు, మరి కొంతసేపు తెలివిని పొందేటట్లు బాధపెట్టాయి. వాటి వల్ల క్లేశాన్ని పొందిన గోదాదేవి" ఇవి అన్ని కలిసి నన్ను బాధిస్తునందున, నేను ఇక ప్రాణాలను భరించలేనట్లుగా ఉన్నది. ఇక నేను ప్రాణదారణ చేయడానికి రెండు దారులు ఉన్నాయి అని భావించింది. అవి ఏమంటే—

1) "*మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన,*

దోషో యద్యపి తస్యస్యాత్ సతామేతదగర్హితమ్" (రామాయణంయుద్ధకాండ—18—3)
(మిత్ర భావంతో సమీపించిన ఈ విభీషణుని ఏ క్షణంలో నేను విడువను. అతని దగ్గర దోషం ఉన్నా ఉండనీ. మంచివారికి ఇతనిని స్వీకరించడం నిందించదగినది కాబోదు) ,
"*ద్యౌ: పతేత్ పృథివీ శీర్యేత్ హిమవాన్ శకలీభవేత్.*
శుష్యేత్ లోయనిధి: కృష్ణే న మే మోఘం వచో భవేత్' (భారతం— ఉద్యోగపర్వం —70—48)

(ఓ ద్రౌపదీ! ఆకాశం కిందపడినా పడవచ్చు. భూమి ముక్కలు నశించవచ్చు. హిమవంత్ పర్వతం ముక్కలు ముక్కలు కావచ్చు. సముద్రం ఎండిపోవచ్చు. కానీ, నా మాట వ్యర్థం కాదు) ,

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే.
అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ" (శ్రీరామాయణం—యుద్ధకాండ —18—33)

(ఒక పర్యాయం శరణు పొందినవానికి, నీకు దాసుడను అయ్యాను అని ప్రార్థించినవానికి అన్ని ప్రాణుల నుండి అభయాన్ని కలిగిస్తాను, ఇది నా వ్రతం) అని స్వామి పలికిన మాటలు అర్థం కావు కనుక వాటివల్ల నేను ప్రాణాలను ధరించవచ్చు.

2) లేక, పెరియాళ్వారుల పుత్రిక అయినందువల్ల ఉజ్జీవించవచ్చు.

అతని మాటలను పురస్కరించుకొని ప్రాణదారణ చేయవచ్చు అని చూస్తే స్వతంత్రుడైన అతనిని ఈ మార్ ఈ మాటలను చూపించి నిర్బంధించడం సాధ్యం కాదు. అతడు ఎవరినైనై ఒకరిని ఉదాసీనంగా చూస్తే, అతడు స్వతంత్రుడైనందున, అతనిని అడ్డు పెట్టేవారు ఎవరూ లేరు కదా. ఇక, అతడు తన మాటలను తప్పినా, పెరియాళ్వారుల పుత్రికగా జన్మించడం వల్ల కోరిన ఫలం లభించక తప్పదు. అయితే, అది కూడా ఫలిస్తుందా? పలించగా? దానికి నేను విషయం కాగలనా? కాలేనా? అనే విషయం తెలియకుండా ఉన్నదే" అని సందేహపడినది. దానికి తరువాత, మిగిలినవి అన్నీ తప్పినా, పెరియాళ్వార్లతో ఉండే సంబంధం ఫలించక తప్పనే తప్పదు. అతని స్వాతంత్ర్యాన్ని తగ్గించి, అతని శ్రీచరణాలలో నన్ను చేర్పించకుండా ఉండదు" అని నిశ్చయించుకుని, ఆ నిశ్చయంతో ప్రాణాలను తాను ధరించడం తెలుపుతూ గోదాదేవి ఈ దశకాన్ని పూర్తి చేస్తున్నది.
“మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన,
దోషో యద్యపి తస్య స్యాత్ సతామేతదగర్హితమ్" (రామాయణం యుద్ధకాండ —18—3)

(మిత్ర భావంలో సమీపించిన ఈ విభీషణుని ఏ క్షణంలో నేను విడువను. అతని దగ్గర దోషం ఉన్నా ఉండని. మంచివారికి ఇతనిని స్వీకరించడం నిందించదగినది కాబోదు) అనే అతని మాటను అనుసరించి భగవంతుడు నా చేయి విడువడు అని భావించినా గాని,

"*ఆనయైనం హరి శ్రేష్ఠ! దత్త మస్యాభయం మయా,*
విభీషణో వా సుగ్రీవ! యది వా రావణ: స్వయమ్" (రామాయణం– యుద్ధకాండ– 18 –34)

(వానరులలో గొప్పవాడవైన సుగ్రీవా! ఇతనిని పిలుచుకొని రా. ఇతడు విభీషణుడైన కాని, లేక, రావణుడైనా కాని, ఇతనికి నేను అభయాన్ని ఇస్తున్నాను) అనే విధంగా స్వామిని, మనలను చేర్పించేవారు కావాలి కదా! ఆ విషయాన్ని తెలుపుతున్నది, ఈ దశకం. శ్రీ పరాశర భట్టర్ వాణవదరైయన్ అనే చిన్న ప్రభువును చూడడం కోసం వచ్చి, శ్రీదేవి మంగళం అనే ఊరిలో ఉండేటప్పుడు, శ్రీవైష్ణవులు కొందరు చాలా భక్తితో భట్టర్ పట్ల ప్రవర్తించడాన్ని చూచి కొందరు, " భగవంతుడు ఉండగా మీ వద్ద ఈ శ్రీ వైష్ణవులు ఇంత అభినివేశాన్ని చూపించడానికి ఏమి కారణం? అని అడుగగా, "భగవంతుని పొందడానికి అతని భక్తులు ఘటకులు కనుక, కూరేశులలో నాకు ఉండే సంబంధాన్ని చూచి, నా విషయంలో వీరు గౌరవాన్ని చూపిస్తున్నారు "అని భట్టర్ పలకడం ఇక్కడ స్మరించాలి.

*** కార్కోడల్ పూక్కళ్! * కార్క్కడల్ వణ్ణన్ ఎన్ మేల్ * ఉయ్మ్మె*
*ప్పొర్కోలమ్ శెయ్ దు * పోర విడుత్తవన్ ఎంగుట్ట్రాన్? ***
*ఆర్కో ఇని నామ్ * పూశల్ ఇడువదు? * అణి తుళాయ్*
*తార్కోడుమ్ నెంజమ్ తన్నై * ప్పడైక్క వల్లేన్ అందో! 1*

వర్షాకాలంలో పూచే కాందల్ అనే పూలను చూచి, " మిమ్ములను నాపై ప్రయోగించిన స్వామి ఎక్కడ ఉన్నాడు? అని అడుగుతున్నది,

నల్లని కాందల్ పూలలారా! నపై యుద్ధానికి వచ్చేటట్లు అలంకరించి, నాపై పడేటట్లుగా ప్రయోగించిన, నల్లని సముద్రంవంటి రూపాన్ని కలిగిన వాడైన శ్రీకృష్ణుడు

ఎక్కడ ఉన్నాడు? మీ వల్ల బాధపడిన నేను ఇకపై ఎవరి దగ్గరకు పోయి నా బాధను మొరపెట్టుకుంటానో, తెలియడం లేదు. స్వామి ధరించిన అందమైన తులసిమాలికను ఆశపడి పరుగు తీసే మనసును కలిగినదానవై ఉన్నానే! అయ్యో!

*మేల్ తోన్ని పూక్కాళ్! * మేల్ ఉలగంగళిన్ మీదు పోయ్ *
మేల్ తోన్నుమ్ శోది * వేద ముదల్వర్ వలంగైయిల్ **
మేల్ తోన్నుమ్ ఆళియిన్ * వెంజుడర్ పోల చ్చుడాదు * ఎమ్మై
మాట్టోమై పట్టువర్ కూట్టత్తు * వైత్తు క్కొళ్ళిట్టిరే 2*

"శ్రీ సుదర్శనుని వలె నన్ను దహించకుండా, భగవంతుని అనుభవాన్ని లేనివారి సమూహంలో నన్ను చేర్చండి" అని కాందల్ పుష్పాలతో పలుకుతున్నది.

ఉన్నతంగా పూచిన కాదల్ పూలలారా! పైన ఉండే లోకాలను అన్నిటినీ దాటి వాటికి పైన ప్రకాశిస్తున్న, తన, ప్రకాశించే లోకమైన పరమపదంలో వేంచేసి ఉండే వేదప్రతిపాద్యుడైన పరమ పురుషుని కుడిచేతిలో ప్రకాశిస్తున్న ఈ సుదర్శనుని వేడి అయిన తేజస్సు వలె దహించకుండా, నన్ను కైవల్యనిష్ఠుల సమూహంలోకి తీసుకొని చేర్చగలరా?

*కోవై మణాట్టి! * ని ఉన్ కొళ్గని కొణ్డు * ఎమ్మై
ఆవి తొలైవియేల్ * వాయ్ అళగర్ తమ్మై అంజుదుమ్ **
పావియేన్ తోన్ని * ప్పాంబణైయార్క్కుమ్ తమ్ పాంబు పోల్ *
నావుమ్ ఇరణ్డుళవాయ్ త్తు * నాణిలియేనుక్కే 3*

పైన కనిపించే కాందల్ పువ్వుల నుండి తన దృష్టిని గోదాదేవి పక్కకు మరల్చింది. అక్కడ పాకిన తీగలో దొండ పండ్లు బాగా పండి ఉన్నాయి. వాటిని చూసి, " నన్ను బాధించడం కోసం నిన్ను కూడా స్వామి పంపించాడా?" అని అంటున్నది. మొదటి పాశురంలో కాందల్ పూలు భగవంతుని నల్లని వర్ణా న్ని గుర్తు చేస్తూ బాధ పెట్టినట్లు చెప్పబడింది. రెండవ పాశురంలో పైన కనిపించే కాందల్ పుష్పాలు సుదర్శనుని వేడిమిని

గుర్తు చేస్తూ బాధ పెడుతున్నట్లు చెప్పబడింద. ఈ పాశురంలో దొం పండ్లు భగవంతుని పగడం వంటి ఆధరాన్ని గుర్తు చేస్తూ బాధిస్తున్నట్లు చెప్పబడుతున్నది.

.

అమ్మా! దొండతీగా! నీవు నీ అందమైన పళ్ళతో నా ప్రాణాన్ని తీయకూడదు. అందమైన ఆధరాన్ని కలిగిన స్వామి విషయంలో భయపడుతున్నాను. పాపిష్ఠిదానను అయిన నేను పుట్టిన తరువాత, లజ్జనేని నా విషయంలో శేషశాయి అయిన భగవంతునకు తన పడుకనైన ఆదిశేషునకు వలె నాలుకలు రెండు అయినట్లు ఉన్నాయి.

*ముల్లై ప్పిరాట్టి! * నీ ఉన్ ముఱువల్ కళ్ కొణ్డు * ఎమ్మై*
*అల్లల్ విళైవియేల్ * ఆళి నంగాయ్! ఉన్ అడైక్క లమ్ **
*కొల్లై అరక్కి యై మూక్కరిందిట్ట * కుమరనార్*
*శొల్లుమ్ పొయ్ ఆనాల్ * నానుమ్ పిఱందమై పొయ్యున్ 4*

దొండ పండు భగవంతుని పగడం వంటి అధరాన్ని గుర్తు చేసి తనను బాధించడాన్ని గడచిన దశకంలో గోదాదేవి తెలియజేసింది. తరువాత ఆతీగకు దానికి సమీపంలో గోదాదేవి చూచింది. అక్కడ మొల్లతీగ చక్కగా పూచి కనిపించింది. " ఉళ్ళే వెణ్ పల్ ఇలకు శుడరిలకు" (తిరువాయ్– 8– 9– 1) అనే విధంగా భగవంతుని మందహాసాన్ని గుర్తుచేస్తూ అక్కడ మొల్ల తీగ తనను బాధించడాన్ని ఈ పాశురంలో గోదాదేవి తెలుపుతున్నది.

అమ్మా! ఓ మొల్ల తీగా!గంభీరమైన స్వభావాన్ని కలిగినదానా! నీవు భగవంతుని చిరునవ్వువలె నీ పూలతో నన్ను బాధించకు. ఇందుకోసం నిన్ను శరణు పొందుతున్నాను మర్యాదను అతిక్రమించిన శూర్పణఖ ముక్కును నరికి, తరిమి వేసిన దశరథచక్రవర్తి కుమారుడైన శ్రీ రాముని సూక్తియే అసత్యమైతే, నేను పెరియాళ్వారుల కడుపులో పుట్టడం కూడా అసత్యం అవుతుంది కదా.

*పాడుమ్ కుయిల్ కాళ్! * ఈదెన్న పాడల్? * నల్ వేంగడ*
*నాడర్ నమక్కు ఒరు వాళ్వు తందాల్ * వందు పాడుమిన్ ***
*ఆడుమ్ కరుళ కొడి ఉడైయార్ * వందరుళ్ శెయ్ దు *
*కూడువర్ ఆయిడిల్ * కూవి నుమ్ పాట్టుక్కళ్ కేట్టుమే 5*

గడచిన పాశురంలో మొల్లపువ్వు తన కంటికి నేరుగా నిలచి, స్వామి చిరునవ్వును గుర్తు చేయడం ఆరంభించగానే, ఆ మల్లెపూవును చూడకుండా తన ముఖాన్ని పక్కకు తిప్పుకొని కళ్ళను గోదాదేవి మూసికొన్నది. చెవులను మూసి కోవడం సాధ్యం కానందువల్ల అప్పుడు ఆమెకు కోకిల పాట చెవిలో పడి, ఆమెను బాధించడాన్ని ఈ పాశురంలో తెలుపుతున్నది.

పాట పాడే ఓ కోకిలలారా! కర్ణ కఠోరంగా ఉండే ఈ ధ్వని ఏమి పాట? విలక్షణమైన వేంకటాద్రిని తన నివాస స్థానంగా కలిగిన భగవంతుడు నా విషయంలో ఒక ఉజ్జీవనాన్ని అనుగ్రహించినట్లయితే, అప్పుడు మీరు ఇక్కడకు వచ్చి మీ పాటను పాడండి. తన స్పర్శ వల్ల ఆనందంలో ఆడే గరుడుని ధ్వజంగా కలిగిన స్వామి అనుగ్రహించి ఇక్కడకు వచ్చి కలిసేవాడైతే, అప్పుడు మిమ్ములను ఆహ్వానించి, మీరు పాడే పాటలను నేనే కోరి వింటాను.

*కణ మా మయిల్ కాళ్! * కణ్ణ పిరాన్ తిరుక్కోలమ్ పోన్ను *
*అణి మా నడమ్ పయిన్ఱాడుగిన్ఱీర్క్కు * అడి వీళ్గిన్ఱేన్ **
*పణమ్ ఆడరవణై * ప్పఱ్పల కాలముమ్ పళ్ళి కొళ్ *
*మణవాళర్ * నమ్మై వైత్త పరిశిదు కాణ్మినే 6*

తనను బాధిస్తూ నాట్యం చేసే నెమళ్ళ పాదాలపై పడి, గోదాదేవి భగవంతుడు నన్ను రక్షించే అందాన్ని చూచారా?అని అంటున్నది.

గుంపులు గుంపులుగా ఉండే గొప్ప నెమళ్ళలారా! శ్రీకృష్ణుని అందమైన రూపంవంటి రూపాన్ని కలిగినవారై, అందంగా గొప్ప నాట్యం నేర్చి, ఆ నాట్యాన్ని

ఆడుతున్న మీ పాదాలలో నమస్కరిస్తున్నాను. ఈ ఆటను నిలపండి. తన పడగలను ఎత్తి ఆడుతున్న ఆదిశేషుడనే పడుకలో కాలం ఉన్నంత సేపు పరుండి ఉండే అందమైన వరుడైన స్వామి నాకు కలిగించిన గొప్పతనం ఈ విధంగా మీ కాలిలో పడేటట్లుగా అయినది.

*నడమాడి ళ్తోగై విరిక్కిన్ఱ * మా మయిల్గాళ్! * ఉమ్మై*
*నడమాట్టుమ్ కాణ * ప్పావియేన్ నాన్ ఓర్ ముదలిలేన్ ***
*కుడమాడు కూత్తన్ * గోవిందన్ కోమిళై శెయ్ దు * ఎమ్మై*
*ఉడైమాడు కొండాన్ * ఉంగళుక్కిని ఒన్ఱు పోదుమే? 7*

నాట్యం చేసే నెమళ్ళను చూచి, " నా ముందు ఈ విధంగా నాట్యం చేయడం మీకు మీకు తగినదా?" అని అంటున్నది.

నాట్యం చేస్తూ, పించాలను విప్పుకున్న అందమైన నెమళ్ళలారా! మీ నాట్యాన్ని చూడడానికి పాపిని అయిన నేను ఏ విధమైన యోగ్యతను కలిగినదానిని కాదు. కుంభ నృత్యాన్ని చేయడంలో సమర్థుడైన గోపాలుడు స్వాతంత్ర్యంతో తుటరి పనులను చేసి, నన్ను తన సొత్తుగా చేసుకున్నాడు. ఈ విధంగా ఉండగా, నా ముందు మీరు నాట్యం చేసి, నన్ను హింసించడం అనే ఈపని మీకు తగినదా?

*** మళైయే! మళైయే! మణ్ పుఱమ్ పూశి * ఉళ్ళాయ్ నిన్ఱ*
*మెళ్ళగూట్టినాఱ్పోల్ * ఊట్టు నల్ వేంగడత్తుళ్ నిన్ఱ ***
*అళగ ప్పిరానార్ తమ్మై * ఎన్ నెంజత్తగప్పడ*
*త్తళువ నిన్ఱు * ఎన్నై త్తదైత్తు క్కొణ్డు * ఊట్టువుమ్ వళ్ళెయే? 8*

మేఘాలు వర్షాన్ని కురిసి, కార్ క్కొడల్ మొదలైన పూలు పుష్పించేటట్లు చేసి, నెమళ్లు మొదలైనవానిని ఆడేటట్లు చేసి, కంటితో చూసిన వస్తువులను అన్నీ ఈమె బాధించేటట్లు చేసిన తరవాత కూడా విడవకుండా అవి వర్షాన్ని కురవడాన్ని చూసి ఈ పాశురాన్ని గోదాదేవి పలుకుతున్నది. తిరుమల నంబి ఈ పాశురంలో, తరువాత

పాశురంలో చాలా అభినివేశాన్ని కలిగి ఉండేవారు. అందువల్లనే మన పూర్వాచార్యులు అందరూ వీటిలో చాలా ప్రీతిని కలిగి ఉండేవారు. ఈపాశురాన్ని, తరువాత పాశురాన్ని అనుసంధించి కన్నీరు మున్నీరై, ఏమి పలుకలేక, తిరుమల నంబి చాలా అభినివేశాన్ని పొందేవారట.

ఓ మేఘమా! పైభాగంలో మట్టిని మూసి, లోపల ఉండే మైనం కరుగగా అది వేడిమికి బయటకు వచ్చినట్లుగా, నన్ను ఆలింగనం చేసుకుని, నా లోపల ఉండే ప్రాణాన్ని కరిగించి లేకుండా చేసేవాడై, విలక్షణమైన వేంకటాచలంలో నిలచి ఉండేవాడైన అందమైన స్వామి నా మనసులో ప్రత్యక్షం అయ్యేటట్లుగా నేను అతనిని ఆలింగనం చేసుకునేటట్లు చేసి, నన్ను అతనితో కలిపి, తరువాత నీవు వర్షించకూడదా?

*కడలే! కడలే! ఉన్నై క్కడైందు * కలక్కు ఱుత్తు *
ఉడలుళ్ పుగుందు నిన్ఱు * ఊఱల్ అఱుత్తవఱ్ఱు ** ఎన్నై యుమ్
ఉడలుళ్ పుగుందు నిన్ఱు * ఊఱల్ అఱుక్కిన్ఱ మాయఱ్ఱు * ఎన్
నడలైగళ్ ఎల్లామ్ * నాగణైక్కే శెన్ఱురైత్తియే 9*

సముద్రం అలలతో ఉప్పొంగడం ఆరంభించింది. " నేను పడే పాట్లను ఆదిశేషశయనునకు తెలియజేయమని దానిని చూసి పలుకుతున్నది.

సముద్రమా! తనకు నిన్ను శయ్యగా కలిగినవాడై, నిన్ను మందర పర్వతంతో చిలికి, కలతను పొందించి, నీ శరీరంలో ప్రవేశించి, సారమైన అమృతాన్ని అపహరించినట్లే, నా శరీరం లోపల ప్రవేశించి, నా ప్రాణాన్ని ఖండించేవాడై, ఆశ్చర్యకరమైన స్వభావాన్ని కలిగిన స్వామికి విన్నపించేటట్లు నా దుఃఖాలను అన్నిటిని అతనికి పడుకనైన ఆదిశేషుని దగ్గరకు నీవు పోయి చెప్పగలవా?

*** నల్లవెన్ తోళి! * నాగణై మిశై నమ్ పరర్ *
శెల్వర్ పెరియర్ * శిఱు మానిడవర్ నామ్ శెయ్ వదెన్? **
విల్లి పుదువై * విట్టుశిత్తర్ తంగళ్ దేవరై *
వల్ల పరిశు వరువిప్పరేల్ * అదు కాణ్డుమే 10*

ఈ దశకంలోని చివరి పాశురమైన ఇందులో గోదాదేవి చెలికత్తె ఈమెకంటే ఎక్కువగా క్లేశాన్ని పొంది, " ఈమె ఎల్లప్పుడూ ప్రాప్యానికి కారణంగా భావిస్తున్నది పెరియాళ్వారుల కడుపులో పుట్టడం, "భక్తిని కలిగినవారిని నేను విడచిపెట్టను" ఆని స్వామి పలికిన మాట– అనే ఈ రెండే కదా. "కుమారనార్ శొల్లుమ్ పొయ్యానల్ నానుమ్ పిఱన్దమై పొయ్యన్జే" (స్వామి పలికిన మాట అబద్ధమైతే, నేను పెరియాళ్వార్ల కడుపున పుట్టడం కూడా అబద్ధం కదా) (4) అని ఆ రెండు నాకు నేను కోరిన ప్రాప్యాన్ని కలిగిస్తాయా? అని సందేహ పడుతున్నట్లున్నది. ఈమె ప్రాణాలు నిలుపుకోవడానికి ఏ దారి కనపడడం లేదు. ఈఏ మార్గంలో ఈమెను ఉజ్జీవింప చేయాలి?" అని భావించింది. ఆమె ముఖంలోని లక్షణాలను గమనించి, ఆమె అభిప్రాయాన్ని తెలిసికొన్న గోదాదేవి, " నివు భయపడవలసిన పనిలేదు. నేను ఉజ్జీవించడానికి ఒక మార్గం ఉన్నది సుమా. నా తండ్రి అయిన పెరియాళ్వార్లు ఏదో ఒక దారిలో అతనిని వచ్చేటట్లు చేసి, అనుగ్రహిస్తారు "అని ఇందులో పలుకుతున్నది.

నా ప్రాణ సఖి!ఆదిశేషుడనే పడుకపై శయనించి ఉండే మన స్వామి గొప్ప సంపదను కలవాడు, అందరి కంటే గొప్పవాడు, మనమైతే క్షుద్ర మానవులం. ఇటువంటి మనం ఏమి చేయగలం? శ్రీవిల్లి పుత్తూరుకు నిర్వాహకులైన పెరియాళ్వార్లు తమకు విధేయుడై ఉండే స్వామిని తమకు సాధ్యమైన మార్గాలలో ఆహ్వానించినట్లయితే అప్పుడు మనం ఆ స్వామిని సేవించగలుగుతాము.

పదినోరామ్ తిరుమొళి - తామగక్కుమ్

గడచిన దశకంలో "కుమరనార్ శొల్" (10–4) (దశరథుని కుమారుడైన శ్రీరాముని మాట) అని స్వామి రెండు మాటలను పలుకనివాడు– అని, "విల్లిపుదువై విట్టుశిత్తర్ తంగళ్ దేవరై వల్ల పరిశు వరువిప్పరేల్ ఆదు కాండుమే" (10–10) (శ్రీవిల్లి పుత్తూరుకు నాయకులైన విష్ణుచిత్తులు తమ స్వామిని తమకు సాధ్యమైన మార్గాలలో ఆహ్వానిస్తే, అప్పుడు మనం దర్శించగలం) అని, " స్వామి మాటను తప్పినప్పటికీ పెరియాళ్వారుల కడుపున జన్మించడం వ్యర్థం కాబోదు, వారి సంబంధం మనకు ఫలాన్ని కలిగించే తీరుతుంది" అనే నిశ్చయాన్ని కలిగినదే అయినా, స్వామి తనకు అనుగ్రహించడం కనపడలేదు. అర్జునుని చేతిలోని బాణాలతో మర్మస్థానంలో కొట్టబడి, అంపశయ్యపై పడుకుని ఉండే భీష్మాచార్యునివలె, భగవంతుని స్మరింపజేసే వస్తువులవల్ల చాలా బాధను పొందిన ఈమె దశను చూచిన తల్లికి, చెలికత్తెలకు "ఈమె ఏ కారణం చేత బాధపడుతున్నది ?అని తెలిసిపోవాలి "అని భావం కలిగింది. వారి వారి కార్యాలను విడచిపెట్టి, అందరూ ఈమె ముందు కూడి ఉన్నారు. వారిని చూచి గోదాదేవి "పెరియాళ్వార్లలో ఉండే సంబంధమే నేను కోరిన ప్రాప్యాన్ని పొందడానికి ఉపాయం" అని నేను నిశ్చయించుకున్నాను. స్వామి నా గాజులను నా చేతి నుండి జారిపోయేటట్లు చేసి వేశాడు. నేనుండే విధిద్వారా వచ్చి, నన్ను అనుగ్రహించడం లేదు. స్వామి అయితే, సీతాదేవికోసం భుజించకుండా నిద్రించకుండా ఎంతో బాధపడినవాడే" అని క్లేశపడి, కొన్ని మాటలను పలికింది. అంతే గాక, నా వంటి రుక్మిణి దేవిని శిశుపాలుని బారినుండి కాపాడి, ఆమెను స్వీకరించినవాడు నాకు కూడా సహాయ పడకుండా ఉండడు" అని ఒక విధంగా ఓదార్పును పొంది, ప్రాణాలను ధరించి, ఈ దశకాన్ని పూర్తి చేస్తున్నది.

*** తామ్ ఉగక్కుమ్ తమ్ కైయిల్ * శంగమే పోలావో? ***
*యామ్ ఉగక్కుమ్ ఎన్ కైయిల్ * శంగముమ్ ఏందిళైయిర్! ***
*తీ ముగత్తు నాగణై మేల్ * శేరుమ్ తిరువరంగర్ ***
*ఆ!ముగత్తై నోక్కారాల్ * అమ్మనే! అమ్మనే! 1*

తల్లులను చెలికత్తెలను చూసి, "భగవంతుడు చేసిన పని న్యాయమేనా? అని అతనిని అడగండి" అని అంటున్నది. " ఈమె ఈ విధంగా ఇప్పుడు బాధపడేటప్పుడు నీవు వచ్చి అనుగ్రహించకపోవడానికి ఏమి కారణం? " ఇందుకు ఇది కారణం" అని బదులు చెప్పడానికి ఒకటి ఉన్నది –అని అతడు తలుస్తున్నాడా !ఏమి?అడగండి" అని అంటున్నది. " నేను అతనిని అభిమానించడంలో ఉండే కొరత కారణమా?" అని చూస్తే, నా అభిమానంలో అయితే ఏ కొరత లేదు. తాను నన్ను అభిమానించడంలో ఉండే కొరత కారణమా? అని గమనిస్తే, తన అభిమానంలో ఏ లోటు లేదు. తన రక్షణలో కొరత ఉన్నదా? అని చూస్తే, అందులోనూ కొరత లేదు. నేను రక్షింపబడదగినదానినై ఉండడంలో కొరత కారణమా? అని చూస్తే, అందులోనూ ఏ కొరత లేదు. ఏ కారణాన్ని చెప్పాలని భావిస్తున్నాడో! ఏదీ లేదే! అని ఇక్కడ తాత్పర్యం.

ఆభరణాలను అలంకరించుకున్న తల్లులారా! నేను అభిమానించి, నా చేతిలో ధరించిన గాజులు, తాను కోరి ధరించిన తన చేతిలోని శంఖంతో సాటి రాదా? అగ్నిని వెదజల్లే క్రూరమైన ముఖాలను కల ఆదిశేషుడనే పడుకపై పరుండే శ్రీరంగనాథుడు నా ముఖాన్ని చూడడమే లేదే! అయ్యో !అయ్యో! అయ్యో!

*ఎళిల్ ఉడైయ అమ్మనైమీర్! * ఎన్ అరంగత్తిన్న ముదర్ **
కుళల్ అళగర్ వాయ్ అళగర్ * కణ్ అళగర్ ** కొప్పుళిల్
ఎళ్రుకమల పూవళగర్ * ఎమ్మా నార్ * ఎన్ను డైయ
కళల్ వళైయై * త్తామమ్ కళల్ వళైయే ఆక్కినరే 2*

తన స్థితిని దాచవలసిన తల్లుల వద్ద తన స్థితిని వ్యక్తం చేస్తున్నది

సౌందర్యాన్ని కలిగిన తల్లులారా! శ్రీరంగంలో వేంచేసి ఉండే నా మధురమైన అమృతంవంటివాడు, అందమైన కేశపాశాన్ని కలవాడు, అందమైన అధరాన్ని కలవాడు, అందమైన నేత్రాలను కలవాడు, నాభిలో తామర పువ్వులో అందాన్నిపొందినవాడు అయిన స్వామి నేను ధరించిన, "జారిపోని గాజులు" అనే పేరు పడిన, బిగువుగా ఉండే నేను ధరించిన నా చేతిగాజులను నా చేతినుండి జారిపోయేటట్లు చేశాడు.

*** పొంగోదమ్ శూళ్ందన * పువనియుమ్ విణ్ణులగుమ్ *
అంగాదుమ్ శోరామే * ఆళ్ కిట్ట ఎమ్బెరుమాన్ **
శెంగోల్ ఉడైయ * తిరువరంగ చ్చెల్వనార్ *
ఎంగోల్ వళైయాల్ * ఇడర్ తీర్వర్ ఆగాదే? 3*

"నీ"విషయంలో ఉండే ప్రీతి వల్లనే కదా అతడు నీ చేతిలోని గాజులను గ్రహించాడు!" అని కొందరు అనగా, " తన సంపదలో ఒక కొరత ఉండి, దానిని తీర్చుకోవడం కోసంగా నా చేతి గాజులను తీసుకుంటే తప్ప నిలువగలిగినవాడై, వీటిని పొందిన తరువాత తన కొరత తీరినవాడై ఉన్నాడా, స్వామి? కేవలం నన్ను బాధ పెట్టడంకోసం చేసిన పని కదా, ఇది!" అని రోషంతో పలుకుతున్నది.

కెరటాలు పైకి లేచే సముద్రంతో చుట్టబడిన ఈ భూమండలం, పరమపదం– అనే వీటిలో ఎక్కడా కొంచెం కూడా కొరత లేకుండా ఉండే విధంగా నిర్వహిస్తున్న మన స్వామియై, శాసనాన్ని నిర్వహించడంలో సమర్థుడై, శ్రీరంగ నగరంలో పరుండి ఉండేవాడైన శ్రీమంతుడు నా చేతి గాజులతో తన కొరతను అంతటిని తీర్చుకున్నాడు కదా.

*మచ్చణి మాడ * మదిళ్ అరంగర్ వామననార్ *
పచ్చై ప్పశుందేవర్ * తామ్ పణ్ణు నిరేట్ప్ప **
పిచ్చై క్కుళై ఆగి * ఎన్ను డైయ పెయ్ వళై మేల్ *
ఇచ్చై ఉడైయరేల్ * ఇత్తెరువే పోదారే? 4*

"లోకంలో మిగిలిన స్త్రీలు ఎందరో గాజులను ధరించినప్పటికీ, నీ చేతిలోని గాజులనే అతడు గ్రహించడం అనేది నీ విషయంలో అతనికి కల ప్రీతి చేతనే కదా! దీనిని చూసి నీవు ఆనందపడాలి తప్ప, దుఃఖ పడవచ్చునా?" అని దగ్గర ఉండేవారు కొందరు అనగా, "అది సరే, అతనికి నా చేతి గాజులలో ఉండే ప్రీతి నా పట్ల ఉన్నట్టుగా నాకు కనిపించడం లేదే!"అని గోదా దేవి ఇందులో బదులు పలుకుతున్నది. దీని భావం ఏమంటే– "ఇతడు ఆశపడిన గాజులు –అనే కారణంచేతనే వానిని చూసి మనం ఆశ్వాసాన్ని పొందుదాం" అని నేను భావిస్తున్నాను. నా సంబంధం కల గాజులను

కొల్లగొట్టకపోతే ప్రాణాలను ధరించలేనివాడై, ఆ గాజులను కోరి, స్వామి వానిని నా నుండి గ్రహించినవాడైతే, నేను ప్రాణాలను ధరించడం కోసం నా కంటి ముందే నేనుండే వీధిలో ఒకసారి నడువవద్దా! ఆ పని చేసినట్లు తెలియడం లేదే!" అని ఈ పాశురంలోని తాత్పర్యం.

పై అంతస్తులలో అలంకరింపబడిన సౌధాలను, ప్రాకారాలను కల శ్రీరంగంలో ఉండేవాడై, పూర్వం వామనావతారాన్ని ఎత్తినవాడై, పచ్చని రంగును కల దేవుడైన శ్రీ రంగనాథుడు తాను పూర్వం మహాబలి దగ్గర దానజలధారా పూర్వకంగా గ్రహించిన భిక్షలో కొంత కొరత ఉండి, ఆ కొరతను తీర్చుకోవడం కోసం నా చేతిలో నేను ధరించిన గాజులను ఆశ పడినవాడైతే, ఈ వీధి ద్వారా వేంచేయడా?

*పొల్లా కుఱళ్ ఉరువాయ్ * ప్పొఱ్ఱై యిల్ నిరెట్టు *
ఎల్లా ఉలగుమ్ * అళందు కొణ్ట ఎమ్బెరుమాన్ **
నల్లార్గళ్ వాఱ్ఱుమ్ * నళిర్ అరంగ నాగణైయాన్ *
ఇల్లాదోం కైప్పొరుళుమ్ * ఎయ్ దువాన్ ఒత్తుళనే 5*

"నా గాజులనే కాకుండా నా శరీరాన్ని కూడా కొల్లగొట్టేవాడై ఉన్నాడు" అని పలుకుతున్నది.

విలక్షణుడైన వామనమూర్తియై, తన అందమైన చేతిలో భిక్షను స్వీకరించి, అన్ని లోకాలను తన అధీనంలోకి గ్రహించిన స్వామియై, మహాత్ములు నివసించే చల్లని శ్రీరంగంలో ఆదిశేషుడనే పడుకపై కశయమించినవాడైన శ్రీరంగనాథుడు అకించన అయిన నా చేతిలో ఉండే సంపదను (శరీరాన్ని) కూడా కొల్లగొట్టేవాడుగా ఉన్నాడు.

*కైప్పొరుళ్ కళ్ మున్న మే * కైక్కొట్టార్ * కావిరి నీర్
శెయ్ ప్పురళ ఓడుమ్ * తిరువరంగ చ్చెల్వనార్ **
ఎప్పొరుట్కుమ్ నిన్టార్క్కుమ్ * ఎయ్ దాదు * నాన్మఱైయిన్
శొఱ్పొరుళాయ్ నిన్టార్ * ఎన్ మెయ్ ప్పొరుళుమ్ కొణ్టారే 6*

"నా శరీరాన్ని కొల్లగొట్టేవానివల ఉన్నవాడు దానిని కొల్లగొట్టడంకూడా చేశాడు" అని ఈ పాశురంలో పలుకుతున్నది.

కావేరీ నదీజలం పైరు పండే క్షేత్రాలలో అంతట నిండుగా ప్రవహించే విధంగా నీటి సంపద మిక్కిలిగా కల శ్రీరంగంలో వేంచేసి ఉండే శ్రీమంతుడు, ఎంత తక్కువవారికి అయినా సులభుడు, ఉన్నతులకు దుర్లభుడు, నాలుగు వేదాలలో ఉండే సూక్తులకు ప్రతిపాద్యుడై ఉండే శ్రీ రంగనాథుడు ఇంతకుముందే నా చేతిలో ఉండే వస్తువులను అన్నిటిని కొల్లగొట్టేవాని వలె కనిపించి, ఇప్పుడు నా శరీరం అనే వస్తువును కూడా కొల్లగొట్టాడు.

*ఉణ్ణాదు ఉఱంగాదు * ఒలి కడలై ఊడఱుత్తు *
పెణ్ణాక్కై ఆప్పుణ్డు * తాముట్ర్ పేదెల్లామ్ **
తిణ్ణార్ మదిళ్ శూళ్ * తిరువరంగ చ్చెల్వనార్ *
ఎణ్ణాదే తమ్ముడైయ * నన్మైగళే ఎణ్ణువరే 7*

తాను సీతావిని విశ్లేషించి పడిన కష్టాన్ని అంతటిని మరచిపోయి, తన గొప్పతనాన్నే భావించి, నన్ను కష్టపెట్టి, అది తన గొప్పతనంగా స్వామి భావిస్తున్నాడు– అని అంటున్నది.

మహాప్రళయ సమయంలో కూడా నశించని విధంగా దార్ డ్యాన్ని కలిగిన ప్రాకారాలను చుట్టూ కల శ్రీరంగంలో ఉండే శ్రియఃపతి అయిన స్వామి శ్రీరాముడై అవతరించినప్పుడు, సీత అనే ఒక స్త్రీ శరీరంలో ఆశపడి, నిద్ర పోకుండా, భుజించకుండా బాధపడి, కెరటాల విజృంభణలో ఘోషిస్తున్న సముద్రానికి వారధిని కట్టి, ఈ విధంగా పూర్వం తాను పొందిన దైన్యాలను అన్నిటినీ మరచిపోయి, ఇప్పుడు తన గొప్పతనాన్నే ప్రదర్శిస్తున్నాడు.

*** పాశి తూర్త్తు క్కిడంద * పార్ మగట్కు * పణ్డొరు నాళ్
మాశుడంబిల్ నీర్ వారా * మానమిలా ప్పస్తియామ్ **
తేశుడైయ దేవర్ * తిరువరంగ చ్చెల్వనార్ *
పేశి ఇరుప్పనగళ్ * పేర్క్కవుమ్ పేరావే 8*

"తాముట్ట్ర పేదెల్లామ్ఎణ్ణాదే తమ్ముడైయ నన్మైగళే ఎణ్ణువరే" (తాను పొందిన కష్టాలను అన్నిటినీ లెక్క పెట్టకుండా, తన గొప్పతనాన్ని తెలుస్తున్నాడే!) అని అంటూ నీవు ఈ విధంగా బాధపడుతూ భగవంతుని నిందించవచ్చునా? కోల్పోయినవానిని మరచిపోయి, ప్రయత్నం చేసి అయినా అతని గుణాలను భావించి, మనసును నిలుపుకోవచ్చు కదా! "అని దగ్గర ఉండేవారు అనగా, " నేను కూడా అతనిని మరిచిపోయి, ప్రాణాలను ధరించవచ్చునా! అని ప్రయత్నిస్తున్నాను. కాని, నాకు అతనిని మరవడం సాధ్యం కాలేదే!" అని ఇందులో అంటున్నది.

పూర్వం ఒకానొక సమయంలో ప్రళయ సముద్రంలో పాచి పట్టి పడి ఉండే భూదేవి కోసం మురికి అంటుకున్న శరీరంలో జలం కారుతూ ఉన్నప్పటికీ ఏమాత్రం ఏవగింపు లేకుండా ఉండే వరాహరూపాన్ని ధరించిన, గొప్ప తేజస్సును కలవాడైన శ్రీ రంగనాథుడు పూర్వం చెప్పిన మాటలు అనేవి మనసులో మరచిపోవాలని అనుకున్నా మరుపుకు రావడం లేదు.

*కణ్ణాలమ్ కోడిత్తు * క్కన్ని తన్నై క్కైప్పిడిప్పాన్ **
తిణ్ణార్ న్దిరుంద * శిరుపాలన్ తేశ్ఱన్దు **
అణ్ణాందిరుక్కవే * ఆంగవళై క్కైప్పిడిత్త *
పెణ్ణాళన్ పేణుమూర్ * పేరుమ్ అరంగమే 9*

ఈ దశకంలోని మొదటి ఆరు పాశురాలతో గోదాదేవి –తన సొత్తులను స్వామి గ్రహించాడు అని తెలియజేసింది. ఏడవ పాశురంలో– సీతా దేవి అనే స్త్రీ శరీరం విషయంలో ఆశ కలిగి, తాను పడిన పాట్లనులెక్కపెట్టకుండా, నేను పడే కష్టాలను చూచి ఆనందిస్తున్నాడు అని అన్నది. గడచిన పాశురంలో– నేను అతనిని మరిచి ప్రశాంతంగా ఉండి జీవించవచ్చు అని చూచినా, అతని గుణాలను, చేష్టలను నేను మరవడసాధ్యం కాకుండా ఉన్నాయని అన్నది. రుక్మిణి దేవికి కలిగిన ఆటంకాలను పోగొట్టి, ఆమెను అనుగ్రహించిన లీలను ఈ పాశురంలో అనుసంధిస్తూ, "ఈమెకు అనుగ్రహించిన ఈ లీల అందరికీ సహాయపడినట్టే కదా" అని భావిస్తూప్రాణాలను నిలుపుకుంటున్నది.

అర్జునునకు చెప్పిన చరమ శ్లోకాన్ని స్మరించి మనం అందరం నన్ను ఓదార్పును పొందడం వంటిదే ఇది. అందరికీ చెందినవారు ఒకనిని గూర్చి చెప్పిన మాట వారికిచెందినవారికి అందరికీ వర్తిస్తుంది కదా.

వివాహప్రయత్నాలను అన్నిటిని చక్కగా చేసి ముగించి, కల్యాణ వధువైన రుక్మిణి దేవిని పాణిగ్రహణం చేసికోవాలని ఏ సంశయం లేకుండా నిశ్చయంగా భావించిన శిశుపాలుడు తన తేజస్సును కోల్పోయి, ఆకాశాన్ని చూచి నిలచిపోయే విధంగా ఏర్పడిన ఆ సమయంలో, ఆ రుక్మిణి దేవిని పాణిగ్రహణం చేసుకున్నవాడై, స్త్రీజన్మను పొందినవారికి అందరికి స్వామి అయినవాడు అభిమానించి వేంచేసి ఉండే దివ్యదేశంయొక్క తిరునామం శ్రీరంగమే.

*** శెమ్మై ఉడైయ * తిరువరంగర్ తామ్ పణిత్త *
మెయ్మ్మై పెరు వార్త్తై * విట్టుశిత్తర్ కేట్టిరుప్పర్ **
తమ్మై ఉగప్పారైత్ * తాముగప్పర్ ఎన్ను మమ శొల్ *
తమ్మిడైయే పొయ్యానాల్ * శాదిప్పార్ ఆర్ ఇనియే? 10*

ని దశకంలో చివరి పాశురమైన ఇందులో, –నా తండ్రిగారైన పెరియాళ్వార్లు చరమ శ్లోకంలోని అర్థాన్ని విని, అందులో దృఢమైన నమ్మకాన్ని కలిగి ఉండే విషయాన్ని స్మరించి, వారు కన్న పుత్రిక అయినందువల్లనే భగవంతుని అభిమానించిన నన్ను పెరియాళ్వార్లతో ఉండే సంబంధాన్ని, "అభిమానించినవారిని అభిమానించాలి"అనే లోక మర్యాదను అతిక్రమించి, భగవాన్తుడు నన్ను చేయి విడిచేవాడైతే, అతనిని ఎవరు నిర్బంధించడానికి సాధ్యమవుతుంది? అని పలికి దశకాన్ని పూర్తి చేస్తున్నది.

మనసు, వాక్కు, క్రియా అనే మూడు ఒకే విధంగా ఉండడం అనే ఆర్జవగుణాన్ని కలిగిన శ్రీరంగనాథుడు పూర్వం తన నోటితో పలికిన సత్యమైనది, గొప్పతనాన్ని కలిగినది అయిన చరమశ్లోపరూపమైన మాటను నా తండ్రిగారైన పెరియాళ్వార్లు గురుముఖంగా విని, దానిలో చెప్పిన విధంగా మిక్కిలి నమ్మకాన్ని కలిగి ఉన్నారు. "తనను అభిమానించినవారిని తాను అభిమానిస్తాడు" అనే సామెత తన విషయంలోనే

అసత్యమైపోతే, ఆ తరువాత ఆ స్వామిని ఎవరు నియమించగలరు? (ఎవరూ నియమించలేరు) .

పన్నిరణ్డామ్ తిరుమొழి - మట్రిరుందీర్ కట్కు

పైపైన పలు మాటలు చెప్పి ఏమి ప్రయోజనం? భగవంతుని విశ్లేషించి బాధపడిన ఈ గోదాదేవి తనకు రక్షకంగా భావించినవి రెండు విషయాలు. "భక్తులను నేను చేయు విడువను"అని అతడు పలికిన మాట ఒకటి. అది తప్పినప్పటికీ, తప్పనిది పెరియాళ్వారుల కడుపున పుట్టిన సంబంధం అనేది రెండవది ఈ రెండే ఫలిస్తుందా? అని పదవ దశకంలో సందేహాన్ని పొంది, స్వామి వల్లనే ప్రాప్యం సిద్ధిస్తుంది –అని నిశ్చయించుకుని, అది కూడా పూర్తిగా నమ్మడానికి వీలు కాదు, ఎందుకంటే, అతడు స్వతంత్రుడు కనుక. అయినప్పటికీ, అతనికి స్వాతంత్ర్యమే కాకుండా, భక్తులకు వశవై ఉండడం అనే ఇంకొక గుణం ఉన్నది. అందుచేత అతని భక్తులైన పెరియాళ్వార్ల విషయంలో అతనికి కల స్వాతంత్ర్యం నిలువలేదు. అందుచేత వారి సంబంధాన్ని చూస్తే, మనం అతనిని పొందడంలో అడ్డు లేదు– అని పదవ దశకం చివరిలో నిశ్చయించుకున్నది, గోదాదేవి. ఈ విధంగా ప్రథమ పర్వమైన భగవంతుని విడచి, చరమ పర్వమైన పెరియాళ్వార్లను ఆశ్రయించిన ఈమె, పదకొండవ దశకంలో మళ్లీ భగవంతుని ఆశ్రయించడానికి ఏమి కారణం?అని అంటే, ప్రథమ పర్వమైయ్కున భగవంతుని విడువడానికి కారణమైన స్వాతంత్యమే ఇంకొక కోణంలో చూచినపుడు అతనిని ఆశ్రయించడానికి కూడా కారణమవుతుంది. కనుక అతనిని మళ్ళి ఆశ్రయిస్తున్నది. భగవంతుని చూస్తే అతడు గుణాధికుడు. ఈ లోకం అంతా అతని సొత్తు. అటువంటివాడు తన స్వాతంత్రంలో వీటిని చేయి విడచాడు అంటే, అతని గుణాలకు కొరతయేకదా. సొత్తును విడచిపెట్టి వలసి కూడా వచ్చినా. సొత్తుదారుడు తన సొత్తును విడవడానికి ప్రయత్నించడు కదా. అందుచేత భగవంతుని స్వాతంత్రం పొందడానికి సాధనమవుతుందే తప్ప అతనిని కోల్పోవడానికి కారణం అవుతుందా? మన కార్యం పూర్తి చేయాలి– అని అతడు భావించినప్పుడు దానిని ఎవరూ అడ్డుపెట్టలేని విధంగా స్వతంత్రుడై ఉండడం మన ప్రాప్యానికి తగినది కదా" అని ఈ కోణంలో ఆలోచించి, అతని స్వాతంత్ర్యాన్ని పెరియాళ్వారుల కడుపున పుట్టిన పుట్టుక వలె నా మప్రాప్యానికి

సాధనమైనది– అని నిశ్చయించుకొని, "తామురక్కుమ్" అనే గడచిన దశకంలో భగవంతుని ఆశ్రయించింది.

ఈ విధంగా నిశ్చయించుకొని భగవంతుని ఆశ్రయించినప్పటికీ, అతడు వేగంగా వచ్చి తనను సంశ్లేషించి, విశ్లేష దుఃఖాన్ని పోగొట్టడం గోదాదేవి గమనించలేదు. అతడు వచ్చి అనుగ్రహించకపోయినా, అతడు వచ్చేవరకు సహించి ఉండడం ఈమెకు స్వరూపమే అయినా, ఆ విధంగా క్రమాన్ని చూచి సహించగలిగిన స్వభావాన్ని కలిగినది కాదు, ఈమె. అతనిని వేగంగా పొందాలి అనే ప్రాప్య త్వర అనే వేగాన్ని కలిగినది కదా. ఈమె, అతడు వచ్చేవరకు వేచి చూడడం తన స్వరూపానికి తగిన కృత్యమే అయినా, ఈమె ప్రాప్య త్వర ఈమెను ఇప్పుడు ఆ విధంగా సహించి ఉండేటట్లు ఉండనీయడం లేదు కదా. ఈ విధంగా ప్రాప్య త్వర కారణంగా స్వరూపహాని కలిగిన తరువాత, తన స్వరూపానికి తగని కృత్యాలను కూడా చేసి అతనిని చూడాలి –అని ఈమె ప్రయత్నం చేసింది. ఆ విధంగా తానే నడచివెళ్లి, అతనిని దర్శించడానికి అక్కడకు వెళ్ళలేని రీతిలో ఈమెకు బలహాని ఏర్పడింది. అందుచేత, ఇక తన ఇటువంటి బాధపడ తగిన స్థితిని చూచి బాధపడినవారు, భగవంతునివలె, పెరియాళ్వారులవలె తన కార్యాన్ని పూర్తి చేయాలి– అని ఈమె నిశ్చయించుకున్నది. తనను చూస్తే, తాను తన కాళ్లతో నడచి వెళ్లి, అతనిని పొందే శక్తి లేదు. అతడు తన బాధపడ తగిన స్థితిని తెలుసుకొని వచ్చి, తన దర్శనాన్ని ఇచ్చేవాడుగా కనపడలేదు. అందుచేత, తన దగ్గర నిలచి ఉండి, తన ఈ స్థితిని తెలుసుకొని, అతని దగ్గరకు వెళ్లగలిగిన, కాలి బలం కలిగిన వారికి తన కార్యఞ పూర్తి చేయడం వారి బాధ్యత–అని ఈమె భావిస్తున్నది. అటువంటివారిని చూసి, " అతని నివాసాలు అయినందున, నేను పొందదగినవి అయిన మధురానగరం, రేపల్లె మొదలైన చోట్లకు నన్ను తీసుకుని పోయి చేర్చండి" అని ఈ దశకంలో వేడుతున్నది.

*** మట్పిరుందీర్గట్కు అజియలాగా *మాదవన్ ఎన్బదోర్ అన్బు తన్నై *
ఉట్పిరుందేనుక్కు ఉరైప్పదెల్లామ్ *ఊమైయరోడు శెవిడర్ వార్త్తై ***

*పెట్రిరుందాళై ఒళ్ళియవే పోయ్ *పేర్త్తొరు తాయిల్ వళర్ న్ద నంబి *
మఱ్ఱొరుందామఱ్ఱి ళ మడ్డైంద *మదురై ప్పుఅత్తినై ఉయ్ ల్తిడుమిన్ 1*

"భగవంతుని వల్లనే ఫలం సిద్ధిస్తుంది– అని నిశ్చయించుకుంటే అతడు వచ్చేవరకు స్వరూపక్రమాన్ని చూచి సహించాలి కదా! నీవు ఈ విధంగా లొందరపడకూడదు సుమా" అని దగ్గర ఉండేవారు అనగా, "బాధపడ తగిన నా స్థితిని తెలుసుకోకుండా ఏవో కొన్ని మాటలను పలికే మీకు నాతో మాట్లాడడానికి యోగ్యత లేదు. మీ మాటను చెవులతో వినడానికి నాకు యోగ్యత లేదు" అని ఈ పాశురంలో పలుకుతున్నది.

నా స్థితికి విరుద్ధంగా ఉండే మీకు తెలుసుకోవడానికి సాధ్యం కానిదైన, కమాధవుని విషయంలో ఉండే ప్రేమను పొందిన నాకు మీరు చెప్పేది అంతా మూగవారు చెవిటివారిలో చెప్పిన మాట వలె వ్యర్థమైనది. ఇప్పుడు నాకు మీరు చేయవలసినది ఏమి? అంటే, శరీరం క్లేశపడి తనను కన్న తల్లి అయిన దేవకిని విడచిపెట్టి, వేరొక తల్లి అయిన యశోద ఇంటిలో పెరిగినవాడు, మల్ల యుద్ధ భూమిలో మల్లయుద్ధ వీరులు తన దగ్గరకు రావడానికి ముందే తాను ముందుగా వారి దగ్గరకు వెళ్ళినవాడై వారిని ఎదిర్చినవాడైన శ్రీకృష్ణుడు నివసించే మధురానగరం సమీపప్రదేశంలోకి నన్ను తీసుకుని పోయి విడువండి.

*నాణి ఇని ఓర్ కరుమమ్ ఇల్లై *నాల్ అయలారుమ్ అఱింద్ొళిన్దార్ *
పాణియాదెన్నై మరుంది శెయ్ దు *పఱ్ఱు పఱ్ఱాక్క ఉఱుదిరాగిల్ **
మాణి ఉరువాయ్ ఉలగళంద *మాయనై క్కాణిల్ తలై మఱియుమ్ *
ఆణైయాల్ నీర్ ఎన్నై క్కాక్క వేణ్డిల్ *ఆయ్ ప్పాడిక్కే ఎన్నై ఉయ్ ల్తిడుమిన్ 2*

" నీవు ఏమి చేసినా, ఈ విధంగా నిశ్చయంలో అతడు ఉండే చోటును అన్వేషించి పోవడం అతనికి దోషాన్ని కలిగించేదై ఉంటుంది. నీవు అతనికి దోషాన్ని కలిగించవచ్చునా? నీ స్త్రీత్వానికి తగిన ఒద్దికతో ఉండవద్దా!"అని దగ్గర ఉండేవారు

కొందరు అడుగగా, "సిగ్గులో నాకు ఏ ప్రయోజనం లేదు. నన్ను రేపల్లెకు తీసుకుని పోయి చేర్చండి" అని ఇందులో పలుకుతున్నది.

ఇకపై నేను సిగ్గుపడి ఏ ప్రయోజనం లేదు. ఊరిలో ఉండే వారంతా నా విషయాన్ని తెలుసుకున్నారు. అందుచేత సిగ్గుపడి ఏ ప్రయోజనం లేదు. ఏమీ ఆలస్యం లేకుండా ఇక చేయవలసిన పరిహారాన్ని చేసి, ఇప్పుడే నా విరహావస్థకు ముందున్న సంశ్లేషావస్థకు కూడా ముందు ఉండే భగవద్విషయ వాసననే తెలియని దశలో ఉండేదాననుగా నన్ను చేయాలని మీరు అనుకుంటే మీరు నన్ను సత్యంగా రక్షించాలని అనుకుంటే, నన్ను రేపల్లెలోకి తీసుకుని పోయి చేర్చండి. వామన బ్రహ్మచారియై మహాబలి దగ్గరకు వెళ్లి, మూడు అడుగుల నేలను యాచించి, తరువాత త్రివిక్రముడై, లోకాలను అన్నిటిని కొలిచిన స్వామిని సేవించగలిగితే ఈ వ్యాధి నశిస్తుంది.

*తందైయుమ్ తాయుమ్ ఉట్ట్రారుమ్ నిఱ్ఱ *త్తనివழி పోయినాళెన్ను మ్ శొల్లు*
వంద పిన్నై ప్పழி కాప్పరిదు *మాయవన్ వందురు క్కాట్టుగిన్ఱాన్ **
కొందళమాక్కి ప్పరక్కழిత్తు *క్కుఱుంబు శెయ్ వాన్ ఓర్ మగనై ప్పెట్ట్ర *
నందగోపాలన్ కడైత్తలైక్కే *నళ్ళిరుట్టుణ్ ఎన్నై ఉయ్ త్తిడుమిన్ 3*

ఈ యశోద కూడా మన వలె స్త్రీగా పుట్టినది. "ఈమె శ్రీకృష్ణుని సరిగా పెంచలేదు" అని ఈమెలో దోషాన్ని పలికి ఏ ప్రయోజనం లేదు. అతనిని నియమించి పెంచవలసిన బాధ్యత తండ్రియై, నియమించి పెంచడానికి కావలసిన శక్తిని కలిగినవాడై ఉన్నా, ఆ విధంగా నియమించి పెంచకండా ఉండే నందగోపాలుని పాకటిలోకి తీసుకొని పోయి నన్ను చేర్చండి– అని ఇందులో పలుకుతున్నది.

"తండ్రి, తల్లి, ఇంకా ఉండే బంధువులు అందరూ ఉండగా, ఈమె ఒంటరిగా వీధిలో పడింది"అనే మాట లోకంలో వ్యాపించిన తరువాత, ఈ నిందను ఆపడం ఎవరి తరం కాదు. నేను ఒంటరిగా మార్గంలో పోకుండా ఉండడం కూడా సాధ్యం కాదు, ఎందుకంటే, ఆశ్చర్యకరమైన లీలలను కలవాడైన శ్రీకృష్ణుడు నా ఎదురుగా వచ్చి, తన రూపాన్ని చూపించి, నన్ను ఆకర్షిస్తున్నాడే! ఇప్పుడు మీరు చేయవలసినది ఏమి? అంటే,

కన్యలతో తగవులాడి, వారితో తుంటరి పనులను చేసే కొడుకును కన్న తండ్రి అయిన నందగోపాలుని ఇంటి వాకిటిలోకి నడురాత్రిలో నన్ను తీసుకుని పోయి చేర్చండి.

*అంగై త్తలత్తిడై ఆళి కొండాన్ *అవన్ ముగత్తన్ని విళియేనెట్టు *
శెంగచ్చు కొడ్డు కణ్ణాడై ఆర్త్తు *చ్చిఱు మానిడవరై క్కాణిల్ నాణుమ్ **
కొంగై త్తలమ్ ఇవై నోక్కి క్కాణిర్ *గోవిందనుక్కల్లాల్ వాయిల్ పోగా *
ఇంగుత్తై వాళ్వై ఒళియవే పోయ్ *యమునై క్కరైక్కెన్నై ఉయ్ త్తిడుమిన్ 4*

స్వామికి అనన్యార్హశేషభూతను అయిన నన్ను ఇక్కడనుండి తీసుకొని పోయి యమునా నదీ తీరంలో విడచిపెట్టండి –అని అంటున్నది.

" అందమైన శ్రీహస్తంలో సుదర్శనాన్ని ధరించినవాడైన శ్రీకృష్ణుని ముఖంలో తప్ప మిగిలిన వారి ముఖంలో చూడను" అని చక్కని కంచుకం అనే వస్త్రంతో కన్నులను మూసుకొని, క్షుద్ర మానవులను చూస్తే సిగ్గుపడుతున్న నా ఈ వక్షోజాలను, ఓ తల్లులారా! మీరు నిశితంగా గమనించండి. ఈ నా వక్షోజాలు శ్రీకృష్ణుని తప్ప ఇంకొకరిని విడచి చూడద ఇంకొకరి ఇంటి వాకిలి వైపు చూడవు. అందుచేత నేను ఇక్కడ ఉండడాన్ని కోరను. మీరు వెంటనేనన్ను యమునా నదీ తీరానికి తీసుకొని పోయి విడచిపెట్టండి.

*ఆర్క్కుమ్ ఎన్ నోయ్ ఇదు అఱియలాగాదు *అమ్మనైమీర్! తుళ్ది ప్పడాదే *
కార్క్కడల్ వణ్ణన్ ఎన్బాన్ ఒరువన్ *కై కణ్ణ యోగమ్ తడవ త్తిరుమ్ **
నీర్క్కరై నిన్ఱ కడంబై ఏఱి *క్కాళియన్ ఉచ్చియిల్ నట్టమ్ పాయ్ న్దు *
పోర్క్కళమాగ నిరుత్తమ్ శెయ్ ద *పొయ్ కై క్కరైక్కెన్నై ఉయ్ త్తిడుమిన్ 5*

ఈమె పడుతున్న బాధను చూసిన తల్లిలు "ఈమె బాధన ఇటువంటిది" అని భావించి, దానికి తగిన పరిహారాన్ని చేయాలి అని దానికోసం ప్రయత్నించడం ప్రారంభించారు. "నాతో సంబంధం ఉన్నది అనే కారణంమాత్రంతో మీరు నా బాధను తెలుసుకోవడానికి సాధ్యం కాదు సుమా" అని ఇందులో పలుకుతున్నది.

ఓ తల్లులారా! నా ఈ వ్యాధి అనేది ఎటువంటివారికి కూడా తెలియడానికి వీలుకానిది. మీరు కనిపించిన పరిహారం చేసి దుఃఖ పడకుండా, శ్రీకృష్ణుడు కాళింగ మడుగుతీరంలో ఉండే కడిమి చెట్టును ఎక్కి, కాళియుడనే సర్పం పడగలపై అద్వితీయమైన తన నాట్య ప్రకారంలో వ్యాపించి, ఆ సరస్సును యుద్ధభూమి అయ్యేటట్లు నర్తనం చేసిన ఆ మడుగు తీరానికి నన్ను తీసుకుని పోయి చేర్చండి. నీల సముద్రంవంటి వర్ణాన్ని కలిగినవాడైన శ్రీకృష్ణుడు తన చేతితో నన్ను స్పృశిస్తే, నా ఈ వ్యాధి తీరిపోతుంది. ఇదే ప్రత్యక్షంగా ఫలించదగిన ఉపాయం.

*కార్ తృణ్ముగిలుమ్ కరువిళైయుమ్ *కాయా మలరుమ్ కమల ప్పూవుమ్ *
ఈర్తిడుగిన్ఱన ఎన్నై వందిట్టు *ఇరుడీకేశన్ పక్కల్ పోగే ఎన్ఱు **
వేర్త్తు ప్పశిత్తు వయిఱైందు *వేణ్డిశిల్ ఉణ్ణుమ్ పోదు * ఈదెన్ఱు
పార్త్తిరుందు నెడునోక్కు క్కొళ్ళుమ్ *పత్తవిలోశనత్తు ఉయ్ త్తిడుమిన్ 6*

శ్రీకృష్ణుడు ఋషిపతుల అన్నాన్ని అనుగ్రహించిన చోటు అయిన బద్ధవిలోచనంలోకి నన్ను తీసుకుని పోయి చేర్చండి– అని అంటున్నది.

వర్షాకాలంలోని చల్లని మేఘం, నల్లకలువ, అగిసెపువ్వు, తామర పువ్వు అనే ఇవి ఎదురుగా వచ్చి నిలచి, " శ్రీకృష్ణ స్వామి దగ్గరకు నీవు కూడా వెళ్ళు" అని నన్ను బలవంతం చేస్తున్నవి. అందుచేత, గోవులను మేపడంచేత శ్రమను పొంది, సౌకుమార్యంవల్ల బాధపడి, కడుపులో చాలా ఆకలి కాగా "కోరిన ప్రసాదాన్ని భుజించవలసిన కాలం ఇది" అని ఋషిపత్నుల రాకను ఎదురుచూసి, అందుకోసం చిరకాలం కటాక్షిస్తూ ఉండే చోటు అయిన బద్ధవిలోచనం అనే స్థానంలోకి నన్ను తీసుకొని పోయి చేర్చండి.

*వణ్ణమ్ తిరివుమ్ మనమ్ కుழైవుమమ *మానమిలామైయుమ్ వాయ్ వెళుప్పుమ్ *
ఉణ్ణల్ ఉఱామైయుమ్ ఉళ్ మెలివుమ్ *ఓదనీర్ వణ్ణన్ ఎన్నాన్ ఒరువన్ **
తణ్ణమ్ తుழాయ్ ఎన్ను మ్ మాలై కొణ్డు *శూట్ట త్తణియుమ్ పిలంబన్ తన్నై *
పణ్ణழియ బ్బలదేవన్ వెన్ఱ *పాడ్డి వడత్తైన్నై ఉయ్ త్తిడుమిన్ 7*

"స్వామిని విశ్లేషించినందువల్ల నీకు కలిగిన మార్పు దేనివల్ల తీరుతుంది?" అని తల్లులు మొదలైనవారు ప్రశ్నించగా, " అతని తులసీమాలికను అలంకరించుకుంటేనే అది తీరుతుంది, కనుక, అతడు విజయమాలను అలంకరించుకునే చోటుకు నన్ను తీసుకొని పోయి చేర్చండి" అని అంటున్నది.

నా శరీరవర్ణంలోని మార్పు, మనసులోని క్లేశం, మానం నశించిన రీతి, అధరం తెల్లబడడం, ఆహారరుచి లేకపోవడం, యానం జ కృంగిపోవడమనే ఇవి అన్నీ ఎప్పుడు లేకుండా పోతాయి? అని అంటే, సముద్ర వర్ణుడని ప్రసిద్ధుడై, సాటిలేని వాడైన శ్రీకృష్ణుని చల్లని అందమైన తులసిమాలికను తీసుకొని వచ్చి అలంకరించినప్పుడే తీరుతుంది. ఆ తులసీ మాలను మీరు ఇక్కడకు తీసుకొని వచ్చి నాకు ఇవ్వడానికి సాధ్యమైతే, బలరాముడు ప్రలంబాసురుని ఎముకలు రూపు లేకుండా పోయేటట్లు వధించిన చోటు అయిన పాండీరమనే వటవృక్షం దగ్గరకు నన్ను తీసుకుని పోయి చేర్చండి.

*కట్టినమ్ మేయ్ క్క లుమ్ మేయ్ క్క ప్పెట్టాన్ *కాడు వాళ్ శాదియుమ్ ఆగ ప్పెట్టాన్ *
పట్టి ఉరలిడై ఆప్పుమ్ ఉణ్ణాన్ *పావిగాళ్! ఉంగళుక్కే చ్చు క్కొలో? **
కట్టున పేశి వశవుణాదే *కాలిగళ్ ఉయ్య మణ్ణై తడుత్తు *
కొట్టు క్కుడైయాగ ఏంది నిన్ఱ *గోవర్త్తనత్తైన్నై ఉయ్ త్తిడుమిన్ 8*

"స్వామి యొక్క గుణాలను దోషాలుగా ఆరోపించి పలికి, నా దగ్గర దూషణాలను పొందకుండా, మీరు, అతడు గోవర్ధనాన్ని ఎత్తి గోసమూహాన్ని కాచిన గోవర్ధనం దగ్గరకు నన్ను తీసుకుని పోయి చేర్చండి" అని అంటున్నది. ఈమె పడే పాదన చూచి, అతనిలో దోషాలను ఆరోపించి పలికితే ఈమె తన అవభినివేశాన్ని విడుస్తుందా! అని భావించి, దగ్గర ఉండేవారు స్వామిలో దోషాలను ఆరోపించి పలుకగా, వారిని చూచి ఈమె పలికే బదులు, ఈ పాశురం.

శ్రీకృష్ణుడు లేగ దూడల సమూహాలను మేపడమే కృత్యంగా కలిగినవాడు. ఇంటిని వదిలిపెట్టి అరణ్యంలోనే నివసించే రీతిలోని గొల్ల జాతిలో పుట్టాడు. వెన్నదొంగతనంలో పట్టుబడి రోటికి కట్టుబడ్డాడు. అవధిలేని సౌలభ్య గుణాన్ని తెలియజేసే ఈ లీలలు,

గుణాన్ని దోషంగా గ్రహించేవారలారా! మీకు దూషణానికే కారణమయ్యయా? ఇంతవరకు మీరు దోషాలుగా చెప్పినవి ఉండనివ్వండి. ఇకపై అయినా, మీరు నేడ్చిన విద్యలను పలికి నా దగ్గర తిట్లు తినకుండా, పశువులు రక్షింపబడేటట్లుగా ఇంద్రుడు కురిపించిన వర్షాన్ని అడ్డుకొని, విజయధ్వజంగా (ఏ లోటు లేని ధ్వజంగా) శ్రీకృష్ణుడు ధరించిన గోవర్ధన పర్వతం దగ్గరకు నన్ను తీసుకొని పోయి చేర్చండి.

*కూట్టిల్ ఇరుందు కిళి ఎప్పోదుమ్ *గోవిందా! గోవిందా! ఎన్ఱళైక్కుమ్ **
ఊట్టు క్కొడాదు శెఱుప్పన్ ఆగిల్ *ఉలగళందాన్ ఎన్ఱుయర కూవుమ్ **
నాట్టిల్ తలై ప్పళి ఎయ్ దు *ఉంగళ్ నన్మై ఇళ్దు తలై ఇడాదే *
శూట్టుయర్ మాడంగళ్ శూళ్ందు తోన్ఱుమ్ *తువరాపదిక్కెన్నై ఉయ్ త్తిడుమిన్ 9*

మీకు నింద రాకుండా ఉండాలంటే నన్ను ద్వారక దగ్గరకు తీసుకుని పోయి చేర్చండి —అని అంటున్నది.

నేను పెంచిన చిలుక గూటిలో ఉండి, సర్వకాలం "గోవిందా! గోవిందా!" అని కూస్తున్నది. తిండి పెట్టకుండా ఉపవాసం ఉండేటట్లు దానికి బాధ కలిగిస్తే, "లోకాలను కొలిచిన స్వామీ!" అని బిగ్గరగా కూస్తున్నది. ఈ తిరునామాలు నా చెవిలో పడినప్పుడే నేను మోహాన్ని బాధపడుతున్నాను. అందుచేత, ఈ లోకంలో పెద్ద అపవాదును సంపాదించి, మీరు మీకున్న మంచి పేరును చెడగొట్టుకొని, తరువాత ఎవరికీ ముఖాన్ని చూపించలేక, తలవంచుకొని నిలువవలసిన అవసరం లేకుండా ఉండేటట్లు, మిక్కిలి ఉన్నతమైన సౌధాలను చుట్టూ కలిగి ప్రకాశిస్తున్న ద్వారకకు నన్ను తీసుకొని పోయి చేర్చండి.

*** మన్ను మదురై తొడక్కమాగ *వణ్ణువరాపది తన్న ళవుమ్ *
తన్నై త్తమర్ ఉయ్ త్తు పెయ్య వేణ్డి *త్తాళ్కుళలాళ్ తుణింద తుణివై **
పొన్ని యల్ మాడమ్ పొలిందు తోన్ఱుమ్ *పుదువైయర్ కోన్ విట్టుశిత్తన్ కోదై *
ఇన్ని శైయాల్ శొన్న శెంజొల్ మాలై *ఏత్త వల్లార్క్కిడమ్ వైకుందమే 10*

తనను తీసుకుని పోయి దివ్యదేశాలలో చేర్చమని తన బంధువులతో పలికుతూ గోదాదేవి నిర్ణయాన్ని తెలియజేసే ఈ దశకాన్ని అనుసంధించగలిగినవారు అర్చిరాది మార్గంలో శ్రీ వైకుంఠాన్ని చేరగలరు– అని ప్రయోజనాన్ని పలుకుతూ ఈ దశకాన్ని ముగిస్తున్నది.

బాగా పొడుగుగా వేలాడే కేశపాశాన్ని కలిగినదై, బంగారు మయమైన సౌధాలతో ప్రకాశి ప్రకాశిస్తున్న శ్రీవిల్లి పుత్తూరుకు నాథులైన పెరియాళ్వార్ల పుత్రిక గోదాదేవి– శ్రీమధుర మొదలుకొని, శ్రీ ద్వారకవరకు చెప్పబడిన అన్ని దివ్యదేశాలలోకి, తనను తన బంధువులు తీసుకొని పోయి చేర్చాలని కోరి, చేసికొన్న నిర్ణయం విషయంగా, మధురమైన రాగాలతో కూడి ఉండేటట్లు, అనుగ్రహించిన అందమైన వాగ్మాల అయిన ఈ దశకాన్ని అనుసంధించగలిగినవారు నివసించే చోటు పరమపదమే.

పదిన్ మున్రామ్ తిరుమొழి - కణ్ణన్ ఎన్నుమ్

గడచిన దశకంలో స్వామి అభిమానించిన, ఉత్తర మధుర మొదలైన చోట్లకు తనను తీసుకొని పోయి చేర్చాలని తల్లులు మొదలైనవారిని గోదాదేవి కోరింది. ఈమె పడే పాట్లను చూసి అనుసంధించేవారికి ఈమెను పిలుచుకొని పోయే అవధిలో కాలి బలం లేదు కదా! శ్రమపడి తీసుకొని పోవాలని అనుకున్నా, ఈమెను పడుకలో పరుండబెట్టి మోసుకుంటూ పోవాలి కదా! ఆ విధంగా మూసుకుని పోవాలని తలచిన అక్కడికి పోయి చేరేవరకు ఈమె ప్రాణాలు ధరించి ఉంటుంది అని చెప్పడానికి సాధ్యం కాదు. అందుచేత వారు ఈమెను తీసుకొని పోవడానికి సందేహించారు. అప్పుడు గోదాదేవి వారిని చూసి, " అతనికి దూరమై నేను పడే పాట్లను తెలిసి, నన్ను ప్రాణాలను ధరించేనట్లు చేయాలి అని మీరు భావించినట్లయితే, అతనితో సంబంధాన్ని కల ఒక వస్తువును తీసుకుని వచ్చి, దానికి నాతో సంబంధాన్ని కలిగించి, నా ప్రాణాలు పోకుండా ఉండేటట్లు రక్షించడానికి ప్రయత్నించండి" అని ఈ దశకంలో పలుకుతున్నది.

ఈమె స్థితిని గమనించిన తల్లి మొదలైనవారు "శ్రీకృష్ణుని దర్శించడంలోనే కాలక్షేపం చేసే, నీవు నిజానికి క్లేశాన్ని పొందడం తగినదా? ఒకవేళ విశ్లేషంవల్ల బాధను పొందినా, ఈ విధంగా ప్రాణాలను ధరించి లేని విధంగా బాధపడవచ్చునా? అతని రాకను ఎదురుచూచే నువ్వు వంశ గౌరవాన్ని కాపాడవద్దా? "ఈమెను ఈ విధంగా బాధపడేటట్లు చేశాడు" అని అతనికి కలిగే నిందను నీవు నివారించవద్దా? అని ఈమెను ప్రశ్నించగా, " మీరు మీ వంశానికి కలిగే నిందను లేకుండా చేయడం కోసం చెప్పే మాట, అతనిని పొందితే తప్ప నిలువ లేని నా ప్రాప్యత్వరకు పొసగేది కాదు. నన్ను నశించి పోకుండా కు రక్షించాలి– అనే భావం మీకు ఉంటే, అతనికి సంబంధం పొందిన ఒక వస్తువును తీసుకుని వచ్చి, దానిలో నాకు సంబంధం కలిగించి, నన్ను రక్షించడానికి చూడండి– అని దశకంలో గోదాదేవి పలుకుతున్నది.

*** కణ్ణన్ ఎన్ను మ్ కరుందెయ్ వమ్ * కాట్పి పుగ్గి క్కిడప్పైనై *
పుణ్ణిల్ పుళి పెయ్ దాఱ్ఱోల * ప్పుఱ నిన్రు అగ్గు వేశాదే **
పెణ్ణిన్ వరుత్తమ్ అఱియాద * పెరుమాన్ అరైయిల్ పీతగ
వణ్ణ ఆడై కొణ్డు * ఎన్నై వాట్టుమ్ తణియ విశిరే 1

స్వామి తన నడుములో అలంకరించుకున్న పీతాంబరాన్ని తీసుకుని వచ్చి, నా శ్రమ తీరేటట్లుగా వీచండి –అని ఇందులో అంటున్నది.

శ్రీకృష్ణుడనే నల్లని ఒక పరదేవత యొక్క దర్శనంలో అలవాటు పడిన నన్ను గూర్చి, ఓ తల్లులారా! మీరు వేరుగా భావిస్తూ, పుండులో చింత పండు రసాన్ని పోసినట్లుగా, హితవాక్యాలను పలకడం మానివేసి, స్త్రీజన్మను ఎత్తినవారి బాధను తెలియనివాడైన శ్రీ కృష్ణుని నడుముకు అలంకరింపబడిన పీతాంబరాన్ని తీసుకొని వచ్చి, నా విరహతాపం తీరేటట్లు నాపై వీచండి.

పాల్ ఆలిలైయిల్ తుయిల్ కొణ్ణ * పరమన్ వలైప్పట్టిరుందేనై *
వేలాల్ తున్ను మ్ పెయ్ దాపోల్ * వేణ్డిట్రొల్లామ్ వేశాదే **
కోలాల్ నిరై మేయ్ త్తు ఆయనాయ్ * క్కుడందై క్కిడంద కుడమాడి *
నీలార్ తణ్ణమ్ తుళాయ్ కొణ్డు * ఎన్ నెఱిమెన్ కుழల్ మేల్ శూట్టీరే 2

స్వామి ధరించిన తులసిమాలను తీసుకుని వచ్చి నా కేశాలలో అలంకరించండి –అని అంటున్నది.

చాలా లేత వయస్సులో ఉండే మర్రి ఆకులో నిద్రించిన స్వామి విసరిన వలలో చిక్కుకున్న నన్ను, వేలాయుధంతో బాధించినట్లుగా, కఠినమైన, మీకు తోచిన రీతిలో పల్కడం మానివేసి, గోపాలకుడై, గోపాలనానికి తగిన ముల్లు కర్రను తీసుకుని పశువుల సమూహాన్ని వేపినవాడై, కుంభకోణ క్షేత్రంలో నిద్రించేవాడై, కుంభ నృత్యాన్ని చేసినవాడైన శ్రీకృష్ణుని పచ్చని వర్ణాన్ని కలిగిన, చల్లని, అందమైన తులసిని తీసికొని వచ్చి, గుండ్రని, మృదువైన నా కేశాలలో అలంకరించండి.

*కంజైప్ క్కాయ్ న్ద కరువిల్లి * కడైక్కణ్ ఎన్ను మ్ శిఱై క్కోల్ *
నెంజూడురువ వేవుణ్ణు * నిలైయుమ్ తళర్ న్దు నైవేనై **
అంఱేల్ ఎన్నా న్ అవనొరువన్ * అవన్ మార్వణింద వనమాలై *
వంజియాదే తరుమాగిల్ * మార్విల్ కొణర్ న్దు పురట్టీరే 3*

అతని కటాక్షాలు అనే బాణాలు తగిలి వాటి వేడిమిలో బాధపడుతున్న నా మనస్సు చల్లబడేటట్లు అతని వక్షఃస్థలంలో అలంకరించుకొన్న వనమాలను తీసుకొని వచ్చి, నా గుండెలపై పొరలించండి– అని పలుకుతున్నది.

కంసుని వధించినవాడు, పెద్ద విల్లువంటి కనుబొమలను కలిగినవాడై ఉండే శ్రీకృష్ణుని కటాక్షాలు అనే రెక్కలను కలిగిన బాణాలతో మనస్సు అంతా ప్రయోగింపబడి జ్వలిస్తున్న దశను ఉంది బాధపడుతూ ఉండేది నన్ను చూచి "భయపడవద్దు "అనే ఒక మాటను చెప్పనివాడై, విజాతీయుడైన ఆ స్వామి తన వక్షస్సులో అలంకరించుకున్న వనమాలను మోసం చేయకుండా ఇచ్చేవాడైతే, ఆ మాలను మీరు తీసుకొని వచ్చి, నా గుండెలపై, నా మనసులో ఉండే తాపం తీరేటట్లు, పొర్లించండి.

*ఆరే ఉలగత్తు ఆట్టువార్? * ఆయర్పాడి కవర్ న్దుణ్ణుమ్ *
కారేఱుక్క ఉఱుక్కుణ్ణు * తళర్ న్దుమ్ ముఱిందుమ్ కిడప్పేనై **
ఆరావముదమ్ అనైయాన్ తన్ * అముద వాయిల్ ఊఱియ *
నీర్ తాన్ కొణర్ న్దు పులరామే * పరుక్కి ఇళైప్పై నిక్కి రే 4*

మాధవుని అదరామృతాన్ని నేను పానం చేసేటట్లు చేసి, నా ఆర్తిని తీర్చండి –అని పలుకుతున్నది.

రేపల్లెను అంతా కొల్లగొట్టి అనుభవిస్తున్న, అద్వితీయమైన కారెద్దు వంటి శ్రీకృష్ణుడు బాధించగా, దానివల్ల క్లేశాన్ని పొంది, పలు రీతులలోన బాధలను పొందిన నన్ను, ఈ లోకంలో పోరాడింపు వచనాలను పలికి నన్ను చేసేవారు ఎవరున్నారు ఎవరు లేరు (అని గోదాదేవి అనగా, మేమున్నాము కదా అమ్మా! నీకు ఏమి చేయాలి? అని తల్లి అడుగగా) , ఎంత అనుభవించినప్పటికీ తృప్తి కలుగని అమృతంవంటి

శ్రీకృష్ణుని అమృతం స్రవించే అధరంలో ఊరే రసాన్ని తీసుకొని వచ్చి, నా శరీరం అంతా ఎండిపోకుండా ఉండేటట్లు, నేను దానిని పానంచేసేటట్లు చేసి, నా ఆయాసాన్ని పోగొట్టండి (అని గోదాదేవి అంటున్నది) .

*అళిలుమ్ తొళిలుమ్ ఉరు క్కాట్టాన్ * అంజేల్ ఎన్నా న్ అవన్ ఒరువన్ *
తళ్ళవి ముళ్ళరి పుగుందెన్నై * చ్చుట్టి చ్చుళ్ళుం పోగానాల్ **
తళైయిన్ పొళిల్ వాయ్ నిరై ప్పిన్నై * నెడుమాల్ ఊది వరుగిన్ర *
కుళలిన్ తొళై వాయ్ నీర్ కొణ్డు * కుళిర ముగత్తు త్తడవీరే 5*

నాయకి అయిన నాకు తగినది అయిన అధరామృతం లభించకపోయినా, అతడు వేణువును ఊదినపుడు వేణువు రంధ్రాలద్వారా భూమిపై వ్యర్థంగా కారే నీటిని అయినా తీసుకుని వచ్చి, నా ముఖంలో చల్లగా తడవండి –అని అంటున్నది.

ఏడ్చినా, నమస్కరించినా తన రూపాన్ని చూపించనివాడు, తన రూపాన్ని చూపించకపోయినా, "భయపడవద్దు" అనే ఒక మాటను చెప్పనివాడైన ఒక మహానుభావుడు (అయిన శ్రీకృష్ణుడు) ఇక్కడకు వచ్చి, నన్ను గట్టిగా ఆలింగనం చేసుకొని, ముందు వెనక చుట్టుకొని నన్ను విడచిపెట్టి పోకుండా ఉన్నాడే!అయ్యో! నెమలిపింఛంతో చేసిన గొడుగులు అనే విధంగా ఉండే తోటల కింద పశువుల సమూహాల వెనుక భాగంలో మిక్కిలి వ్యామోహాన్ని కలిగిన శ్రీకృష్ణుడు ఊదుతూ వచ్చే పిల్లనగ్రోవి రంధ్రాల నుండి కారే రసాన్ని తీసుకొని, వచ్చి నా ముఖంలో చల్లగా తడవండి.

*నడై ఒన్ఱిల్లా ఉలగత్తు * నందగోపన్ మగన్ ఎన్ను మ్ *
కొడియ కడియ తిరుమాలాల్ * కుళప్పుక్కు ఱు కొళప్పట్టు **
పుడైయుమ్ పెయరకిల్లేన్ నాన్ * పోక్కున్ మిదిత్త అడిప్పాట్టిల్ *
పొడి త్తాన్ కొణర్ న్దు పూశిర్గళ్ * పోగా ఉయిర్ ఎన్ ఉడంబైయే 6*

సిగ్గు లేనివాడైన ఆ శ్రీకృష్ణుని శ్రీ పాదాలలోని చూర్ణాన్ని అయినా తీసుకుని వచ్చి, నేను ప్రాణాలను ధరించేటట్లు నా శరీరానికి పూయండి– అని అంటున్నది.

ఇంతకుముందే మర్యాదలను అన్నిటినీ అతిక్రమించిన ఈ లోకంలో నందగోపాలు కుమారుడు అనే పేరుతో ప్రసిద్ధుడై, దయ లేనివాడై, కఠినుడైన లక్ష్మీనాథునిచే

(శ్రీకృష్ణునిచే) అబలను అయిన నేను చాలా బాధ పెట్టబడి, ఈ విధంగా, ఆ విధంగా ఈ విధంగాకూడా కదలడానికి శక్తి లేనిదాననై ఉన్నాను. అందువల్ల, సిగ్గులేనివాడైన, ఆ శ్రీకృష్ణుని పాదాలు పడిన చోట ఉండే పాద రజస్సును అయినా తీసుకొని వచ్చి, విడచి వెళ్లకుండా ఉండే ప్రాణాలను కలిగిన నా శరీరంలో పూయండి.

*వెట్పి క్కరుళ క్కొడియాన్ తన్ * మిమిదాడా ఉలగత్తు *
వెట్పు వెఱిదే పెట్పు తాయ్ * వేంబేయాగ వళర్త్తాళే **
కుట్పుమట్పు ముళై తన్నై * క్కుమరన్ కోల ప్పణై త్తోళోడు *
అట్పు కుట్పుమ్ అవై తీర * అణైయ అముక్కి క్కట్టీరే 7*

" న జీవేయం క్షణమపి వినా తామసితేక్షణామ్" (నల్లని, అందమైన కన్నులను కలిగిన ఆ సీతాదేవిని విడచి నేను ఒక్క క్షణం కూడా జీవించలేను) అనే విధంగా, తానే నా విషయంలో మిక్కిలి అభినివేశాన్ని చూపించి, నా దగ్గరకు వచ్చి, ఆలింగనం చేసుకోకపోయినా, మీరు నన్ను తీసుకుని పోయి, అతని బాహువులలో నా వక్షఃస్థలం ఆలింగనం చేసికొనే టట్లు కట్టివేసినా చాలు. అందుచేత ఆ పనిని చేయండి– అని అంటున్నది.

గరుడుని విజయధ్వజంగా కలిగిన స్వామి ఆజ్ఞను మీరి వర్తించలేని ఈ లోకంలో అతనిని పొందిన తల్లి అయిన యశోద తన పుత్రుని ఎవరికీ ఉపయోగం లేకుండానే అనేది మాత్రమేనా, వ్యర్థంగా, చేదుగా ఉండేటట్లుగా అతనిని పెంచుతున్నది. అతనిని కాక ఇంకొకనిని కోరడం– అనే దోషం లేని నా వక్షోజాలను యవ్వనంలో కూడిన ఆ స్వామి యొక్క అందమైనవి, కల్పవృక్షాల శాఖల వలె ఉండేవి అయిన బాహువులలో, వాటి కోసమే పెట్టి పుట్టిన వాని దోషం తీరేటట్లు, గట్టిగా అదిమి కట్టి వేయండి.

*ఉళ్ళె ఉరుగి నైవేనై * ఉళళో ఇలళో ఎన్నా ద *
కొళ్ళె కొళ్ళి క్కుఱుంబనై * గ్గోవర్త్తననై క్కణ్ణక్కాల్ **
కొళ్ళుమ్ పయన్ ఒన్ఱిల్లాద * కొంగై తన్నై క్కిళ్ళిక్కోడుమ్ *
అళ్ళి ప్పఱిత్తిట్టువన్ మార్విల్ ఎఱిందు * ఎన్ అళ్లై తీర్వేనే 8*

నన్ను బహిష్కరించిన అతనిని చూస్తే, ఉపయోగం లేని నా స్తనాలను పెరికి, అతని వక్షస్సులోకి విసరి, నా దుఃఖాన్ని తీర్చుకుంటాను– అని అంటున్నది.

లోలోపల కరిగి బాధపడుతున్న నన్ను చూచి, " ఈమె ఉన్నదా? లేదా?" అని కూడా అడుగనివాడై, నా సర్వస్వాన్ని అపహరించినవాడై, స్త్రీల విషయంలో దుర్మార్గం చేసేవాడైన శ్రీకృష్ణుని ఒకవేళ చూడగలిగితే, మేక స్తనాల వలె ఉపయోగం లేకుండా ఉండే నా ఈ వక్షోజాలను సమూలంగా పట్టి పెరికి, ఆ శ్రీకృష్ణుని వక్షస్సులో విసరి కొట్టి, నా దుఃఖాన్ని పోగొట్టుకుంటాను.

*కొమ్మై ములైగళ్ ఇడర్ తీర * గ్గోవిందఱ్కో ర్ కుట్రేవల్ **
ఇమ్మై ప్పిఱవి శెయ్యాదే * ఇని ప్పోయ్ శెయ్యుమ్ తవమ్ తాన్ ఎన్? **
శెమ్మై ఉడైయ తిరుమార్విల్ * శేర్త్తానేలుమ్ ఒరు నాళ్ *
మెయ్మ్మ శొల్లి ముగమ్ నోక్కి * విడై తాన్ తరుమేల్ మిగ నన్రే 9*

"స్తనాలను సమూలంగా పట్టిపెరికి "అని ఈ విధంగా చాలా కఠినంగా మాట్లాడవచ్చునా? ఈ వక్షోజాలకు ఆధారంగా ఒక ఆత్మ వస్తువు ఉన్నది అని అంటే, దానికి అంతర్యామి అయినా భగవానుని గూర్చిన అనుభవం ఉన్నది కదా. సాధనానుష్ఠానాన్ని చేసి, దానిని పొందాలని ప్రయత్నించవచ్చు కదా" అని దగ్గర ఉండేవారు అనగా, " ఇప్పుడు పొందిన ఈ శరీరంలో అనుభవించాలని ఆశపడిన నాకు ఈ శరీరాన్ని విడచి, అంతకంటే వేరైనా ఇంకొక శరీరాన్ని గ్రహించి, ఒక ప్రయోజనాన్ని పొందడం కోసమై సాధనాన్ని అనుష్ఠించడం అనేది నాకు అక్కరలేదు" అని అంటున్నది.

పైకి పెరిగి బాగా పెద్దవి అయిన నా వక్షోజాల ఆశ తీరేటట్లు శ్రీకృష్ణునకు అద్వితీయమైన అంతరంగ కైంకర్యాన్ని ఈ జన్మలోనే చేయలేకుండా, ఈ జన్మ తీరిన తరువాత, వేరొక దేశానికి పోయి చేసే తపస్సు ఎందుకోసం? భక్తులు సంశ్లేషించడం కోసంగానే ఏర్పడి ఉండడమనే ఋజుత్వాన్ని కలిగినదైన తన తన వక్షస్సులో నన్ను అతడు సంశ్లేషిస్తే, అది మంచిది. నా ముఖాన్ని చూచి, నిజాన్నే పలికి, " నీవు నాకు

అక్కర్లేదు, పో" అని గెంటి వేయడం లోచేటట్లుగా బదులును పలికినవాడైతే, అది ఇంకా మంచిది.

*** అల్లల్ విళైత్త పెరుమానై * ఆయర్పాడిక్కు అణివిళక్కై **
*విల్లి పుదువై నగర్ నంబి * విట్టుశిత్తన్ వియన్ కోదై ***
*విల్లై త్తోళైత్త పురువత్తాళ్ * వేట్కై ఉట్ట్రు మిగ విరుంబుమ్ **
*శొల్లై త్తుదిక్క వల్లార్గళ్ * తున్ప క్కడలుళ్ తువళారే 10*

ఈ దశకాన్ని అభ్యసించినవారు నావలె బాధపడకుండా, ఆనందాన్ని పొందుతారు– అని దశక ప్రయోజనాన్ని పలికి, దశకాన్ని ముగిస్తున్నది.

వింటిని జయించిన కనుబొమలను కలిగినది, శ్రీవిల్లి పుత్తూరు నాయకులైన పెరియాళ్వార్ల పుత్రిక ఆశ్చర్యకరమైన గుణాలతో ప్రకాశించే గోదాదేవి, రేపల్లెలో అంతటా బాధను కలిగించి, దానివల్ల గొప్పతనాన్ని పొందినవాడు, రేపల్లెకు మంగళ దీపంవలె ప్రకాశకుడై ఉండే శ్రీకృష్ణునిఆశపడి, ఉపశమించని, శ్రీకృష్ణుని శరీరంలో తనకు గల ప్రేమ స్ఫురించేటట్లుగా పలికిన ఈ పాశురాలను పొగడి, అధ్యయనం చేయగలిగినవారు సంసార సముద్రంలో చిక్కుకొని బాధపడరు.

పదినాలామ్ తిరుమొழి - పట్టి మేయ్ న్దు

గోదాదేవికి తిరుప్పావై నుండి ఆరంభించి, గడచిన దశకం వరకు పలు విధాలైన మానసిక పరిపాకాలు ఏర్పడి, భక్తి పరిణతిని పొందిన విషయం చెప్పబడింది. ఈ దశకంలో అది పరమ భక్తిగా పరిణమించి, భగవత్ప్రాప్తి ఏర్పడి, పూర్ణతను పొందడం చెప్పబడుతున్నది. తిరుప్పావై లో "నారాయణనే నమక్కే పఱై తరువాన్" (నారాయణుడే మనకే ప్రాప్యాన్ని అనుగ్రహిస్తాడు) హారం గురించి గొప్పగా భక్తులను చివరిలో "కఱవైకళ్" (27) అనే పాశురంలో సాధనాన్ని, " శిఱ్రమ్ శిఱు కాలే" (29) అనే పాశురంలో ప్రాప్యాన్ని తెలిపింది. ఈ విధంగా తిరుప్పావైలో ప్రాప్యప్రాపకాలను నిర్ణయించి పలికింది. అయితే ఆ ప్రయోజనాన్ని అప్పుడే పొందలేనందువల్ల మోహాన్ని పొందినది.

నాచ్చియార్ తిరుమొழిలోని మొదటి దశకమైన "తైయిరు తింగళుమ్" లో కాముని పాదాలపై పడి నోము నోచింది. "నామమాయిరమ" అనే తరువాత దశకంలో బొమ్మరిళ్ళను కట్టి ప్రాప్యాన్ని పొందడానికి ప్రయత్నం చేసింది. "కోழி అழைప్పదన్ మున్నమ" అనే అనంతర దశకంలో చన్నిళ్ళలో స్నానం చేసి, " తెళ్ళియార్" అనే నాలుగవ దశకంలో కూడిక ధైవాన్ని ప్రశ్నించి, " మన్ను పెరుమమ్ పుగழ్" అనే ఐదవ దశకంలో కోకిలను ప్రశ్నించి ప్రయోజనాన్ని పొందాలని చూసింది. వీటివల్ల భగవంతుని సాక్షాత్తుగా దర్శించాలి అనే ఆశ కలిగి, అప్పుడే ఆ విధంగా దర్శించలేనందువల్ల "వారణమాయిరమ్" అనే ఆరవ దశకంలో శ్రీకృష్ణునిలో వివాహం చేసుకున్నట్లుగా తాను కలలో అనుభవించినట్లు పలికి, ప్రాణాలను నిలుపుకొన్నది. అది అంతా స్వప్నంలో అనుభవమై స్పష్టంగా లేనందువల్ల "కరుప్పూరమ్ నాఱుమో"అనే ఏడవ దశకంలో భగవదనుభవానికి దారి చూపించే శ్రీ పాంచ జన్యాన్ని ప్రశ్నించింది. తరువాత "విణ్ణిలమేలాప్పూ" అనే ఎనిమిదవ దశకంలో అతని వర్ణంవంటి వర్ణాన్ని కలిగిన మేఘాలను చూసి, ఆర్తిని పొంది, వాటిని ప్రశ్నించి, రామావతారంలో శ్రీరాముని వద్ద నుండి వచ్చిన హనుమంతుని సీతాదేవి దూతగా పంపినట్లు, శ్రీవేంకటాచ లంలోనుండి వచ్చిన ఆ మేఘాలనే దూతలుగా పంపించింది. తరువాత దశకమైన

"శిందురచ్చెంబొడి"లో ఆ వర్షాకాలంలో కనిపించిన వస్తువులు అన్ని అతనిని గుర్తు చేసి తనను బాధ పెట్టడం ఆరంభించడాన్ని పలికింది. " "కార్ కోడల్ పూక్కాళ్" అనే తరువాత దశకంలో ఆ వస్తువులు తనను పూర్తిగా బాధించడాన్ని తెలిపి, " కుమరనార్ శొల్లుమ్ పొయ్యానాల్ నానుమ్ పిఱన్దమై పొయ్యన్ఱే" (నిత్య యౌవనాన్ని కలిగిన శ్రీకృష్ణుడు పలికిన చరమ శ్లోకం అసత్యమైతే, నేను పెరియాళ్వారుల కడుపున పుట్టడం కూడా అసత్యమే కదా) అనే పాశురంలో పెరియాళ్వార్లు కడుపున పుట్టడం, " మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన" (మిత్రుడనే భావంతో నా దగ్గరకు వచ్చి ఆశ్రయించినవానిని నేను ఏ విధంగానూ విడచిపెట్టను) అనే సూక్తి శ్రీరామచరణ శ్లోకం తన విషయంలో అసత్యమై పోతుందా అని సందేహపడి చివరిలో నల్ల ఎంతోలి అనే పదవ పాశురంలో "విల్లిపుదువై విట్టుశిత్తర్ తంగళ్ దేవరై వల్ల పరిశు వరువిప్పరేల్ అదు కాండుమే" (శ్రీవిల్లి పుత్తూరులో వేంచేసి ఉండే పెరియాళ్వార్లు తమ స్వామి అయిన శ్రీ రంగనాథుని తమకు వీలైన ఉపాయాలతో ఆహ్వానించగలిగినవారైతే, అప్పుడు స్వామిని మనం దర్శించగలం) అనే సూక్తి ద్వారా భగవంతుడు పలికిన మాట అసత్యమైనా, తనకు పెరియాళ్వారులతో ఉండే సంబంధం అనేది తనకు తప్పక ఫలాన్ని సిద్ధింప చేస్తుంది అని నిశ్చయించుకున్నది. తరువాత కల "తామ్ ఉగక్కుమ్" అనే దశకంలో " శెమ్మై యుడైయ తిరువరంగర్ తామ్ పణిత్త మెయ్ మ్మై పెరువార్తై విట్టుశిత్తర్ కేట్టిరప్పర్" (ఋజుత్వాన్ని కలిగిన శ్రీరంగనాథుడు తాను పలికిన సత్యమైన చరమ శ్లోకాన్ని పెరియాళ్వార్లు విని, దానిలో నమ్మకాన్ని కలిగి ఉన్నారు) అనే సూక్తి ద్వారా స్వామి ఋజుత్వాన్ని కలిగ ఉన్నవాడు కనుక, దానిని చూసినా నేను ఫలాన్ని కోల్పోవలసిన పనిలేదు– అని మనసులో నిశ్చయించుకున్నది. అప్పుడు అతడు వేగంగా వచ్చి తన దర్శనాన్ని అనుగ్రహించనందున, " శాదిప్పార్ అరినియే" అని బాధతో దశకాన్ని పూర్తిచేసింది. ఈ విధంగా తాను ఫలించకతాతప్పదని నిశ్చయించుకున్న పెరియాళ్వారుల సంబంధం కూడా వేగంగా ఫలించడం కనిపించనందున, తానే స్వయంగా అతని దగ్గరకు వెళ్లాలని ప్రయత్నించినా, తాను ఆ విధంగా వెళ్లలేని రీతిలో బలహీని కలిగి ఉన్నందున, నడువగలిగినవారిని చూసి "నన్ను

అతడు ఉండే చోటుకు తీసుకుని పోయి చేర్చండి"– అని "మ *ற்றிருందీர் கட்மி*" అనే దశకంలోనూ, ఆ విధంగా చేయకపోయినా, అతనికి చెందిన వస్తువులలో దేనినైనా తీసుకొని వచ్చి, నాకు దానితో సంబంధాన్ని కలిగించి, నేను ప్రాణాలను ధరించేటట్లు చేయండి –అని "కణ్ణనెన్నుమ్" అనే 13వ దశకంలో పలికింది.

జన్మించేటప్పుడే "భగవంతుడే రక్షకుడు" అనే నిశ్చయాన్ని కలిగి ఉండే ప్రన్నకులంలో ఈమె పుట్టినప్పటికీ, తన స్వరూపానికి తగని విధంగా తానే నోము నోచి, అతనిని పొందవలసిన రీతిలో కదా, ఈమెకు స్వామి విషయంలో కలిగిన గొప్ప ప్రేమ ఉన్నది. ఇటువంటి గొప్ప ప్రేమను కలిగినదై తిరుప్పావై ప్రబంధంలో "ప్రాప్యం, ప్రాపకం ఆ భగవంతుడే" అని నిశ్చయించుకొని, ఆ తర్వాత అతనిని పొందితే తప్ప ప్రాణాలను ధధరించలేని విధంగా అయినది, ఈమెకు కలిగిన దశ.

ఇంతటి గొప్ప ప్రేమ ఈమెకు ఉన్నప్పటికీ, భగవంతుని అభిప్రాయం వేరే విధంగా ఉన్నది. ఈమెకు తన అనుభవం అనే ప్రాప్యం వంటబట్టాలంటే ఇంతకంటే ఎక్కువగా ఈమె ప్రేమ వృద్ధి చెందాలి. తిన్న ఆహారం జీర్ణం కావడానికి సాధ్యం కాని అజీర్ణ దశలో ఆహారం పెడితే ప్రాణానికి ముప్పు ఏర్పడేటట్లే, మహానందాన్ని జీర్ణం చేసికొనగలిగిన చాలా గొప్ప ప్రేమ అనే పరమ భక్తి ఈమెకు కలిగితే తప్ప, ఈమె మహానందాన్ని భరించలేదు. అందుచేత ఆ పరమ భక్తి కలిగిన తర్వాత దర్శనాన్ని అనుగ్రహించాలి" అనే భావంతో అతడు ఆలస్యం చేశాడు. ఆ తరువాత ఈమె భక్తి ఉత్కృలమై, అతనిని పొందితే ప్రాణాలను ధరించగలగడం, పొందకపోతే నశించి పోవడం అనే స్థితి కలిగి, అతనిని నిర్బంధించి అయినా పొందాలి– అనే స్థితి ఏర్పడింది. ఈ విధంగా పరమ భక్తి కలుగగానే, "ఎన్ ఆవా అఱి చ్చూழ்న్దాయ్ " (నా ఆర్తి అంతా తీరేటట్లు నన్ను సంశ్లేషించావు) అనే విధంగా పరమ భక్తి కలిగిన నమ్మాళ్వార్లకు భగవంతుడు తన సాక్షాత్కారాన్ని కలిగించినట్లే, ఈమెకు కూడా దర్శనాన్ని అనుగ్రహించి స్వీకరించాడు, ఈమెకు కలిగిన పరమ భక్తి, దానికి తగిన విధంగా ఈమె పొందిన గొప్ప మహానందం ఎవరూ మాటలతో చెప్పడానికి వీలు లేని రీతిలో అంతులేనివై ఉన్నందున, ఈ

దశకంలోని ఒక్కొక్క పాశురంలోనూ మొదటి సగంలో "కణ్ణీరే? " అని ప్రశ్నించే మాటగాను, రెండవ భాగం చివర "కండోమ్!"అని బదులు పలుకుతున్న మాటగాను, క్రమంగా తనకు కలిగిన పరమ భక్తిని, దానివల్ల తాను పొందిన మహానందాన్ని ఇద్దరు సంభాషించే విధంగా పలికి, ఈ నాచ్చియార్ తిరుమొழி అనే ఈ ప్రబంధాన్ని గోదాదేవి పూర్తి చేస్తున్నది.

ఈ గోదాదేవి ప్రపన్న కులానికి చెందినదై ఉండగా, పరమ భక్తి వరకు భక్తి పరిణమించిన తరువాతనే ఈమెకు భగవంతుడు తన సాక్షాత్కారాన్ని అనుగ్రహించాడు అనే భావించినప్పుడు, ఈమె సాధన భక్తినిష్ఠ అని చెప్పవలసి వస్తుంది కదా —అని అంటే, సాధన భక్తి నిష్ఠులకు మించిన ఈమెకు భక్తి ఉన్నప్పటికీ, అది ఆర్తి చేత కలిగిన భక్తి తప్ప, భగవంతుని పొందడానికి సాధనం అనే భావనతో అనుష్ఠింపబడిన భక్తి కాదు. అందుచేత ఈమె భక్తి సాధన భక్తి కాదు. ఈమె సిద్ధసాధన నిష్ఠ అయిన శరణాగత అయినా, ఈమెకు ఉత్కృలమైన ఆశ కూడా ఉన్నది. ప్రపన్నులు అందరికీ భగవంతుడే ప్రాపకమై అశ్రయించేటప్పుడు, ఆ స్వామి విషయంలో ఆశ కూడా ఉండి తీరాలి. ఆశ లేకపోతే అతనిని పొందడమే సాధ్యం కాదు. ఆ విధంగా అయితే, ఆ భక్తితోనే ప్రాప్యాన్ని పొందవచ్చు కదా! అని అంటే, సాధన భక్తిని అంగాలతో అనుష్ఠించి పూర్తి చేయడం అనేది దుష్కరమైనది. ఇంతే కాక, భగవంతునకు, తనకు మధ్య ఉండే భర్తృ భార్యా సంబంధాన్ని తెలిసినవారికి, భర్త తనతో పొందిన సుఖానికి కూలి అడిగే భార్య వలె స్వరూపానికి విరుద్ధం కూడా. అందుచేత, భక్తిని ఉపాయం చేయడం అనేది విడువదగినదే తప్ప, అత్యంత ఉన్నతమైన కళ్యాణ గుణాలను కలిగిన భగవంతుని విషయంలో భక్తి నిషేధించదగినది కాదు. ప్రపన్నునకు సమస్త కళ్యాణ గుణాలను కలిగినవాడైన భగవంతుడే ఉపాయం అవుతున్నాడు. ఆ గుణాలే ప్రాప్యం అవుతున్నాయి కూడా. "సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా" (ముక్కుడు అన్ని కళ్యాణ గుణాలను సర్వజ్ఞుడైన బ్రహ్మతో పాటు అనుభవిస్తున్నాడు) అనే విధంగా పరమపదం వెళ్లినప్పటికీ అక్కడ భగవంతుని కళ్యాణ గుణాలే అనుభవించదగినవి అవుతున్నది కదా.

తనకు కలిగిన పరమ భక్తి, ఆ భక్తికి తగినట్లుగా తాను పొందిన మహానందం అనేవి లోకంలో ఏ జీవుని విషయంలోనూ చూడడానికి వీలు కానిది అయినందున, "కండీరే" అని అంటూ ఒక్కొక్క పాశురంలోను పూర్వార్ధం చివర అడుగుతున్నది. స్వామిని దర్శిస్తే తప్ప ప్రాణాలు ధరించలేని తన పరమ భక్తిని "కండోమ్" అని ఉత్తరార్ధంలో వాక్కులో బదులు పలుకుతున్నది. తాను పొందిన మహానందాన్ని కూడా తెలిపి ఈ దశకాన్ని పూర్తి గోదాదేవి పూర్తి చేస్తున్నది. రేపల్లెలోని ఒక గోపికా భావనలో పలికినందున ఇది అన్యాపదేశ ప్రక్రియకు చెందినది. చివరి పాశురంలో "విట్టుశిత్తన్ కోదైశొల్ "అని అన్నందున ఈ విధంగా పాశురాలను పాడినది గోదాదేవి అనే విషయం కూడా వ్యక్తం అవుతున్నది.

*** పట్టి మేయ్ న్దోదోర్ కారేఱు * బలదేవఱ్కోర్ కీழ్ క్కన్దాయ్ **
*ఇట్టీఱిట్టు విళైయాడి * ఇంగే పోద క్కణ్డీరే? ***
*ఇట్టమాన పశుక్కళై * ఇనిదు మఱిత్తు నీరూట్టి **
*విట్టు క్కొణ్డు విళైయాడ * విరుందావనత్తే కణ్డోమే 1*

" విణ్ణాట్టవర్ మూదువర్" (పరమపదంలో ఉండే ప్రాచీనులైన నిత్య సూరులు) (తిరువిరుత్తం—2) అని చెప్పబడే నిత్య సూరలు వయస్సు ముదిరిన మంత్రులవలె, "వానిళ అరశు" (పరమపదంలో యువరాజు) (పెరియాழ్వార్ తిరుమొழి— 3—6—3) అనే విధంగా పరమపదానికి యువరాజు వలె ఉండే పరమపదనాధుని నియమించగా వారికి వశపడి ఉండేవాడై, వారు, "శూట్టు నన్మాలైకళ్" (తిరు విరుత్తం— 21) అనే పాశురంలో చెప్పబడినట్లు తమ వృత్తికి తగినట్లు ఆ స్వామికి తిరుమంజనం చేసి రూపం సమర్పించే వేళలో, " రేపల్లెలో ప్రతి ఇంటిలోనూ వెన్న సమృద్ధిగా ఉన్నది" అని, " నప్పిన్నై పిరాట్టి యవ్వన పరువాన్ని పొందింది" అని విని, పరమపదంలో ఉండే సన్నివేశంలో తృప్తి లేక, ఈ విభూతిలో శ్రీకృష్ణుడై వచ్చి అవతరించి, బృందావనంలో ఇష్టపడి తిరిగి, దానివల్ల సమృద్ధిని పొందిన వృషభంవలె సంచరించిన విషయాన్ని ఈ పాశురం తెలుపుతున్నది.

శ్రీకృష్ణుడు అనే నల్లని వృషభం ఒకటి కావలి అనేది లేకుండా ఇష్టం వచ్చినట్టుగా సంచరిస్తూ, బలరామునకు సాటిలేని అనుజుడై, తన సంతోషానికి వ్యక్తం చేసే విధంగా అనేక విధాలైన కోలాహలాలను చేస్తూ ఈ విధంగా వేయించేయడాన్ని దర్శించారా?

తనకు ఇష్టమైన గోవులను మధురంగా వాటి పేర్లను చెప్పి పిలిచి, వాటికి నీటిని తాగించి, ఈ విధంగా వాటిని మేపుతూ ఆ స్వామి క్రీడించడం బృందావనంలో సేవించాము.

*అనుంగ ఎన్నై ప్పిరివు శెయ్ దు * ఆయర్పాడి కవర్ న్దుణ్ణుమ్ **
*కుణుంగు నాఱి క్కుట్టేట్టు * గగ్గోవర్ ద్దనన్నై క్కణ్డీరే? ***
*కణంగళోడు మిన్ మేగమ్ * కలందాఱ్పోల్ వనమాలై **
*మినుంగ నిన్ఱు విళైయాడ * విరుందావనత్తే కణ్డోమే 2*

వైజయంతి అనే వనమాలను ధరించి, మెరుపు మెరిసే మేఘంవలె ప్రకాశించేవాడై, తన స్నేహితులతో బృందావనంలో ఆడే భగవంతుని మేము దర్శించాము– అని అంటున్నది.

నేను క్లేశపడేటట్టుగా నన్ను విడిచిపెట్టి పోయినవాడై, రేపల్లెను ఆశ్రయించి ఆనందాన్ని అనుభవించేవాడై, వెన్న మురిగిన వాసను కలవాడై, లేత వయస్సులో ఉండే వృషభంవంటివాడై, పశువులను పెంచే శ్రీకృష్ణుని చూశారా?

మెరుపు, మేఘం ఒకదానితో ఒకటి కలసినట్టుగా నల్లని తన తిరుమేనిలో మెరపు వంటి వనమాల ప్రకాశించే శ్రీకృష్ణుని తన స్నేహితుల సమూహంతో పాటు ఆడుతూ ఉండగా బృందావనంలో దర్శించాము.

*మాలాయ్ ప్పిఱంద నంబియై * మాలే శెయ్యుమ్ మణాళనై **
*ఏలా ప్పొయ్ కళ్ ఉరైప్పానై * ఇంగే పోద క్కణ్డీరే? ***

*మేలాల్ పరంద వెయిల్ కాప్పాన్ * వినతై శిఱువన్ శిఱగెన్ను మమ *
మేలాప్పిన్ కీళ్ వరువానై * విరుందావనత్తే కణ్డోమే 3*

గరుడుడు తన రెక్కలతో ఎండ పడకుండా ఉండేటట్లు రక్షిస్తూ ఉండగా, ఆ రెక్కల కింద వేంచేస్తూ ఉండే స్వామిని బృందావనంలో దర్శించాము—అని అంటున్నది.

కన్యల విషయంలో ఉండే ప్రేమే మూర్తిభవించి జన్మించినవాడనే విధంగా ఉండేవాడై, ప్రేమే వ్యక్తం చేసేవాడై, పొసగని అసత్యాలను చెప్పేవాడైన శ్రీకృష్ణుని ఈ విధంగా వస్తూ ఉండగా దర్శించారా?

పైన వ్యాపించిన ఎండను స్వామి తిరుమేనిపై పడకుండా అడ్డుకోవడం కోసం గరుడుని రెక్కలు అనే మేల్ కట్టు కింద వస్తూ ఉండే ఆ స్వామిని బృందావనంలో దర్శించాము.

*కార్ తణ్ కమల క్కణ్ ఎన్ను మ్ * నెడుంకయిఱు పడుత్తు * ఎన్నై
ఈర్త్తు క్కొణ్డు విళైయాడుమ్ * ఈశన్ తన్నై క్కణ్డీరే? **
పోర్త్త ముత్తిన్ కుప్పాయ * పుగర్ మాల్ యానై క్కన్ఱే పోల్ *
వేర్త్తు నిన్ఱు విళైయాడ * విరుందావనత్తే కణ్డోమే 4*

అలంకరింపబడిన ఏనుగును గున్నవలె ఉండేవాడు, స్వేదాన్ని కలవాడై ఆడుకునే శ్రీకృష్ణుని శ్రీ బృందావనంలో దర్శించాము —అని అంటున్నది.

నల్లని మేఘంలో చల్లని తామర పూచినట్లుగా ఉండే కన్నులు అనే పెద్ద పాశంలో నన్ను బంధించి, తాను పోయే చోటికి అంతటికి నా మనస్సును లాగుకునిపోయే స్వామిని దర్శించారా?

దట్టంగా ముత్యాలతో పొదిగిన కంచుకాన్ని కలిగినదై, తేజస్సును కలిగినదైన పెద్ద ఏనుగున్నవలె ఉండేవాడు, స్వేదజలాన్ని కలవాడై ఆడుతూ ఉండే శ్రీకృష్ణుని బృందావనంలో దర్శించాము.

*** మాదవన్ ఎన్ మణియినై * వలైయిల్ పిళ్ళైత్త పన్ది పోల్ *
ఏదుమ్ ఒట్టుమ్ కొళ త్తారా * ఈశన్ తన్నై కణ్ణిరే? **
వీదగ ఆడై ఉడై త్తాళ్ * పెరుంకార్ మేగ క్కన్ఱే పోల్ *
వీది ఆర వరువానై * విరుందావనత్తే కణ్ణోమే 5

మెరుపు తీగలో కూడిన చిన్న కారు మబ్బువలె, పీతాంబరాన్ని ధరించి వీధిలో వచ్చే శ్రీకృష్ణుని బృందావనంలో దర్శించాము– అని అంటున్నది.

లక్ష్మీనాథుడై, నాకు నీల రత్నం వలె మిక్కిలి భోగ్యమైనవాడై, వలలో నుండి బయటపడిన వరాహం వలె పొగరును కలిగి, తన దగ్గర ఉండేదేనిని ఇతరులకు ఇవ్వనివాడైన (ఎవరి చేతికి అందనివాడైన) శ్రీకృష్ణుని మీరు దర్శించారా?

పీతాంబరమనే వస్త్రం నడుములో వెలుగుతూ ఉండగా, ఒక పెద్ద నల్లని చిన్న మేఘం వలె ఉండేవాడచ, వీధిలో నిండుగా వచ్చే శ్రీకృష్ణుని బృందావనంలో దర్శించాము.

తిరుమమ్ అఱియా క్కుఱుంబినై * త్తన్ కై చ్చార్ ఙ్గమ్ అదువే పోల్ *
పురువ వట్టమ్ పొగియ * పొరుత్తమిలియై కణ్ణిరే? **
ఉరువు కరిదాయ్ ముగమ్ శెయ్ దాయ్ * ఉదయ ప్పురుప్పదత్తిన్ మేల్ *
విరియుమ్ కదిరే పోల్వానై * విరుందావనత్తే కణ్ణోమే 6

ఉదయగిరిపై ఉదయించే సూర్యునివలె, నల్లని తిరుమేనిలో ఎర్రగా ప్రకాశించే వెలుగుతో వచ్చేవానిని బృందావనంలో చూశాము –అని అంటున్నది.

జాలి అనేది ఏ కొంచెం తెలియనివాడై, తుంటరి పనులను చేసేవాడై, తన చేతిలో ఉండే శార్ ఙ్గం అనే ధనుస్సు వంటి కనుబొమలతో అందాన్ని పొందినవాడై, ఆ అందాన్ని భక్తులకు అనుభవించేటట్లుగా చేసే పొందికను లేనివాడైన స్వామిని చూశారా?

తిరుమేనిలో నల్లని వర్ణాన్ని కలిగి, కాంతిలో ఎర్రదనాన్ని కలిగి ఉండడంవల్ల ఉదయ పర్వతంపైన ఉదయిస్తున్న సూర్యునివలె ప్రకాశించే స్వామిని బృందావనంలో దర్శించాము.

*పొరుత్తముడైయ నంబియై * పువ్వణమ్ పోల్ ఉళ్ళుమ్ కరియానై *
కరుత్తై పిళ్ళైత్తు నిన్ఱ * అక్కరు మాముగిలై క్కణ్డీరే? **
అరుత్తి త్తారా కణంగళాల్ * ఆర పెరుగు వానమ్ పోల్ *
విరుత్తమ్ పెరిదాయ్ వరువానై * విరుందావనత్తే కణ్డోమే 7*

నక్షత్ర సమూహంలో కూడిన పెద్ద ఆకాశంవలె తన స్నేహితుల మధ్యలో వచ్చే స్వామిని బృందావనంలో దర్శించాము– అని అంటున్నది.

సాటిలేని స్వామియై, శరీరంలో వలె మనస్సులో కూడా నల్లని రంగును కలవాడై, నేను భావించే భావనను మించినవాడై, నల్లని పెద్ద మేఘంవలె ఉండేవాడైన శ్రీకృష్ణుని దర్శించారా?

కామ్య ఫలాలను కోరేవారిచే ఆశించబడే నక్షత్ర సమూహాలతో మిక్కిలిగా నిండి ఉండే ఆకాశంవలె, పెద్ద, స్నేహితుల సమూహంలో కలసి వచ్చే స్వామిని బృందావనంలో దర్శించాము.

*వెళియ శంగు ఒన్ఱుడైయానై * పీదగ ఆడై ఉడైయానై *
అళి నన్ఱుడైయ తిరుమాలై * ఆళియానై క్కణ్డీరే? **
కళి వణ్డెంగుమ్ కలందాఱ్పోల్ * కమ్ఴ పూంకుళల్ కళ్ తడంతోళ్ మేల్ *
మిళిర నిన్ఱు విళైయాడ * విరుందావనత్తే కణ్డోమే 8*

పూలపై దట్టంగా వాలిన తుమ్మెదలా? అనేటట్లుగా ఉండే కేశాలు భుజాలపై వెలుగుతూ ఉండగా, ఆడుతున్న శ్రీకృష్ణుని బృందావనంలో దర్శించాము– అని అంటున్నది. తెల్లని శ్రీపాంచజన్యం అనే శంఖాన్ని చేతిలో కలవాడై, పీతాంబరాన్ని ధరించే వస్త్రంగా కలిగినవాడై, చక్కని కృపను కలిగినవాడై, శ్రీ సుదర్శనాన్ని కలవాడై, శ్రీనాథుడై ఉండే శ్రీకృష్ణుని దర్శించారా?

మకరందాన్ని పానం చేయడం చేత మత్తెక్కిన తుమ్మెదలు వ్యాపించినట్లుగా ఉండే, పరిమళిస్తున్న అందమైన కేశపాశం పెద్ద భుజాలపై వాలి వెలుగుతూ ఉండగా ఆడే శ్రీకృష్ణుని బృందావనంలో దర్శించాము.

*** నాట్టై ప్పడై ఎన్దు అయన్ ముదలా త్తంద * నళిర్ మామలర్ ఉంది *
వీట్టై ప్పణ్ణి విళైయాడుమ్ * విమలన్ తన్నై కణ్ణిరే? **
కాట్టై నాడి త్తేనుగనుమ్ * కళిఱుమ్ పుళ్ళుమ్ ఉడన్ మడియ *
వేట్టైయాడి వరువానై * విరుందావనత్తే కణ్ణోమే 9

అరణ్యంలో పలువురు అసురులు అనే దుష్టులను వేటాడి వచ్చే శ్రీకృష్ణుని బృందావనంలో దర్శించాము– అని అంటున్నది.

"లోకాలను సృష్టించు" అని బ్రహ్మ మొదలైన ప్రజాపతులను సృష్టించే చల్లని పెద్ద కమలన్ని కలిగిన నాభి అనే ఇంటిని సృష్టించి, ఈ విధంగా లీలారసాన్ని అనుభవిస్తున్న పరమ పావనుడైన భగవంతుని దర్శించారా?

ధేనుకాసురుడు, కువలయాపీడం అనే ఏనుగు, బకాసురుడు అనే వీరు వెంటనే నశించేటట్లుగా అరణ్యానికి వెళ్లి వేటాడి వచ్చే స్వామిని బృందావనంలో దర్శించాము.

*** పరుంతాళ్ కళిట్రుక్క రుళ్ శెయ్ దు * పరమన్ తన్నై * పారిన్ మేల్
విరుందావనత్తే కణ్ణమై * విట్టుశిత్తన్ కోదై శొల్ **
మరుందామ్ ఎన్దు తమ్ మనత్తే * వైత్తు క్కొణ్ణు వాళ్వార్గళ్ *
పెరుంతాళుడైయ పిరానడి క్కీళ్ * ప్పిరియాదెన్దుమ్ ఇరుప్పారే 10

ఈ దశకాన్ని అనుసంధించేవారు నిత్యం భగవంతునకు ఏ విచ్ఛేదం లేని కైంకర్యాన్ని చేయగలరు– అని ప్రయోజనాన్ని పలికి, ఈ ప్రబంధాన్ని గోదాదేవి పూర్తి చేస్తున్నది.

పెద్ద పాదాలను కలిగిన గజేంద్రుని అనుగ్రహించిన పరమాత్మను ఈ భూమిలో బృందావనంలో దర్శించిన విషయాన్ని గూర్చి పెరియాళ్వార్ల పుత్రిక అయిన గోదాదేవి అనుగ్రహించిన ఈ పాశురాలు" సంసారం అనే వ్యాధికి మందు కాగలదు" అని తలచి తమ మనస్సులలో వీనిని అనుసంధిస్తూ ఉజ్జీవించేవారు గొప్పతనాన్ని కలిగిన శ్రీ చరణాలను కల భగవంతుని శ్రీ చరణాల సమీపంలో ఎల్లప్పుడూ, ఏవిశ్లేషం లేకుండా, నిత్యానుభవాన్ని పొందగలరు.